

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 172 పేజీలు: 12 వెల: 6.50

**ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు**

**గాజాలో యుద్ధం ఆగాలని 25 దేశాల సంయుక్త ప్రకటన** 9లో



## సంక్షేమ హాస్టళ్లు ఇలాగేనా?

### సోషల్ వెల్ఫేర్, బిసి, గురుకుల హాస్టళ్లలో ఏమిటీ దుస్థితి?

### కోట్లలో వ్యయం ఏమవుతోంది?

### పనులన్నీ కాంట్రాక్టర్ల లబ్ధికోసమేనా?

### పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని సిఎస్‌కు హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** సాంఘిక సంక్షేమ, బిసి, గురుకుల హాస్టల్స్‌లో వసతుల లేమిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసిందిజ హాస్టల్స్‌లో పరిస్థితులు చక్కదిద్దలేదంటూ అధికారులపై మండిపడింది. ఈ విషయంలో ఏమీ తెలియనట్లు ఎలా మిన్నకుండి పోతున్నారని ప్రశ్నించింది. ఏటా ప్రభుత్వంచేసే కోట్లాది రూపాయల ఖర్చులు ఎక్కడికి వెళుతున్నాయనే సందేహాన్నివ్యక్తంచేసింది. కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే >>2

## పంటల వివరాలపై శాటిలైట్ సర్వే



మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, జలవనరుల శాఖపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

### ల్యాండ్ రీసర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ

### 47 లక్షలు పైగా 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల ఇ-కెవైసి పూర్తి

### త్వరలో సాగునీటి సంఘాలతో వర్చువల్ సమావేశాలు

### జలవనరుల అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయరంగంలో ఆధునాత పద్ధతులను అవలంబిద్దాం,అన్ని రకాల పంటల్లో అత్యధిక దిగుబడులు సాధిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉద్యాన పంటలను విస్తరిద్దామన్నారు. రాష్ట్రమంతటా ఏ సర్వే నెంబర్ భూమిలో ఏ పంటలు పండిస్తున్నారనే పంటల వివరాలు శాటిలైట్ సర్వే ద్వారా సేకరించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వేతో సమగ్ర సమాచారం వెల్లడైందన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం, శాటిలైట్ సర్వే సమాచారం సరిపోల్చాలని స్పష్టం చేశారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతులకు దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. రైతు సేవా కేంద్రం నుంచి ఈ మేరకు నిరంతరం సూచనలు, సహకారం వారికి అందించాలన్నారు. రీసర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరిగిన తర్వాత వ్యవసాయ రికార్డులు కూడా నవీకరించాలని అధికారులను ముఖమంత్రి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై సిఎం చంద్రబాబు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటలకు పైగా వ్యవసాయంఅనుబంధ రంగాలపై లోతైన చర్చజరిపి... రైతులకు మేలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, జలవనరులశాఖ అధికారులతోనూ సమీక్షనిర్వహించి నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు.

**రైతులకు సహకారానికి ఎఐ చాట్ బోట్**

పంటల ప్రణాళిక, ఉత్పత్తులకు విలువ జోడింపు, రైతులకు సహకారం అందించేందుకు ఏఐ చాట్ బోట్ వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని వారికి అందేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఇప్పటి వరకూ 47,41,792 మంది రైతుల వివరాలతో అన్నదాత సుఖీభవ పథకం కింద ఇకెవైసి పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇ పంట ద్వారా అర్హులను గుర్తించాలని, రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయరంగం అభివృద్ధికి తాను అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని... త్వరలో సాగునీటి సంఘాలతో >>2



మంగళవారం రాష్ట్రపతిని కలుసుకున్న రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్

## బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

### రాజ్యసభ ప్రస్తుత డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కే దక్కే అవకాశం

**న్యూఢిల్లీ, జూలై 22:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీ చేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. బిజెపితోపాటు ఎన్డీయే పక్షాలకు చెందిన నేతకూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈనేపథ్యంలో జనతాదళ్ (యునైటెడ్) ఎంపి, రాజ్యసభ డిప్యూటీ >>2



**భవిష్యత్తులో నటిస్తానో లేదో చెప్పలేను, సిఎంతో సంప్రదించాకే ఏ నిర్ణయమైనా..**

**పారదర్శకంగా ఉండాలన్నదే నా అభిమతం, ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌లో మార్పు రావడంలేదు**

**మీడియాతో డి.సిఎం పవన్ కల్యాణ్**

## నా ప్రాధాన్యత రాజకీయాలే

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ విషయంలోనైనా నిక్కచ్చిగా తాను ఉంటానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. తాను విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. రాజకీయాల్లో పారదర్శకతే తనకు ఇష్టమన్నారు. మంగళవారం ఎపి సచివాలయంలో పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాంశాలపైన, తన కొత్త సినిమా హరిహర వీరమల్లు చిత్రం ప్రమోషన్స్‌పై ఆయన మాట్లాడారు, సినిమాలకు సంబంధించి తాను తీసుకునే ప్రతి నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెడతానన్నారు. ఆయన అభిప్రాయాలను గౌరవించే దిశలో తన నిర్ణయాలుంటాయన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినప్పటికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌లో మార్పు రావడంలేదన్నారు.

ఇక హరిహర వీరమల్లు చిత్రం కోసం కష్ట పడి పని చేసాను. నేను రాజకీయాల్లోకి వెళ్లినందున సినిమాలు ఏదో తూతూ మంత్రగా చేస్తాడని అనుకోవద్దని ఇందులో చాలాకష్టపడ్డాను. కెరీర్ ప్రారంభంలో ఎలా చేశానో ఇప్పుడు కూడా మార్షల్ ఆర్ట్స్ కోసం అంతేకష్టపడ్డా. అయితే కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉండడం వల్ల బాడీ ఫ్లెక్సిబిలిటీ పోయింది. శరీరం సహకరించలేదు. అయినా శ్రమించా. క్లైమాక్స్‌ను నేనేకొరియోగ్రఫీ చేసి డిజైన్ చేశానుఅని పవన్ చెప్పారు. జగన్ పాలనలో ఎన్నో కుటుంబాలు మద్యం కారణంగా బలయ్యారన్నారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారన్నారు. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులుతినేశారు.. జనం ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలుచేసి ఇక్కడ నిలబడ్డామని.. ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించుకోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..? అని ప్రశ్నించారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్ని ఇప్పటికే సిఎం చంద్రబాబుకి చెప్పానన్నారు. సిఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లనుకూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని >>2

## రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

### జనజీవనం అస్తవ్యస్తం

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడ నగరంలో మంగళవారం జోరు వాన కురిసింది. రోడ్లపై వాన నీరు చేరి వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బంది కలిగింది. నగరంలోని లోతట్టు ప్రాంతదారుల్లో వాన నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏలూరు, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, భీమవరం నగరాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి.. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో పంట సాగు పనులు ఊపందుకున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షంతో ఎట్టకేలకు సార్వా సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. మొగల్తూరు మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. పెనుమంట్రలో చిరుజల్లులు పడుతున్నాయి. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. >>2



మంగళవారం ఉండవల్లిలో అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి లోకేష్

## మంగళగిరిపై ఐటి కంపెనీల ఆసక్తి!

### రెండోవిడత ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు

### నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం

**మంగళగిరి, జూలై 22, ప్రభాతవార్త:** ఐటి, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, భవిష్యత్‌లో 50వేల మంది పనిచేసేందుకు అవకాశం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. మంగళగిరిలో వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నవారికి రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

మిగిలిన ఇళ్ల పట్టాల విషయంలోనూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం!ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గవ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉంది. >>2

## మాజీమంత్రి నారాయణ స్వామిని విడియోకాల్‌తో విచారణ

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి నారాయణస్వామిని సిట్ బృంద వీడియో కాల్ ద్వారా విచారించినట్లు సమాచారం. తాను అనారోగ్యం కారణంగా విచారణకు రాలేనని నారాయణస్వామి స్పష్టం చేసిన సందర్భంలో సిట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబు తున్నారు. ప్రభుత్వం దుకాణాలు తీసుకొస్తే మద్యం వినియోగంతగ్గుతుందని, ప్రజలను మద్యంనుండి దూరం చేయవచ్చని తనకు చెప్పారని అంతకుమించి నూతన మద్యం విధానం గురించి తనతో ఏమీ చర్చించలేదు' అని గత ప్రభుత్వహయాంలోఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన కె.నారాయణ స్వామి సిట్ >>2

## తిరుమలలో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు

### శ్రీవారి సేవ విస్తరణకు నలుగురు కోఆర్డినేటర్లు

### రూ.4.35కోట్లతో ఒంటిమిట్టరామాలయంలో నూతన అన్నదాన భవనం

### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు

## వైకుంఠమ్-3 క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై నిపుణుల కమిటీ!

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరాన్ని పరిశీలించేందుకు నిపుణులతో టిటిడి కమిటీ వేయనుంది. ఈ కమిటీ క్షుణ్ణంగా ఇప్పుడున్న పరిస్థితులను అంచనావేసి, ఆలయం వెలుపల క్యూలైన్లను నియంత్రించేందుకు అధ్యయనం చేయనుంది. ఆ తరువాత సమర్పించే నివేదిక ఆధారంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా తిరుమలలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు టిటిడి పాలకమండలి నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరుతుండటంతో అందుకు అనుగుణంగా భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో లాంజ్‌ల తరహాలో విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటుచేయనుంది. అనువైన నిర్మాణాలు చేపట్టడంపై కన్సల్టెన్సీలతో కమిటీ ఏర్పాటు కానుంది. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు ఇతోధికంగా సేవలందిస్తున్న శ్రీవారిసేవ స్వచ్ఛంద సేవను మరింత విస్తరించి పటిష్టంగా అమలు చేసేందుకు నలుగురు >>2



మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి పాలకమండలి సమావేశం దృశ్యం

## గ్రామాలకు కొత్త పేర్లు!

### మార్పుల పరిశీలనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు పేర్ల మార్పులు, చేర్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ అంశంపై అధ్య యనం చేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిలో సభ్యులుగా ఏడుగురు మంత్రులను నియమించింది. వీరిలో అనగాని సత్య ప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బిసి జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లు ఉన్నారు. ఈ కమిటీకి కన్వీనరుగా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఉప మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రులు పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతంచారిత్రక,సాంస్కృతికనేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకో వాలి. సామాజిక, ఆర్థిక,అభివృద్ధి కోసం అంతరాలు లేని విధంగా ప్రాంతాలను నిర్దేశించాలని పేర్కొంది. సరిహద్దులు, పేర్లపై ప్రజలు,ప్రజా ప్రతినిధులు నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని దిశా నిర్దేశం చేసింది.

## తోతాపురి మామిడి రైతుకు భారీ ఊరట

### క్వింటా మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ధర రూ. 1490

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడి రైతులకు ఉపశమనం లభించింది. క్వింటా మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను రూ.1490గా నిర్ణయిస్తూ కేంద్రం నుంచి ప్రకటన వెలువడింది. 50-50 నిష్పత్తిలో కేంద్రం, ఎపి ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను చెల్లించనున్నాయి. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుంది. 2025-26 సంవత్సరానికి ఎంఐసికింద ధరల లోపం చెల్లింపు (పిడిపి)ను కేంద్రం ఆమోదించించింది. కేంద్రం నిర్ణయంతో ఎపిలో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలుకు అవకాశం లభించినట్లైంది. మామిడి రైతులకు క్వింటాల్‌కు రూ.1,490.73లు చెల్లించనున్నారు. కేంద్రం, ఎపి ప్రభుత్వం సగం,సగం నిష్పత్తిలో ఈ మద్దతు ధర చెల్లించనున్నాయి. కేంద్రం నిర్ణయంతో తోతాపురి రైతుకు భారీ ఊరట లభించే >>2



తోటలో ఆరబోసిన తోతాపురి మామిడి కాయలు

## నకిలీ మద్యం ముఠా పట్టివేత

### 36 మంది అరెస్టు, 2200 లీటర్ల అక్రమ స్పిరిట్ స్వాధీనం

**విజయవాడ, జూలై 22, ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యంవ్యాప్తిని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక దాడుల ఫలితంగా భారీవిజయం నమోదు అయ్యింది. ఆధునీకరించిన నిఘా వ్యవస్థ, డేటా విశ్లేషణ ఆధారంగా చేపట్టిన చర్యల్లో ముప్పై ఆరు మందిని అరెస్టు చేయడంతో పాటు రెండు వేల రెండు వందల ముప్పది రెండు లీటర్లకు పైగా అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుళ్లు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రధానంగా ప్రజారోగ్యం, నాణ్యమైన మద్యం సరఫరాపై దృష్టి సారించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు నకిలీ మద్యం నిర్మూలనపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ మీనా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా చర్యలు చేపట్టారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డేటా ఆధారంగా స్పిరిట్ వినియోగంలో అనుమానాస్పద మార్పులను గుర్తించి ప్రత్యేక దాడులు నిర్వహించారు. జూన్ నెల 23 >>2



మంగళవారం తిరువనంతపురంలో మాజీ సీఎం అచ్యుతానందన్ భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్, సిఎం పినరై విజయన్

## రైల్వే పరీక్ష పేపర్ లీకేజీ కేసులో 8 మందికి జైలు

### సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో నేరారోపణలు రుజువు

**గుంతకల్లు రైల్వే, జూలై 22, ప్రభాత వార్త:** రైల్వే పరీక్ష పేపర్ లీకేజీ కేసులో 08 మంది రైల్వే సిబ్బందిపై నేరారోపణలు రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, ఒకొక్కరు రూ.5లక్షల రూపాయల జరిమానా విధిస్తూ అహ్మదాబాద్ సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిసింది.

## మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభ కోణం కేసులో నిందితులకు విజయవాడ ఎసిబి కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఆగస్టు1 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో 11 మంది నిందితులకు రిమాండ్ ముగియడంతో సిట్ అధికారులు మంగళవారం కోర్టులో హాజరు పర్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు నిందితులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి సహా 11 మందికి రిమాండ్ పొడిగించింది.

## ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వదర నీరుచేరుతోంది. దీంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో 20,478 క్యూసెక్కులు కాగా, 25 గేట్లు అడుగు మేర ఎత్తి దిగువకు 18,125 క్యూసెక్కులు, కాల్వలకు 2,623 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇదే సందర్భంగా బ్యారేజీ బ్రాంచ్ కెనాల్స్‌కు నీటి విడుదల చేసారు.

## ఎసిబి కోర్టులో భావోద్వేగానికి గురైన చెవిరెడ్డి

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎసిబి కోర్టులో తన వాదనలు వినిపించుకునే క్రమంలో తుడా మాజీ ఛైర్మన్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి, తన సోదరుడు మద్యం కారణంగానే చనిపోయారని న్యాయాధికారికిచెప్పిన చెవిరెడ్డి.. తనను మద్యం వ్యాపారం చేయవద్దని తండ్రి చెప్పినట్టు వెల్లడించారు. తండ్రి, తమ్ముడు చనిపోవడంతోనే తాను లిక్కర్ జోలికి వెళ్లలేదని, చేయని తప్పుకు శిక్షణ అనుభవిస్తున్నందుకు బాధగాఉందని ఎమోషనల్ అయ్యారు.



మంగళవారం న్యూఢిల్లీలో కన్వరియ యాత్రలో పాల్గొన్న ఢిల్లీ సిఎం రేఖాగుప్త

# నా ప్రాధాన్యత రాజకీయాలే

>> చెప్పానని.. అందుకు సిఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు.
తన తాజా సినిమా ప్రమోషన్లలో ఉన్నానన్నారు. హరిహర వీరమల్లు ప్రమోషన్స్ కోసం పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగి ప్రమోషన్స్ చేస్తున్నారు.. పవన్ సినిమా గురించి . ఈ క్రమంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహారిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సిఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సిఎంకు చెప్పిన అనంతరమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.
జానీ ఫ్లాప్ గురించి అడగ్గా పవన్ సమాధానమిస్తూ.. నేను చిరంజీవి తమ్ముడు అయి ఉండి, అప్పటికి హిట్స్‌లో ఉన్నా జానీ ఫ్లాప్ అయ్యాక డిస్ట్రిబ్యూటర్స్, ఫైనాన్షియర్స్ నా ఇంటి మీదకు వచ్చేసారు డబ్బులు కోసం. అది సినిమా రిలీజయి అయిదు రోజులు, పది రోజుల తర్వాత కూడా కాదు. ఫస్ట్ షో పడింది బాగోలేదు అనగానే వచ్చేసారు సినిమా ఆడట్లేదు, మా డబ్బులు పోయాయి అని. అప్పుడు హిట్ అయితే నాకేం ఇచ్చారా అనే ప్రశ్న నామైండ్‌లో వచ్చింది. కానీ అక్కడ అది ఆలోచించరు. దానిని నేను కంప్లైంట్ చేయను. అప్పుడు అన్ని ఆర్థిక బంధాలే అని అనిపించింది. అప్పుడు నా రెమ్యునరేషన్ వెనక్కి ఇచ్చేసాను. సినిమా ఫ్లాప్ అయితే బాధపడమని ఇండైరెక్ట్‌గా చెప్పారు. అప్పుడు నేను ఒంటరిగా ఉన్నాను. ఆ సమయంలో 15 లక్షలు అప్పు చేశాను అవన్నీ క్లియర్ చేయడానికి. ఆ అనుభవం నన్ను బలమైన వ్యక్తిగా మార్చింది. జానీ ఫెయిల్యూర్ నాకు పాలిటిక్స్‌లో హెల్ప్ చేసింది. 2019లో ఓడిపోతే ఆ రోజులే గుర్తొచ్చాయి. ఫెయిల్యూర్ అనేది లైఫ్‌లో ఒక పార్ట్ అంతే అని అన్నారు. నా ప్రయారిటీ రాజకీయాలే ప్రస్తుతం. సినిమా నా లైఫ్‌లో భాగం. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతర్వాత యాక్టింగ్ చేస్తానో లేదో తెలీదు. కానీ నిర్మాతగా నా పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ మీద మాత్రం సినిమాలు చేస్తాను అని తెలిపారు.

# శాటిలైట్ సర్వే

>> వర్చువల్ సమావేశాలు సైతం నిర్వహించి వారితో నేరుగా మాట్లాడతానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో దక్షిణ కోస్తాలోని కొన్ని జిల్లాలు మినహా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్‌లలో ప్రధాన ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని.. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రంలో 9.90 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతోందని చెప్పారు. అయితే, వర్షాధారంగానే పంటలు పండించేలా పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గాలి**

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగిస్తున్నారని... ఈ కారణంగా భూసారం తగ్గిపోతోందని... ఎరువులు, పురుగు మందులు ఏమేరకు వాడాలో రైతులకు వివరించి... వాటిని అధికంగా వినియోగించకుండా నియంత్రించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 36.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, అంతకుముందు ఏడాదితో 12 శాతం మేర తగ్గిందని అధికారులు వెల్లడించారు. అలాగే, 202425లో 1,733 మెట్రిక్ టన్నుల పురుగుమందులు రాష్ట్రంలో వినియోగం జరిగిందని తెలిపారు. అయితే, ఆర్గానిక్‌బయో ఫెర్టిలైజర్ల వినియోగంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**పొగాకు, మామిడి కొనుగోళ్లపై కలెక్టర్లకు ఆదేశాలు**

ఈ సీజన్‌లో వ్యవసాయ అధికారులను ఇతర వ్యవసాయేతర విధులకు వినియోగించొద్దని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. హెచ్డీ బర్లీ, మ్యాంగో రైతులకు చెల్లింపులపైనా సీఎం మాట్లాడారు. మార్క్ ఫెడ్ నుంచి రెండు విడతల్లో బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆగస్టు 20 లోగా హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తోతాపురి మామిడి కొనుగోళ్లపై ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన ముఖ్యమంత్రి ఆగస్టు 15 లోగా మామిడి రైతులకు కూడా డబ్బులు చెల్లించాలని చెప్పారు. విలువ జోడింపులో భాగంగా కవర్ బ్యాగుల్లో పండించిన తోతాపురి మామిడి పళ్ల నాణ్యతను సీఎం పరిశీలించారు. టేబుల్ వెరైటీ పండించడం ద్వారా దేశీయంగా, పల్ప్ లాంటి ఉత్పత్తులతో విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కొనుగోళ్లు జరపని కంపెనీలపైనా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

# యుఎఇ ఆర్థిక మంత్రితో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ ఆర్థిక మంత్రి హెచ్ఇ అబ్దుల్లా బిన్ టౌక్ ఆల్మరీ తో ఏపీ సీఎం చంద్రబాబు కీలక బేటీ అయ్యారు., తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం రాత్రి జరిగిన బేటీలో లులూ అంతర్జాతీయ వాణిజ్య సంస్థ యూసప్ ఆలీ ఎంఎ, ఆ సంస్థ వాణిజ్య విభాగం ఎండీ ఆదీమ్ అహ్మద్‌తోను సీఎం చంద్రబాబు వాణిజ్య, పెట్టుబడుల అంశాలపై చర్చించారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు తన "ఎక్స్" ఖాతాలో వెల్లడించారు. ఏపీ అభివృద్ధి శరవేగంతో జరుగుతున్న అంశంతో పాటు, రాష్ట్రంలో అనే జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రూ.లక్షలకోట్లు పెట్టుబడులు ఆసక్తి చూపించడంతో క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ చేసిన విషయాన్ని వివరించారు. విజయవాడలో లులూ మాల్ ఏర్పాటు, అవసరమైన స్థల సేకరణ ఇతర కీలకంశాలుపై సీఎం యుఎఇ ఆర్థికమంత్రి, లలూ సంస్థ కీలక బాధ్యులతో చర్చించారు. ఈ చర్చలో చేసుకున్న ఒప్పందాలు, ఇతరంశాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఈ బేటీలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

# మద్యం ముఠా పట్టివేత

>> తేదీ నుంచి జూలై 22వ తేదీ వరకు కోరింగిపాలెం, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో దాడులు జరిగాయి. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే ఖాళీ బాటిళ్లు, సీలింగ్ యంత్రాలు, లేబుళ్లు, మిషన్లు స్వాధీనం చేసుకోవటం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ జిల్లాలో ఉన్న కృష్ణ ఫార్మా కంపెనీ ఈ ముఠాకు మూలంగా గుర్తించబడింది. కరోనా మహమ్మారి సమయంలో తాత్కాలికంగా మంజూరైన అనుమతిని దుర్వినియోగం చేస్తూ, స్పిరిట్‌ను హ్యాండ్ రబ్ పేరుతో డెనేచర్ చేయకుండా నేరుగా నకిలీ మద్యం తయారీదారులకు పంపినట్లు విచారణలో తేలింది. కంపెనీ యజమాని మల్లికార్జున రావు నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు రుత్తల శ్రీనివాస్ అలియాస్ అబ్దుల్ కలాం, చరణ్జీత్ సింగ్ సెథీలకు స్పిరిట్ సరఫరా చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.
ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ఇచ్చిన సమాచారంతో తెలంగాణ ఎక్సైజ్ అధికారులు స్పందించి, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో జూలై 21 వ తేదీన ఎనిమిది వందల లీటర్ల స్పిరిట్, నకిలీ లేబుళ్లు, ఖాళీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ముంబయిలోని సరఫరాదారుల నుంచి తెచ్చిన ఖాళీ బాటిళ్లు, బ్రాండ్ లేబుళ్లు కూడా నిందితుల వద్ద లభించాయి. డెనేచర్ చేయని స్పిరిట్‌ను నేరుగా మద్యం తయారీలో వాడటం వల్ల ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కమిషనర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, నిఘా వ్యవస్థను ఆధునీకరించి, డేటా ఆధారంగా చర్యలు చేపట్టడం వల్లే ఈ ముఠాను ఛేదించగలిగామని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ, ప్రతి నేరంలో భాగమైన వ్యక్తిని గుర్తించి శిక్షించడానికి శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని అన్నారు. నిఘా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో ఇటువంటి ముఠాలకు రాష్ట్రంలో తావు ఉండదని స్పష్టం చేశారు.
కృష్ణ ఫార్మా కంపెనీ లైసెన్సు రద్దు చేయాలని తెలంగాణ అధికారులను ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ కోరనుంది. అంతర్రాష్ట్ర సమన్వయంతో మిగిలిన నిందితులను గుర్తించి శిక్షించే ప్రక్రియ కొనసాగుతుంది. నకిలీ మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ ఆపరేషన్‌తో ప్రజలకు నాణ్యమైన మద్యం అందే మార్గం సుగమం అయింది. నిబంధనలు పాటించే మద్యం వ్యాపారానికి భరోసా పెరిగింది. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలను మరింత వేగవంతం చేసింది.

# నిర్మాణంపై నిపుణుల కమిటీ!

>> కోఆర్డినేటర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీచేయనున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో 85 ప్రతిపాదనలతో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో భక్తులకు సౌకర్యాలు, పలు అభివృద్ధిపనులు చేపట్టడంపై కీలకంగా చర్చించి నిర్ణయాలు వెలువరించింది. మధ్యాహ్నం బోర్డు తీర్మానాలు, ఆమోదం పొందిన అంశాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు మీడియాప్రతినిధులకు వెల్లడించారు. కడపజిల్లా ఒంటిమిట్టలోని టిటిడి ఆధ్వర్యంలోని కోదండరామస్వామి ఆలయానికి రోజువారీగా విచ్చేస్తున్న భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు 4.35కోట్ల రూపాయలతో నూతన అన్నదాన భవనం నిర్మించేందుకు ఆమోదించారు. ఆగస్టునెల నుండి ఒంటిమిట్ట ఆలయంలో మూడుపూటలా అన్నప్రసాద వితరణ చేయాలని నిర్ణయం. కడపలో వేల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరుచేశారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)అమలుచేసి సామాన్యభక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి 10లక్షల రూపాయలనుండి 20లక్షల రూపాయలకు వ్యయం పెంచారు. తిరుమలలోని శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్, డిపిఆర్ రూపొందించాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఒక సబ్‌కమిటీ ఏర్పాటుచేసి, ఆకమిటీ ఇచ్చే నివేదికప్రకారం తదుపరి చర్యలుతీసుకోనున్నారు. శ్రీవారి భక్తులు సైబర్‌మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్‌సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుచేయడానికి ఆమోదం తెలిపారు. పరిపాలన సౌలభ్యంకోసం తిరుమలలో అన్ని విభాగాలు ఒకేచోట కేంద్రీకృతమయ్యేలా నూతన పరిపాలన భవనం నిర్మాణానికి ఆమోదించారు. తాళ్ళపాకలో అభివృద్ధి కార్యక్రమాలకు నిపుణులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన 320 ఆలయాలకు 79.82లక్షల రూపాయల అంచనాతో 320 మైక్‌సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయించారు. ఒక్కోమైక్‌సెట్ ఖర్చు 25వేల రూపాయలుగా తెలిపారు. వేదపరిరక్షణలో భాగంగా 700మంది వేదపారాయణదారులను నియమించుకునేందుకు, అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు వేదపారాయణదారులకు దేవాదాయశాఖద్వారా 600మందికి నెలకు 3వేల రూపాయలు లెక్కన నిరుద్యోగభృతి చెల్లించేందుకు 2.16కోట్ల రూపాయలు టిటిడి నిధులు మంజూరుచేసేందుకు ఆమోదం తెలిపారు.
రాష్ట్ర హైకోర్టు తీర్పుననుసరించి టిటిడిలో కాంట్రాక్టు డ్రైవర్లుగా పనిచేస్తున్న 142మందిని క్రమబద్ధీకరించేందుకు టిటిడి బోర్డు ఆమోదిస్తూ ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు నిర్ణయించారు. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కాలినడకన తిరుపతి అలిపిరి, శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులు, లైటింగ్, భద్రత, ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం పెంపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని, అలాంటి ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదని ఛైర్మన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

# విచారణ

>> అధికారులతో చెప్పినట్లు సమాచారం. మద్యం విధానాన్ని అడ్డం పెట్టుకొని దోపిడీ జరిగినట్లు తన దృష్టికి ఎన్నడూ రాలేదని, రాజ్ కెసిరెడ్డి ఎవరో కూడ తనకు తెలియదని వివరించినట్లు తెలిసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సోమవారం విచారణకు రావాలంటూ ఆయనకు అధికారులు నోటీసులివ్వగా అనారోగ్య కారణాల రీత్యా విచారణకు నేరుగా హాజరుకాలేనని సమాచారమిచ్చారు. దీంతో తిరుపతిలోని నారాయణస్వామి నివాసానికి సిట్ అధికారులు ఓ ఇనస్పెక్టర్‌ను పంపి, వీడియోకాల్ ద్వారా ఆయన్ను విచారించారు. దాదాపు 20 నిముషాల పాటు ఆయను ప్రశ్నించారు. ఏ ఒక్క ప్రశ్నకూ ఆయన సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది.

## వారం - వర్జ్యం

23-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయనం
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి రా.2.30
ఆరుద్ర సా.5.57
వర్జ్యం : తె.5.22-6.53
దు.ఓ.11.49-12.41
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** సంతానానికి నూతన విద్యా, ఉద్యోగ యత్నాలు లభిస్తాయి. బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కోపతాపాలకు దూరంగా ఉండండి. ప్రయాణాలు.

**మిథునం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కీలక నిర్ణయాలలో సొంతఆలోచనలు శ్రేయస్కరం.

**కర్కాటకం :** అకారణంగా వివాదాలు ఏర్పడినా జీవితభాగస్వామి సలహాతో పరిష్కరించుకొంటారు.

**సింహం:** కాంట్రాక్టులు లాభిస్తాయి. రాజకీయ, కళారంగాల వారికి అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**కన్య :** నూతన ప్రయత్నాలు సఫలమవుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుండును.

**తుల :** నూతన మిత్రులు పరిచయమై కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు.

**వృశ్చికం:** చిరకాల కోరిక నెరవేరే సమయం. ఉద్యోగాలలో విశేష ఆదరణ పొందుతారు. వస్తు, వస్త్రా కొనుగోలు.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మకరం:** తండ్రి నుండి ఆస్తి లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. శుభవార్తలు.

**కుంభం:** ఇంతకాలం పడిన కష్టానికి ఫలితం దక్కుతుంది. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మంగళగిరిపై ఐటి కంపెనీల ఆసక్తి!

>> ఇందుకు అవసరమైన స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. తాడేపల్లి రిటైనింగ్ వాల్, మంగళగిరి లక్ష్మీ ృ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, మోడ్రన్ లైబ్రరీ, పార్కులు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులపైనా మంత్రి సమీక్షి ంచారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ృ, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లు ఇలాగేనా?

>> పనులు జరుగుతున్నాయా? అని నిలదీసింది. మన ఇంట్లో పిల్లలను నేలపై పడుకోబెడతామా? అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా స్థాయిలో అధికారులు విధిగా హాస్టల్స్ సందర్శించాలని ఆదేశించింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించాలన్న నిబంధనలను గుర్తు చేసింది. తాగునీరు, పౌష్టికాహారం, బెడ్లు, బెడ్ షీట్లు, యోగ్యమైన మరుగుదొడ్లు, బాత్ రూమ్స్ ఉండి తీరాలని తేల్చి చెప్పింది. వసతుల కల్పన అంశంపై నిర్లక్ష్యం వహిస్తే, సాంఘిక, బిసి, గురుకుల సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. మీరే కనుక (సిఎస్) దృష్టి పెట్టి ఉంటే ఈ విధంగా ఉండవని వ్యాఖ్యానించింది. హాస్టల్స్ పరిస్థితులు మార్చాలన్న సంకల్పంతోనే స్వయంగా కోర్టుకు పిలిచామని చెప్పింది. ఇప్పటికైనా ఆ గైడ్‌లైన్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. జిల్లా స్థాయిలో సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్లను తనిఖీ చేయాలంది. ఇకపై నెలవారీ నివేదికలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రాష్ట్రంలోని హాస్టళ్లలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల మేరకు వసతుల కల్పన లేవంటూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ వేసిన పిల్‌పై విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. గతంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధికారులతో హాస్టల్స్‌లోని పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్న హైకోర్టు వాటిని పరిశీలించి విస్తుపోయింది. సంక్షేమ హాస్టళ్లలో దుస్థితి వర్ణణాతీత మని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో మార్పులు చేసేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలతో సిఎస్ వ్యక్తిగతంగా విచారణకు రావాలని గతంలో ఆదేశించింది. ఆన్‌లైన్‌లో సిఎస్ విజయానంద్ విచారణకు హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారుల నివేదికలను చూస్తే హాస్టల్స్ ఎలా ఉన్నాయో అర్థమవుతుందని సిఎస్‌ను ఉద్దేశించి చెప్పింది. నర్సీపట్నంలోని ఓ సంక్షేమ హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులుంటే ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉందని గుర్తు చేసింది. విజయనగరం జిల్లాలోని అంధుల పాఠశాలలో 33 మంది విద్యార్థులుంటే, వారి సహాయ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని చెప్పింది. సిఎస్ స్థాయి అధికారి కదిలితేనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని చెప్పింది. దీనిపై సిఎస్ విజయానంద్ స్పందిస్తూ, హాస్టల్స్‌లోని పరిస్థితులపై సమీక్ష నిర్వహించామని, కొత్త బిల్డింగ్స్ నిర్మిస్తామని, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమయ్యాయని, రెండేళ్లలో చేయబోయే పనులపై నివేదిక ఇస్తామని తెలిపారు.

# బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

>> ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాల్లో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పిజి చేసిన ఆయన జర్నలిస్టుగా డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలాయేళ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్‌ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జెడి(యు) నుంచి తొలిసారి ఎంపిగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.
పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే పదవి నుంచి తప్పుకుంటున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, ప్రధాని మోడీకి ,కేంద్రమంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
కాగా, మరో రెండేళ్ల పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వివి గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్. వెంకటరామన్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ, అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

>> ఏలూరు జిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అమీనాపేట, అశోక్‌నగర్, ఆర్‌ఆర్‌పేట, పవర్‌పేట, పత్తేబాద్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం వరి చేలకు జీవం పోసింది. 20 రోజులుగా వర్షాలు పడకపోవడంతో నాట్లు వేసిన పొలాలు, వెదజల్లిన చేలు, నారుమళ్లు ఎండిపోయాయి. చాలా గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పైరును కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గత మూడ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.
సోమవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో భారీ వర్షం కురిసింది. గుంటూరులో సగటున 110 మిల్లీ మీటర్లు, పల్నాడులో 80 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు అయింది. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గుంటూరు జిల్లాలో కొండవీటి వాగు, పాల వాగు, కోటెళ్ల వాగుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పొలాల్లోకి నీరు చేరడం, రహదారులు, చప్టాలపై నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి విశాఖలో పలుచోట్ల వర్షం పడింది. విశాఖ నగరంలోని గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతంలో ఏకధాటిగా రెండు గంటలపాటు కురిసిన వర్షానికి డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. అనకాపల్లి జిల్లాలోని కె కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో జోరు వాన కురిసింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22నఈ నెల 23న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 24న అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

## తోతాపురి మామిడి రైతుకు భారీ ఊరట

>> అవకాశం ఉంది. రైతులకు లాభాలు భారీగా లభించకున్న పెట్టుబడి చేతికి వస్తుందంటున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ చర్య ధరల పతనాల నుండి రైతులను కాపాడటానికి అవకాశం లభించిందన్నారు. ఈ చర్య న్యాయమైన రాబడిని నిర్ధారించడంతో పాటూ గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

23-07Pg3exHMNWJQECT.qxd:23-07Pg3exHMNWJQECT.qxd 01/01/01 8:40 AM Page 1



## రాష్ట్రంలో భూసేకరణ దశలో 13 ఇఎస్ఐ ఆస్పత్రుల మంజూరు

- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రం

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 13 ఈఎస్ఐ ఆసుపత్రులు మంజూరు చేసినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. అందులో ఇప్పటికే ఐదు పనిచేస్తున్నాయని, 4 నిర్మాణ దశలో,మరో నాలుగు భూసేకరణ దశలో ఉన్నాయని చెప్పారు. వీటిలో మొత్తం131 పోస్టులు ఖాళీగా ఉండగా,వాటిలో 93 పోస్టులె కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీచేసినట్లు చెప్పారు. ఈ ఐదు ఆస్పత్రుల్లో గత ఐదేళ్ళలో 10.29 లక్షల మంది ఓపీ,43,205 మంది ఐపీ రోగులకు వైద్యసేవలందించినట్లు తెలిపారు.లోక్‌సభలో ఒంగోలు టిడిపి సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. కాకినాడ,విశాఖపట్నం,రాజమహేంద్రవరం,తిరుపతి,విజయవాడ ఆస్పత్రులు ప్రస్తుతం వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. మరో వైపు విజయనగరం ఆస్పత్రి 50% విశాఖపట్నం ఆస్పత్రి 56%,అచ్యుతాపురం ఆస్పత్రి 25% నిర్మాణ పనులు పూర్తయినట్లు వివరించారు. నెల్లూరు ఆస్పత్రి నిర్మాణ భాధ్యతలు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. మిగిలిన గుంటూరు, కర్నూలు,శ్రీకాకుళం ,శ్రీసిటీలకు మంజూరు చేసిన ఆస్పత్రులు భూసేకరణ దశలో ఉన్నట్లు తెలిపారు.

## రైల్వేలో 30వేల ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

**గుంతకల్లు రైల్వే, జూలై 22,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్న 30వేలకుపైగా ఎన్‌టిపిసి కేటగిరి పోస్టులను భర్తీ చేసేందుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే జోన్‌లలో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ గ్రాడ్యుయేట్ లెవెల్ (ఎన్‌టిపిసి) చీఫ్ కమర్షియల్ టిక్కెట్ సూపర్‌వైజర్ కేటగిరీలో 6,235 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్టేషన్ మాస్టర్-5,623పోస్టులు,గూడ్స్ ట్రైన్ మేనేజర్(గూడ్స్ గార్డ్)-3,562పోస్టులు,అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-7,520పోస్టులు, సీనియర్ క్లార్ క్ కమ్ టైపిస్ట్ కేటగిరికి సంబంధించి-7,367చొప్పున మొత్తం 30,307 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఆర్ఆర్‌బిల ద్వారా భర్తీ చేసేందుకు నియామకాల ప్రక్రియను చేపట్టాలని రైల్వే శాఖ ఈ మేరకు నిర్ణయించినట్లు అధికార వర్గాల సమాచారం.

## ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్న తెలుగు పాస్టర్లు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఖతర్ దేశంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా మతప్రచారం చేస్తున్నారనే అభియోగంపై పోలీసులు అదుపులోకి తీసుకున్న 9 మంది ప్రవాస క్రైస్తవ పాస్టర్లకు ఊరట లభించింది. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన వారు కాగా, దేశం విడిచి వెళ్లకుండా వీరిపై ఉన్న నిషేధాన్ని తొలగించడంతో వీరంతా ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్నారు. పశ్చిమ గోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాలకు చెందిన ఈ ముగ్గురూ క్రైస్తవ ప్రముఖ బోధకులు.



## శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణానికి నిధులు పెంపు

- అమలవుతున్న రూ.10లక్షలు స్థానంలో మూడు కేటగిరీల్లో చెల్లింపులు
- పాతబడిన భవనాలు తొలగింపునకుబోర్డు నిర్ణయం

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోబాటు ఇతర ప్రాంతాల్లోనూ సనాతన హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోనికి తీసుకెళ్ళేందుకు ,మతమార్పిడులను అరికట్టేందుకు శ్రీవాణిట్రస్ట్ ద్వారా నిర్మించే ఆలయాలకు నిధులు మూడు కేటగిరీలుగా విడుదల చేయనున్నారు .ఇందుకు దీనిపై సుదీర్ఘంగానే చర్చించిన ప్రస్తుత టిటిడి పాలకమండలి పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకుంది. మారుమూలగ్రామాల్లోనేగాక ఎస్సీ,ఎస్టీ వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన తాండాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని టిటిడి ఇప్పటికే ఆమోదించింది. ఈ ఆలయాల నిర్మాణాలు పక్కాగా నిర్వహించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు ఇది వరకు 10లక్షలు రూపాయలు మాత్రమే విడుదలయ్యేది. ఈ నిధులు విడుదల ఇప్పుడు మూడు కేటగిరీల్లో చేపట్టనున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో శ్రీవాణిట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణంపై సమీక్షించి అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆలయాల ధూప దీపనైవేద్యాల నిర్వహణకు ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాలకు అవసరమైన నిదులు కేటాయింపుపై సమీక్షించారు.

శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలను పున:సమీక్షించి 10లక్షలు రూపాయలకు బదులు మూడు కేటగిరీల్లో 10లక్షలు రూపాయలు, 15లక్షలు, 20లక్షల రూపాయలుగా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఒకే కేటగిరి క్రింద చెల్లించే 10లక్షల రూపాయల్లో మార్పుచేశారు. సనాతనధర్మాన్ని జనంలోకి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివని, ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మికత, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయని బోర్డు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవాదాయశాఖ సంయుక్తంగా నిర్మిత మవుతున్న ఆలయాల ప్రస్తుత స్థితి, జీర్ణోద్ధారణ పనులు ఏ దశలో ఉన్నాయోనని కూడా చర్చించారు. రాష్ట్రదేవాదాయశాఖ ఆదేశాలతో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు ,భజన మందిరాలకు నిధులు చెల్లించేందుకు ఈ మూడు కేటగిరీలు దోహదపడుతాయి. ఇప్పటి వరకు నిర్మించిన 320 ఆలయాలకు 79.82 లక్షల రూపాయలతో మైక్‌సెట్లను ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. వివిధ దేశాల్లోనూ ఆలయాలను నిర్మించాలని ఇందుకు సబ్‌కమిటీ ఏర్పాటుచేయాలని ఆమోదించారు. తిరుమలలో పాతబడిన పురాతన విశ్రాంతి భవనాలు, కాటేజీలను ఐఐటి నిపుణుల సూచనలతో తొలగించి ఆ స్థానంలో పున:నిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి వీలుగా అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటుకు టిటిడి బోర్డు నిర్ణయించింది. భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటు చేయాలని ఆలోచనకు శ్రీకారం చుట్టనున్నారు. ఆద్యాత్మిక, ఆహ్లాద వాతావరణం నెలకొల్పేలాచూడనున్నారు. ఈ బోర్డు సమావేశంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సుచిత్ర ఎల్లా, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎన్.నర్సి రెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వర రావు, దర్శన్ ,టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## నానో ఎరువుల వినియోగానికి సబ్సిడీ ప్రతిపాదనలేదు

**రాజ్యసభలో కేంద్రం స్పష్టం - వైసిపి ఎంపి మేడా రఘునాథరెడ్డి వెల్లడి**



**రాజంపేట, జూలై 22 ప్రభాతవార్త** దేశంలో నానో ఎరువుల వాణిజ్య వినియోగాన్ని వేగవంతం చేయడానికి సబ్సిడీ ఇవ్వాలన్న ప్రతిపాదన ఏది లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రోత్సాహక పథకం కూడా ఏది ఇప్పటివరకు పరిశీలనలేదని రాజ్యసభలో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు సమానంగా లిఖిత పూర్వకంగా పేర్కొంది. నానో ఎరువుల వాణిజ్య వినియోగాన్ని వేగవంతం చేయడానికి తీసుకున్న చర్యలు, ఎరువుల వినియోగాన్ని ప్రోత్స హించడానికి ప్రభుత్వం వాటి ఉత్పత్తికి సబ్సిడీ ఇవ్వాలని భావిస్తుందా అని ఎంపీ ప్రశ్నించారు. నానో ఎరువుల వినియోగానికి తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. అందుకు మంగళవారం కేంద్ర రసాయనాలు,ఎరువుల మంత్రిత్వ శాఖ మంత్రి స్మాత్ అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నాను ఇరువుల వినియోగానికి అవగాహన శిబిరాలు, వెబ్‌నార్లు, నుక్కడ్ నాటకాలు, క్షేత్ర ప్రదర్శనలు, కిసాన్ సమ్మేళన్‌లు,ప్రాంతీయ భాషలలో చలనచిత్రాలు వంటి వివిధ కార్యకలాపాల ద్వారా నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్స హిస్తున్నట్లు తెలిపారు.నానో ఎరువులను సంబంధిత కంపెనీలు ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.ఎరువుల శాఖ క్రమం తప్పకుండా జారీ చేసే నెలవారీ సరఫరా ప్రణాళికలో నానో ఎరువులు చేర్చినట్లు వివరించారు. నానో యూరియా వంటి నానో ఎరువులను ఆకులపై వేయడం ద్వారా సులభంగా ఉపయోగించడం కోసం ఖికిసాన్ డ్రోన్స్‌ఖి వంటి వినూత్న స్ప్రేయింగ్ ఎంపికలు , రిటైల్ పాయింట్ల వద్ద బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందుకు గ్రామ స్థాయి వ్యవస్థాపకుల ద్వారా పైలట్ శిక్షణ మరియు కస్టమ్ నియామక స్ప్రేయింగ్ సేవలను చురుకుగా ప్రోత్స హించడం జరుగుతుందన్నారు. ఎరువుల కంపెనీలతో కలిసి డిఒఎఫ్ దేశంలోని 15 వ్యవసాయ వాతావరణ మండలాల్లో సంప్రదింపులు, క్షేత్ర స్థాయి ప్రదర్శనల ద్వారా నానో డిఏపిని స్వీకరించడానికి మహా అభియాన్ ను ప్రారంభించిందన్నారు.నానో ఎరువులకు ఎటువంటి సబ్సిడీని అందించడం లేదని పేర్కొన్నారు. అయితే, శాఖ తన ప్రభుత్వ రంగ సంస్థలను (శిలీగలు) నానో ఎరువుల ఉత్పత్తి ప్లాంట్లను స్థాపించడానికి చురుకుగా ప్రోత్స హిస్తోందన్నారు.డ్రోన్లను ఉపయోగించి నానో ఎరువుల వాడకం ఖర్చుతో కూడుకున్న సాంకేతికతగా ఉద్భవించిందన్నారు. వ్యవసాయం రైతు సంక్షేమ శాఖ , నమో డ్రోన్ దీదీ పథకాన్ని అమలు చేసిందన్నారు.



## ఆహారపదార్థాల తనిఖీకి అత్యాధునిక పరిశోధనశాల

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిది:** అత్యాధునిక పరికరాలతో తిరుమలలో ఏర్పాటుచేసిన ఆహార నాణ్యాత పరీక్ష పరిశోధనశాల ద్వారా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరంలేదని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. గతంలో స్వామివారి ప్రసాదాలు,నెయ్యి తదితర వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు తిరుమలలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆహార పరిశోధనశాలను మంగళవారం సాయంత్రం ఈ ముగ్గురు కలసి ప్రారంభించారు. 75 లక్షలు రూపాయలు విలువైన ఈ పరికరాలను గుజరాత్ లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు విరాళంగా అందజేసిందని వివరించారు. ఇందులో పనిచేసే సిబ్బంది మైసూర్‌లోని సిఎఫ్‌టిఆర్ఐలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, సదాశివరావు, నరేష్ ,సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమన్నారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి అధికారులు పాల్గొన్నారు.

## ఎపి నుంచి వారానికి 1,194 విమానాల రాకపోకలు

- కుప్పం ఎయిర్‌పోర్టు స్థలానుమతి కోసం దరఖాస్తు - 11 చోట్ల నుంచి సీప్లేన్ నిర్వహణకు ఎల్ఓఐల జారీ - రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రస్తుతం వారానికి 1,194 విమానాలు రాకపోకలు సాగిస్తున్నట్లు కేంద్ర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో టిడిపి సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రంలో 2021లో ఓర్వకల్లు విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని, ప్రస్తుతం భోగాపురం విమానాశ్రయ నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. గతదర్తి విమానాశ్రయం నిర్మాణం కోసం 2018లో కుదుర్చుకున్న కన్సెషన్ అగ్రిమెంట్‌ను ఆ తర్వాత రాష్ర ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. 2008 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ పాలసీ ప్రకారం ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయాలంటే కొత్త ఎయిర్‌పోర్టు డెవలపర్‌ను ఎంచుకోవడంతో పాటు భూసేకరణ,చట్టబద్ధమైన అనుమతులు,ఆర్థిక వనరులను సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన స్థలానుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత జూన్‌లో ధరఖాస్తు పంపిందని చెప్పారు.ఉడాన్ 5.5కింద అరకు,గండికోట,కాకినాడ, కోనసీమ, లంబసింగ్, నర్సాపూర్,ప్రకాశం బ్యారేజీ, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి, నాగార్జునసాగర్ ల నుంచి సీప్లేన్‌ల నిర్వహణక అవసరమైన బిడ్డింగ్‌లు దాకలు చేసుకోవాడానికి వీలుగా ఎయిర్‌లైన్ ఆపరేటర్లకు లెటర్ ఆఫ్ ఇండెం ట్(ఎల్ఓఐ)లు జారీ చేసినట్లు వైకాపా సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. సీ ప్లేన్‌ల నిర్వహణ కోసం డిజీసీఏ భద్రతా నిబంధనల్లో సవరణలు చేసిందని, దీని ప్రకారం శిక్షణావసరాలు, అనుమతుల ప్రక్రియ,స్థలం ఎంపిక సరళంగా ఉంటుం దన్నారు. కేంద్ర ప్రభుత్వ రక్షణలో 135 పురాతన స్మారక కేంద్రాలు కేంద్ర ప్రభుత్వ రక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో 135 పురాతన సా ్మరక కేంద్రాలు ఉన్నట్లు కేంద్ర పర్యాటక,

సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ తెలిపారు. ఆయన లోక్‌సభలో టిడిపి సభ్యుడు జీఎం హరీష్ మాథుర్

అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. వీటి కోసం గత నాలుగేళ్ళలో రూ.36 కోట్లు కేటాయించగా, అందులో రూ.35 కోట్లు ఖర్చయినట్లు వెల్లడించారు.

## యూరియాను వ్యవసాయేతర రంగాల్లో వినియోగిస్తే కఠిన చర్యలు

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



**విజయవాడ, జూలై 22, ప్రభాత వార్త ప్రతినిధి:** యూరియాను వ్యవసాయేతర రంగాల్లో అక్రమంగా వినియోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఏపీ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. యూరియా వినియోగం ఏటా 15 నుంచి 20 శాతం పెరుగుతుండటం గమనించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యూరియా పక్కదారి పడుతున్నట్లు కేంద్ర నిఘా సంస్థలు తెలిపాయని వెల్లడించారు.

రైతుల కోసం కేటాయించిన యూరియాను ఆక్వా, చేపల చెరువులకు, పశువుల దాణా పరిశ్రమకు, నాటుసారా తయారీకి, ప్లాస్టిక్, ఫ్లైవుడ్, రసాయనిక పరిశ్రమలకు, కల్తీ పాల తయారీ, అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాల తయారీకి వినియోగిస్తున్నట్లు నిఘా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు రైతులు సిఫార్సు చేసిన మోతాదుకు మించి వినియోగించడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సి రావడం వల్ల యూరియా వాడకం అధికమవుతుందని చెప్పారు.

యూరియా అక్రమ వినియోగం నిరోధించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వైకుంఠమ్ 3 కాంప్లెక్స్

- అన్యమత ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టం
- టిటిడి బోర్డులో చర్చ
- 'వార్త' కథనాలపై సమీక్ష

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవుతున్న నేపథ్యంలో తిరుమల వెలుపల కిలోమీటర్ల క్యూలైన్లకు స్వస్తిపలకడానికి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణం చేపట్టేందుకు నిపుణుల కమిటీని టిటిడి బోర్డు ఏర్పాటు చేసింది. ఈ కమిటీ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నివేదికలిస్తే వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు బ్రహ్మోత్సవాల్లోపు నిర్ణయం తీసుకునే దిశగా అడుగులేస్తోంది. అలాగే హిందూ ధార్మికసంస్థ టిటిడిలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని, ,అలాంటి ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదని కూడా బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ రెండు అంశాలపై ఈనెల 13వతేదీన 'వార్త'దినపత్రికలో "వెలుపల క్యూలైన్ల నియంత్రణకు వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణంతోనే !2000లో వైకుంఠమ్ -2 కాంప్లెక్స్ నిర్మాణం"శీర్షికతో ప్రత్యేక కథనం, మూడురోజుల క్రిందట "అన్యమత ఉద్యోగులపై చర్యలేవీ!?"కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు మంగళవారం సమావేశంలో కీలకంగా చర్చించి అభిప్రాయాలు వెలువడించారు. వేలాదిమంది భక్తుల వెలుపల క్యూలైన్ల నియంత్రణకు వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం శరణ్యమనే అభిప్రాయాలపై ఏకీభవించారు. వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు దూరం శిలాతోరణం వరకు భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి. 1980లో భక్తులకు అప్పటి సంఖ్యకు తగ్గట్లు అవసరాలకు కనీసం తలదాచుకునేందుకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు.

# తిరుమల సమాచారం

## ఆగస్ట్ 8న టిటిడి ఆలయాల్లో సౌభాగ్యం

- 28న సద్గమయ కార్యక్రమం
- హెచ్‌డిపిపి నూతన కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరణ



**తిరుమల,జూలై 22ప్రభాత వార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల్లో ఆగస్ట్ 8వతేదీ శుక్రవారం సౌభాగ్యం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయా లను సందర్శించే మహిళలకు గాజులు, పూలు,పసుపు,కుంకుమ,అక్షతలు సమర్పించే ప్రత్యేక కార్యక్రమంగా దీన్ని రూపొందించారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేందుకు ,విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పేందుకు ఈనెల 28న సద్గమయ కార్యక్రమం ప్రారంభం కానుంది. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఏడాదిపాటు చేపట్టే పలు కార్యక్రమాలతో రూపొందించిన బ్రోచర్‌ను మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో ఆవిష్కరించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడిఇ ఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పనబాకలక్ష్మి,శాంతారాం, నర్సి రెడ్డి పలువురు బోర్డు సభ్యులతో కలసి ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఛైర్మన్ నాయుడు మాట్లాడుతూ టిటిడి .ధర్మప్రచారపరిషత్ ఆద్వర్యంలో రూపొందించిన నూతన కార్యక్రమాలు సనాతన హిందూ ధర్మవ్యాప్తికి దోహదపడుతాయన్నారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేందుకుఈ బ్రోచర్ ఉపయోగపడుతుందన్నారు. ఆగస్ట్ 8న సౌభాగ్యం, అక్టోబర్ 2వతేదీ మన వారసత్వం, ఆగస్ట్ 15న సన్మార్గం, ఆగస్ట్ 31న హరికథవైభవం, అక్టోబర్ 12న అక్షరగోవిందం, డిసెంబర్ 1వతేదీ భగవద్గీతానుష్టానం,బోధన, 2026 వేసవిసెలవుల్లో 16సంవత్సరాల లోపు పిల్లలకు సంప్రదాయ భజనపై భజే శ్రీనివాసం, సంప్రదాయ భజన శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. వీటితో బాటు వన నిధి, గిరిజనార్ధనం వంటి కార్యక్రమాలను రూపొందించడం చక్కగా ఉందన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు

- స్వామివారిసేవలో తరించడం అదృష్టం
- మైసూరు మహారాణి రాజమాత ప్రమోదాదేవి



**తిరుమల,జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి:** మైసూరు మహారాజు సంస్థానంకు చెందిన తామంతా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో ఆనందంగా ఉన్నామని మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదాదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్‌లు తెలిపారు. స్వామివారిసేవలో పాల్గొని స్వామి వారికి పల్లవోత్సవంతో ఆతిధ్యం ఇవ్వడం మా అదృష్టమన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్న మైసూరు సంస్థానం కుటుంబం దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న దర్శనంతో ఆనందం : ప్రముఖులు



**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతో మనసు ఆనందంగా ఉంటుందని పలువురు ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎమ్మెల్యే సూర్యనారాయణ, నటుడు నందు తిరుమలకు చేరుకుని దేవదేవుడిని దర్శించుకున్నాడు. టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లుచేసి తనకు స్వామివారి దర్శనం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు.

## వేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

- సుందరంగా సిద్ధమవుతున్న ఏడుకొండలు!

**తిరుమల,జూలై 22ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామికి సెప్టెంబర్ 23నుండి మొదలు కానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమ లలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిది రోజులుపాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,గ్యాలరీలు నిర్మాణం, ఆలయానికి ఎదురుగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు,ఆస్థాన మండపం వద్ద భక్తులు వానకు తడవకుండా ఉండేలా షెడ్లు నిర్మాణం జరుగుతోంది. మాఢవీధుల్లో ఎండకు.వానకు రక్షణగా గ్యాలరీలు నిర్మితమవుతున్నాయి. ఇంజనీరింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలు మాత్రమే జరగనున్నాయి.ఈ వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్దమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు ఆరంభమయ్యాయి.

## నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రంతో భక్తులకు మరింత సౌలభ్యం



**తిరుమల,జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రం సిద్ధమైంది.ఈ కేంద్రాన్ని మంగళ వారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఓ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరితోకలసి ప్రారంభించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో రూ. 60 లక్షల వ్యయంతో కొత్త కౌంటర్లను నిర్మించినట్లు తెలిపారు. నేటి నుంచి కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్ల పంపిణీ ప్రారంభమవుతుందని, భక్తులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో భక్తుల సౌలభ్యం కోసం నూతనంగా ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టిటిడి ఛైర్మన్ ప్రారంభించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాలయాలను పరిశీలించారు.

## సమాచార కమిషనర్ల పోస్టులకు నోటిఫికేషన్


**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:**రాష్ట్ర ముఖ్య సమాచార కమీషనర్,సమాచార కమీషనర్ పోస్టుల బర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన జారీ చేసింది. న్యాయ,శాస్త్ర సాంకేతిక సామాజిక సేవ,పాత్రికేయం,మాస్ మీడియా,ప్రభుత్వ పాలన రంగాల్లో విశేష పరిజ్ఞానం,అనుభవం ఉన్నవారు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఔత్సాహికులు తమ వివరాల్ని ఆగస్టు నాలుగో తేదీ సాయంత్రం 55.30 లోపు రిజిష్టర్ పోస్టు ద్వారా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి,సాధారణ పరిపాలన శాఖ,రాష్ట్ర సచివాలయం,వెలగపూడి,అమరావతి' చిరునామాకు పంపాలని సూచించింది.వివరాలను ఈ-మెయిల్ ఐడీ జిఏడి.ఎఆర్‌సెక్షన్ అట్ ది రేట్ ఆఫ్ జిమెయిల్.కాం ద్వారా కూడ పంపొచ్చంది.

వార్త

ఆకారాన్ని మాత్రమే చూసి మంచి చెడ్డలు నిర్ణయించుకునేవారు సంకుచిత స్వభావులు మాత్రమే.
-ఆస్కార్ వైల్డ్

# కీలుబొమ్మలుగా మారొద్దు!

స్వతంత్ర ప్రతిపత్తితో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఈడీలు రాజకీయ క్రీడలో పావులుగా మారి తమకు సంబంధం లేని విషయాల్లో తలదూర్చి దూకుడు ప్రదర్శించినప్పుడల్లా న్యాయస్థానాల చేత మొట్టికాయలు తింటూనే ఉన్నాయి. ఇలాంటి అంశాలను క్రోడీకరిస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ తమ అధికారాలను, విధులను దుర్వినియోగం చేస్తోందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్‌గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేసింది. ఇది తాజా అంశం ఇంతకు ముందు ఎన్నోసార్లు ఈ కేంద్ర దర్యాప్తు సంస్థల రాజ కీయ ఒత్తిడులకులొంగి చేసిన నిర్వాకాలను సుప్రీంకోర్టు తీవ్రంగానే మందలించింది. ప్రస్తుత 'ముడా' (మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ)భూ కేటాయింపుల కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య శ్రీమతి బిఎం పార్వతికి వ్యతిరేకంగా ఈడీ జారీ చేసిన సమన్లను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టులోని ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సోమవారం నాడు సుప్రీంకోర్టు ధర్మా సనం సమర్థించింది. హైకోర్టులో వచ్చిన తీర్పుకు సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌లో ఉన్నత ధర్మాసనం తమ పరిశీలనకు లోబడే కొన్ని విమర్శలు చేసింది. అవే కేంద్ర దర్యాప్తు సంస్థల నిర్వాకాన్ని,వాటిని తమకనుకూలంగా వాడుకోజూసిన పార్టీల ఆలోచనలను సుప్రీం ధర్మాసనం ఎండగట్టింది. ఈసారి అక్షింతలు వేయించుకునే వంతు 'ఈడీ'దయ్యింది. ఇంతక్రితం 2013లో సిబిఐని 'పంజరంలో చిలక'గా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్నది మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం. కేంద్రంలో ఏ పార్టీ, ఎవరు అధికారంలో ఉన్నా సుప్రీంకోర్టు ఒకే రకంగా వ్యాఖ్యానిస్తోందంటే వ్యవస్థలో ఉన్న లోపం ఇప్పటికీ సరికానట్లే! ప్రజాస్వామ్యానికి ప్రధాన స్తంభంగా వినుతికెక్కిన న్యాయవ్యవస్థ ఇతర వ్యవస్థల్లోని లోపాలను ఎత్తిచూపి న్యాయబద్ధంగా చట్టబద్ధంగా పనిచేసేందుకు ఓ 'ములుకర్ర' లా వ్యవహరిస్తుంటుంది. సిబిఐ ఈడి కేంద్ర దర్యాప్తు సంస్థలు నియమబద్ధంగా చట్టాలు,న్యాయ విధానాలకు లోబడి తమ దర్యాప్తులో ఎవరి జోక్యం లేకుండా పనిచేయాలి. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి. వీటన్నిటినీ వదిలిపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చిచ్చు రాజేసే పనులకు తోడ్పడుతున్నాయనో, రాజకీయ ప్రమేయంతోనో కేసుల వ్యవహారాలను ముందుకు తీసుకుపోతున్నాయనో ఆరోపణలు ఎదుర్కొవాల్సి వస్తోంది. తాజాగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య కుటుంబాన్ని అప్రతిష్ట చేసే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను దురద్దేశపూర్వకంగా తమ రాజకీయ పోరాటాలను వాడుకుంటోందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒకరోజు ముందు మరో కేసులోఈడీని మద్రాసు హైకోర్టు కూడా ఇదేమాదిరి మందలించింది. కర్ణాటక ఎస్ఎల్‌పిలో అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీరాజు సుప్రీంకోర్టు వేసిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో 'రాజకీయ స్వప్రయోజనాల కోసం, విపక్ష పార్టీలపై కక్ష సాధింపు కోసమే ఈడిని దుర్వినియోగం చేస్తున్నట్లు అనిపిస్తోందని సుప్రీం స్పష్టంగానే వ్యాఖ్యానించింది. దేశమంతటా ఈడిని ప్రత్యర్థులపై ఉసికొల్పే 'రాజకీయ' క్రీడకు ఆస్కారమివ్వద్దని గట్టిగానే హితవు చెప్పింది. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వేదికల మీదనే తప్ప బయట వేసే ధోరణి మంచిదికాదని, ఇదే కొనసాగితే తాము కఠిన చర్యలు తీసుకుంటామని ఈడిని హెచ్చరించారు. ఇలా కోర్టుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలకు చీవాట్లుపడినప్పుడల్లా ప్రత్యర్థి పార్టీలు తమవంతుగా తీర్పులను వ్యాఖ్యలను స్వాగతిస్తుంటారు. ఇప్పుడూ అదే జరిగింది. అటు వారు ఇటైనా, ఇటువారు అటైనా అధికార, విపక్షపార్టీలస్పందన ఇలాగే ఉంటుంది. ఆ సంస్థ కార్యకలాపాల్లో అనవసర జోక్యాలు,అధికార దుర్వినియోగాలు బయటపడ్తుంటాయి. అంతవరకు మీమాంసలతో చర్చించుకునే పజాబాహుళ్యానికి అసలు విషయాలు తేటతెల్లమవుతుంటాయి. న్యాయ సమ్మతంగా వ్యవహరించి ఉంటే గతంలో ఎన్నో సందర్భాల్లో 'కోర్టు మంద లింపు'లకు గురైన 'ఈడీ' వ్యవహారం మరోసారి ఇప్పుడు కోర్టు ముందు నవ్వులపాలు కాదు. గతంలో మహారాష్ట్ర లో జరిగిన అనుభవాన్ని కూడా జస్టిస్ బిఆర్‌గవాయ్ ఈ కేసు సందర్భంగా ఉటంకించారు. అంటే 'చర్విత చరణం'గా తప్పులు చేసే పద్ధతి మారాలని సూచించినట్లే. కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు కూడా ఈడి నోటీసులందించి మరో అద్భుతం సృష్టించింది. ఈ కేసును కూడా సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించి, ఈ అంశంపై 'అమికస్ క్యూరీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రభావితం చేసే వర్గాలపై ఈడీ నోటీసుల వ్యవహారాన్ని కూడా ధర్మాసనం సీరియస్‌గా తీసుకొంది. తమ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్నీ దర్యాప్తు చేయడానికి మీరేం సూపర్ కాప్‌కాదు. డ్రోన్‌లా ఎగిరిపోనక్కర్లేదని ఈడీని మద్రాస్ హైకోర్టు అంతకుముందు రోజే హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ చెన్నైకి చెందిన ఓ పవర్ జనరేషన్ సంస్థకు చెందిన రూ. 901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్‌చేసిన విషయంలో కాస్త తీవ్రంగానే మందలించింది. రాజకీయ ఉద్దేశ్యాల ప్రేరణతో చేపట్టేవన్నీ తాత్కాలిక వేధింపులకే తప్ప తుదకంటా నిలవవని ఎన్నో సందర్భాల్లో తేలినందున స్వచ్ఛమైన నియమ నిబద్ధమైన ఆలోచనలతో కేసులు స్వీకరించిదర్యాప్తు చేయలేకపోతే ఆయా సంస్థలు నవ్వులపాలు కాక తప్పదు.



మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.

ప్లినీ



శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### సమన్వయంతో పని చేయాలి

జూన్ 2025లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి తగ్గినట్టు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించడం కొంత ఊరట కలిగించినా, ఇది తాత్కాలిక ఉపశమనంగా మాత్రమే పరిగణించాలి. గత నెలల్లో ఆహారధరలు, నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరగడంతో మధ్య తరగతి, పేదవర్గాలు తీవ్ర ఆర్థికఒత్తిడిని ఎదుర్కొన్నారు. బియ్యం, కూరగాయలు,పాలు వంటిమౌలికావసరాలధరలు సామాన్యుడికి అధిక భారం మోపుతున్నాయి. ఇది ఆరోగ్యంపై, విద్యపై, జీవన నాణ్యతపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. చిన్నారులు,మహిళలు పోషకాహారం నుండి దూరమవుతున్నారు. ఇది ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేయాల్సిన అంశం. ధరల నియంత్రణకు సరఫరా గొలుసును బలోపేతం చేయాలి.వృద్ధి లక్ష్యాలను కొనసాగిస్తూ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### జాలర్ల జీవితాలకు కొత్తబాట వేయాలి

కచ్చతీవు వివాదం ఎన్నికలమ్యానిఫెస్టోకు పరిమితం కావడంవిషాదం.ఎప్పుడో ఇందిరాగాంధీ పీరియడ్‌లో కుదిరిన ఒప్పందం పైన ఇప్పుడు వివాదాలు రేపడం జాలర్ల జీవితాలకు సంబంధించిన అంశం కావడం బాధాకరం. నేడు అది రాజకీయ అస్త్రంగా మారడం విషాదం. బిజెపి ప్రభుత్వం కొత్తతరహా విదేశాంగ విధానానికి రూపకల్పన చేశామని చెపుతున్నారు కదా. విదేశాంగ నిపుణులను ఆర్థిక వేత్తలను, కోస్టల్ ఏరియా నిపుణులను, ఇరు దేశాల పౌర హక్కుల ఉద్యమ కారులను, నియమించి వేలాది జాలరుల జీవితాలకు కొత్త బాట వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### సంప్రదాయాన్ని పాటించాలి

ఈకాలంలో ఆడపిల్లలు బాగా చదువు కోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన తరువాత వారికి వంట చేయడం చేత కావట్లేదు. వివాహమైన తరువాత చాలా శ్రమపడవలసి వస్తోంది. ఏకూర ఎలా చేయాలనేది తెలియక చరవాణిలోవంటలు యాప్‌లనుచూసిచేస్తున్నారు.లేదా బయటనుంచి ఆర్డర్లు పెడుతున్నారు. ఆడపిల్లలకు అన్ని రకాల వంటలను చిన్నప్పటి నుండే నేర్పడం మొదలు పెట్టాలి.

- కె. రామకృష్ణ, సికింద్రాబాద్

### విత్తనాలను సరఫరా చేయాలి

రోజు రోజుకు కూరగాయలు,పండ్ల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.రాష్ట్రప్రభుత్వం అన్నిగ్రామాల్లో,పట్టణాల్లోప్రతి ఇంట్లో, అపార్ట్మెంట్ లలో కూరగాయలు, పండ్ల చెట్లను నాటేవిధంగా ప్రభుత్వమే కూరగాయల విత్తనాలు,పండ్ల చెట్లను నామమాత్రపు ధరకు పంపిణీ చేయాలి.అలా పంపిణీ చేయడానికి పట్టణాల్లో,గ్రామాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా ప్రచారంచేయాలి. చెత్తసేకరించే వారిద్వారా ప్రతి ఇంటికి కూరగాయల విత్తనాలను,పండ్ల చెట్లను పంపిణీ చేయాలి. మున్సిపల్ శాఖ,గ్రామ పంచాయతీలు సేకరించిన చెత్త ద్వారా తయారుచేసినవర్మికంపోస్ట్‌ను నామమాత్రపు ధరకుపంపిణీ చేయాలి. తద్వారా తెలంగాణ రాష్ట్రం కూరగాయలు, పండ్లు పండించడం, ప్రజలందరికీ చౌక ధరలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందేవిధంగా చేయవచ్చు. ప్రజలు తమకు సరిపోను మిగిలిన కూరగాయలు పండ్లను తక్కువ ధరకు మున్సిపల్ శాఖ, గ్రామ పంచాయతీల ద్వారా సేకరించి మార్కెట్‌కు తరలించవచ్చు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించాలి.

-సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### పార్కింగ్ ఏరియా ఉండాలి

మన పట్టణాలు, నగరాలలోని కాలనీలలో అనేక మంది తన కార్లను తమ ఇళ్ళలో కాకుండా రోడ్డుపై నిలుపు చేస్తున్నారు. దీని వల్ల రోడ్లు ఇరుకై నడిచే వారికి, వాహనాలు నడిపే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్లను కొనుక్కుని తమ ఇంటిలో కాకుండా రోడ్ల మీద పార్క్ చేయటం ఇతరులను ఇబ్బందులకు గురి చేయటమే అవుతుంది. వినియోగదారులు కార్లు కొనేటప్పుడు కానీ, రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు కానీ, కారు కొనుక్కునే సదరు వినియోగదారునికి తమ ఇంటిలో పార్కింగ్ సదుపాయం ఉందని చూపే ఋజువు ఉంటేనే వాహనాన్ని రిజిస్టర్ చేయాలనే విధానం ప్రభుత్వాలు వెంటనే ప్రవేశపెట్టాలి.ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

టీఎస్ఆర్టీసీ బస్సుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతుంది. బస్సులు తప్పకుండా సమయపాలన పాటించాలి. బస్టాండులో టైమ్ టేబుల్ బోర్డు లు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు సరి అయిన సమయంలో సురక్షితంగా వెళ్లడానికి బస్సుల సమయ పాలన అవసరం.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ఇ-దర్శన్ కేంద్రాలతో ప్రయోజనమే..

**తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడి ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒక ప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి.**

అప్పన్న గొనప

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అనేది కోట్లాది మంది హిందూ భక్తుల జీవిత లక్ష్యంగా మారిన పవిత్రతతో కూడిన ఆధ్యాత్మిక యాత్ర. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ శ్రద్ధతో, నమ్మకంతో పాల్గొంటారు. దేశమంతటా, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది భక్తులు తిరుమలకు వచ్చి శ్రీవారి కృపను పొందాలనుకుంటారు. ఈ ఆధ్యాత్మిక యాత్రను సులభతరం చేయడం, భక్తులకు ఏ విధంగానైనా ఇబ్బందులు కలగకుండా చూడడం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రధాన బాధ్యత. ఈ క్రమంలో ఒకప్పుడు ప్రారంభించిన 'ఈదర్శన్' కేంద్రాలు ఎంతో కాలం పాటు భక్తులకు సహాయకరంగా నిలిచాయి.కానీ గత ఏడు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 100కు పైగా ముఖ్య ప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలను పూర్తిగా మూసివేయడం వల్ల లక్షలాది సామాన్య భక్తులకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. భక్తుల ప్రయాణం ఆధ్యాత్మిక పథంగా కాకుండా ఒక నిరాశాజనకమైన సమస్యల యాత్రగా మారుతోంది. 'ఈదర్శన్' కేంద్రాల మూసివేత అనేది సాధారణమైన పరిపాలనా చర్యకాదు. ఇది లక్షలాది మంది సామాన్య ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష ప్రభావాన్ని చూపే నిర్ణయం. గతంలో ఈ కేంద్రాల ద్వారా భక్తులు స్వయంగా తమ పట్టణ, జిల్లా కేంద్రాల ద్వారా దర్శన టికెట్లు, ఆర్జిత సేవల టికెట్లు వసతి గదుల బుకింగ్ చేసుకునే సదుపాయం కలిగి ఉండేవారు. అంతేకాదు,ఇందులో పని చేసే టీటీడీ సిబ్బంది భక్తులకు సహాయంగా ఉండి అవసరమైన సమాచారం అందించేవారు. పెద్దవారికి, వికలాంగులకు, టెక్నాలజీపై అవగాహనలేని వారికి ఇది ఒక దైవ ప్రసాదంగా భావించవచ్చు. అయితే ప్రస్తుతం టీటీడీ టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అందిస్తోంది. అంటే భక్తులు తిరుమల దర్శనానికి ముందు మూడు నెలల పాటు వేచి ఉండి, ఆన్‌లైన్‌లో టికెట్ పొందాల్సిన అవసరం ఏర్పడింది. ఇది సాంకేతికంగా అందరికీ సాధ్యపడే పనికాదు. స్మార్ట్‌ఫోన్లు లేని వారు, ఇంటర్నెట్ బాగా వాడలేని వారు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు, లేదా చదువురాని వృద్ధులు - వీరంతా తిరుమల దర్శనం పొందేందుకు ఇప్పుడు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ పరిస్థితిలో, చాలా మంది భక్తులు స్థానికంగా ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కానీ అక్కడ వారు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరికొంతమంది దళారుల చేతుల్లో మోసపోతున్నారు. దర్శనానికి ఉచితంగా లేదా తక్కువ ధరకు లభించాల్సిన టికెట్ల కోసం వేల రూపాయలు చెల్లించే పరిస్థితులు కనబడుతున్నాయి. వీటితో పాటు వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు వంటి ప్రత్యేక వర్గాల భక్తులకు కూడా టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందించడం వల్ల వారు ప్రత్యక్షంగా తిరుమల కొండపైకి వచ్చి టికెట్ల కోసం వేచిఉండాల్సి వస్తోంది. ఇది వారి ఆరోగ్యానికే కాకుండా భక్తి భావనకూ ఎదురుదెబ్బలాంటిదే. టీటీడీ తమ సేవలన్నింటిని ఆన్‌లైన్‌లోకి మార్చడం ఒక ఆధునికీకరణ చర్యగా భావించవచ్చు. కానీ ప్రతి ఆధునికతను ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అన్ని వర్గాల ప్రజలు



ఒకే స్థాయిలో డిజిటల్ ప్రపంచాన్ని వాడలేరు. భక్తులలో చాలా మంది పేదలు, గ్రామీణ ప్రాంతాలవారు, వృద్ధులు, నిరక్షరాస్యులు ఉంటారు. వీరందరికీ ఆన్‌లైన్ టికెట్లప్రక్రియ పూర్తి చేయడం చాలా కష్టంగా మారుతుంది. వారు అవసరమైన సమాచారం పొందడానికే కాదు, సరైన విధంగా గది బుకింగ్ చేసుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడుతున్నారు.ఇది వారిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. భక్తుల ఈ పరిస్థితిని గుర్తించి, తిరిగి ప్రత్యక్ష సేవల విధానాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో, ఒక ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించి, భక్తులందరికీ టికెట్లను పునరుద్ధరించిన ఈదర్శన్ కేంద్రాల ద్వారా అందించే విధంగా టీటీడీ కార్యాచరణ రూపొందించాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి, ప్రధాన పట్టణాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. తిరుమల యాత్ర అనేది ఒక ఆధ్యాత్మిక యాత్ర. భక్తులు తమ మనోభావాలను, శ్రద్ధను తీసుకొని స్వామివారి సన్నిధికి చేరుకుంటారు. అలాంటి యాత్రను ఆధునిక సాంకేతికత పేరుతో ఒక టెక్నికల్ కాంప్లికేషన్‌గా మార్చకూడదు. ప్రతి భక్తుడూ సమానంగా స్వామివారి దర్శనం పొందేహక్కు కలిగి ఉన్నాడు. ప్రత్యక్ష టికెట్ల విక్రయ కేంద్రాలు లేకుండా, భక్తులను ఆన్‌లైన్‌కు పరిమితం చేయడంవల్ల, వారి ఆధ్యాత్మిక యాత్ర అర్థరహితంగా మారుతోంది.కొన్ని నిమిషాల్లోనే అన్నిటికెట్లు బుక్ అయిపోవడం, సర్వర్లు డౌన్ కావడం, ఫోన్లో సిగ్నల్స్ రాకపోవడం వంటి సమస్యలు ప్రతిరోజు ఎదురవుతున్నాయి. అలాంటి సమయంలో భక్తులుస్వామిని దర్శించాలన్న ఆకాంక్షను వదులుకుంటున్నారు. ఇది అత్యంత బాధాకరమైన స్థితి. ఈపరిస్థితి మారాలంటే తిరిగి ప్రత్య క్ష సేవల అందుబాటు రావాలి. ఈదర్శన్ కేంద్రాలను తిరిగి తెరవడం ఒక ముఖ్యమైన పరిష్కారమార్గం. వీటి ద్వారాభక్తులు భద్రతగా, సులభంగా, నమ్మకంగా తమ సేవలను పొందగలుగుతారు.ప్రభుత్వం టీటీడీ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యపట్ల టీటీడీ ధర్మకర్తల మండలి, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ఇది భక్తుల విజ్ఞప్తి మాత్రమే కాదు,ఒక సామాజిక బాధ్యత. లక్షలాదిమంది సామాన్యులు భగవంతుని దర్శించుకోవాలనుకుంటే, వారిని ఆన్‌లైన్ పద్ధతిలోనే బంధించడం సమంజసంగా ఉండదు. ప్రత్యక్ష సేవల ద్వారా భక్తులకు మరింత మానవీయత, నైతికత, నిబద్ధతతో కూడిన అనుభవం లభిస్తుంది. ప్రతి పట్టణంలో తిరిగి ప్రారంభించదగ్గ ఈదర్శన్ కేంద్రాలద్వారా భక్తుల ఆర్థికభద్రత కూడా కాపాడబడుతుంది. దళారులచేతుల్లో మోసపోవడం తగ్గుతుంది. అందువల్ల, ఈ సమస్యపై టీటీడీ ఒకకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సమీక్ష చేసి, భక్తులకు ప్రత్యక్ష సేవలు అందించే దిశగా ముందడుగు వేయాలి. ఈ కేంద్రాలను తిరిగి తెరిచి భక్తుల కష్టాలను తీర్చడంద్వారా టీటీడీ తనధర్మాన్ని నిర్వర్తించగలదు. తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడి ప్రభుత్వాల బాధ్యత.ఈబాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒకప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. •

# మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

కామిడి సతీష్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యాన్ని విక్రయిస్తున్నాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూ వున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ఏరులై పారుతున్నా అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తున్నాయి. అన్ని జిల్లాలలో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాలు, పాన్‌షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీపంలో మద్యం ఏరులై పారుతోంది. భవననిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీలకు బదులుగా మద్యాన్ని తాగుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతంలోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్ షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవైపు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరో వైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లిక్కర్ డాన్లు వివిధ జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం



నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలు,పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందుకున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి. వివిధ మండలంలలోని కొన్ని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది. అందులో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. కొందరైతే వాహనాలను ఉదయం సమయంలో తీసుకువచ్చి అడ్డకూలీలకు, ఇసుక ట్రాక్టర్ల మీద వెళ్లే కూలీలకు అమ్మకాలు జరుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్ల వద్ద గల కిరాణా దుకాణాలలో కల్తీమద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలుస్తోంది. అన్ని జిల్లాలలో ఈ దందా సంగతి తెలిసిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఏదైనా ఫిర్యాదు రాగానే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తం అవుతున్న బెల్టు షాపుల వారు తనిఖీలలో ఏమీ దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఈ బెల్టుదందాకు అడ్డుకట్ట పడడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.యువత మాత్రం నిత్యం వీటికి బానిసై ఒళ్లు గుల్ల చేసుకుని భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది.ఇకనయినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కుపాదం మోపాలి. •

# ట్రంప్ వాణిజ్య పన్నుల వార్ డైలాగ్‌లకే పరిమితమా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ ఉక్రెయిన్, రష్యా దేశాల మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వానికి చేసిన పరిస్థితులు అనుకూలించకపోవడంతో, అత్యంత శక్తివంతమైన రష్యా దేశాన్ని ఒప్పించలేక చివరకు అమెరికా ఉత్పత్తులపై అంతర్జాతీయంగా వాణిజ్య వ్యాపార ఎగుమతులు దిగుమతులపై అధిక శాతం సుంకం(టారిఫ్ ) విధిస్తున్నట్లు ప్రకటించడం, రష్యా ఆర్థిక వ్యవస్థనీ పరోక్షంగా దెబ్బతీసే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్టు ఉన్నాయా అనేవాదనలు తెరపైకి వస్తున్నాయి. అంతేకాదు రష్యాతో ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార వాణిజ్య సంబంధాలు కలిగిన భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాలు ఉక్రెయిన్ రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం ముగించే విధంగా రష్యాపై ఒత్తిడి చేయాలని, లేకుంటే భారత్, బ్రెజిల్, చైనా దేశాలపై వాణిజ్య సుంకాలు వంద శాతం విధిస్తామని బెదిరించే రీతిలో ట్రంప్ వ్యాఖ్యలు చేయడం విమర్శలకు తావు ఇచ్చే విధంగా లేకపోలేదు. ప్రపంచ దేశాలకు అమెరికానే పెద్ద దిక్కు అన్నట్టు ట్రంప్ అప్పుడప్పుడు దేశాల మధ్య నెలకొన్న వివాదాల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్య పరిష్కారానికి తాను అనుకునే రీతిలో ప్రయత్నించి, చెప్పితే వినని దేశాలపై అమెరికా ఉత్పత్తులపై పన్ను (టారిఫ్) అధికంగా విధిస్తామని, చెప్పినట్టు వినే దేశాలకు పన్నురాయితో పాటు ఆయుధ సంపత్తిని విక్రయిస్తామని ఏమైనా చేసుకోండి అనే రీతిలో ట్రంప్ వ్యవహార శైలి ఉంటుందా అనే సందేహాలు కలగక మానవు. తరచుగా అమెరికా అధ్యక్షుడు నుండి వస్తున్న పదం టారిఫ్ అంటే అంతర్జాతీయంగా వ్యాపార వాణిజ్య రంగాలలో తమ దేశ ఉత్పత్తుల్లో ఎగుమతులు దిగుమతులలో విధించే సుంకం లేదా పన్ను. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని పొందిన అనంతరం వాణిజ్య వ్యాపార సంబంధాల్లో అంతర్జాతీయంగా ఉన్న అమెరికా ఉత్పత్తుల ఎగుమతి దిగుమతుల విషయంలో తమకు అనుకూలంగా లేని దేశాలపై ఒక రకమైన టారిఫ్, అనుకూలంగా ఉన్న దేశాలపై తక్కువ శాతంటారీఫ్ విధానాన్ని అవలంబిస్తూ, దేశాల వాణిజ్యాన్ని నియంత్రించడానికి ద్వంద వైఖరితో ప్రత్యక్షంగా పరోక్షంగా అంతర్జాతీయంగా ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించేలా ట్రంప్ ప్రయత్నిస్తున్నడా అనే సంశయం కలగక మానదు. అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించడానికి భారత్ ,బ్రెజిల్ ,చైనాలు తప్పనిసరిగా రష్యాను ఒప్పించాలని లేనిపక్షంలో అధిక టారిఫ్‌కు సంబంధించిన దేశాలపై అధిక శాతం విధిస్తామనడం ట్రంప్ వైఖరి ముమ్మాటికి సరి అయినదా కాదా అనే భిన్న వాదనలు లేకపోలేదు. భారత్, బ్రెజిల్, చైనా లాంటి స్వతంత్ర దేశాలు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటాయి కానీ, అమెరికా ఒత్తిళ్లకు బెదరింపులకో తలొగ్గవనే విషయాన్నిఅమెరికా గ్రహించాల్సి వస్తుందేమో. అవసరమైతే భారత్ లాంటి దేశాలు అమెరికా ఉత్పత్తుల దిగుమతులను సాధ్య మైనంతగా తగ్గించి, స్వదేశీ ఉత్పత్తులను పెంచుకొని తమ దేశ



ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆంక్షల ప్రభావం చూపకుండా తమ దేశ ప్రయోజనాల కొరకు తమకు సహకరించే దేశాలతో వాణిజ్య వ్యాపారాలు కొనసాగిస్తాయి. అంతేకానీ అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని దేశాల మధ్య అంతర్గత యుద్ధాల్లో అనవసరంగా ఏకపక్షంగా ఎలాంటి సూచనలు సలహాలు చేయవలసిన అవసరం లేదనే అభిప్రాయాన్ని భారత్ లాంటి దేశాలు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం విశేషం. అమెరికా ఏమి అనుకున్నదో ఏమోకానీ ఎవరు ఏది చెప్తే అది వినడానికి రష్యాదేశం ఏమైనాఇజ్రాయిల్, ఇరాన్, పాకిస్థాన్ లాంటి దేశాలవలే కాదు కదా.ఆసియా ఖండంలో బలమైన దేశాలుగా ఉన్న భారత్ లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాల కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుంది. అవసరమైతే తప్ప ఇతరుల జోక్యాన్ని పూర్తిగా తోసిపుచ్చే విధానం నిర్దిష్టమైన విదేశాంగ విధానం భారత్ లాంటి దేశాలకు ఉన్నదని అమెరికాకు తెలియదా ఏమి. అలాంటప్పుడు అమెరికా ఒత్తిడితో భారత్ లాంటి దేశాలు అనవసరంగా వేరొక దేశ అంతర్గత విషయాల్లో జోక్యానికి ఎందుకు ప్రయత్నిస్తాయి అనే ప్రశ్నలు తలెత్తక మానవు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానంలో సరికొత్తపోకడలకు భాష్యాన్ని ఇస్తున్నట్టు, ప్రతి విషయాన్ని వాణిజ్య వ్యాపారంలో అధిక పనుల విధానంతో ముడి పెడుతుండడం విశేషం. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ముందు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడానికి ఏకంగా తనకేవ్వరు ప్రపంచంలో శత్రువులు లేనట్లు తన మాటను వినేవారే అధికమంటూ, యుద్ధాలను అధికారంలోకి రాగానే క్రమంగా ఆపిస్తానని రష్యా అధ్యక్షునితో తనకు మంచి సంభాషణే ఉన్నట్లుఅప్పట్లో వార్తలువచ్చాయి. అయితే డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి కైవసం చేసుకున్న తర్వాత ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపడమేమో గానీ, ఇజ్రాయిల్ పాలస్తీనా హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపించే ప్రయత్నంలో ఏకంగా ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై అమెరికా దాడి చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అనంతరం జరిగిన పరిణామాలలో ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారకున్ని అని చెప్పుకుంటూ వచ్చిన డోనాల్డ్ ట్రంప్ టెర్రరిస్టులకు బహిరంగంగానే ఆశ్రయం ఇస్తున్న పాకిస్థాన్ పైభారత్ తీసుకున్న చర్యలు నిర్దిష్టంగా ఉన్నప్పటికీ భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపించానని యుద్ధం ఆపకుంటే వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తాం అనగానే యుద్ధం ఆగిపోయిందని ట్రంప్ అంతర్జాతీయ వేదికలపై చెప్పిన విషయం విధితమే. ఏది ఏమైనప్పటికీ ట్రంప్ రష్యా. ఉక్రెయిన్‌మధ్య యుద్ధం ఆగిపోవాలని కోరుకోవడం సహజమే. నిజానికి ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వల్ల భారీగా ప్రాణ ధన నష్టాలను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలకు డోనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి కొంత ఆశాజనకంగా గోచరించవచ్చు కానీ ప్రపంచ శాంతికి తానే ముందు వరుసలో ఉన్నట్లు వ్యవహరించాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంలో దేశాల మధ్య యుద్ధ వాతావరణాన్ని నివారించడానికి టారిఫ్ విధానాన్ని ఆయుధంగా మలచుకొని సామవేద దండోపాయలతో దేశాలపై ఒత్తిడి పెంచి యుద్ధాలను ఆపాలని చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయో లేదో వేచి చూడాల్సిందే. •

గుంటూరు వార్త

## నాడు సాయం పొందాడు
# నేడు సాయం చేసేందుకు ముందుకు వచ్చాడు

**పేద విద్యార్థులకు విదేశీ విద్యకు స్కాలర్ షిప్ అందజేత**
**విదేశీ విద్యపై ఆసక్తి ఉన్న పేదలకు అండగా సాత్విక్**
**యువ వ్యాపారవేత్త సాత్విక్ ప్రశంసించిన సీఎం చంద్రబాబు**

**గుంటూరు,జూలై 22, ప్రభాతవార్త ప్రతినిధి :**

ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఉపయోగపడాలి. అప్పుడే ఆ పథకాలకు సార్థకత చేకూరుతుంది. 201419 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఇప్పుడు ఆ పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నాడు ఆర్థిక సాయం పొందిన చేతులు.. ఇప్పుడు పేదలకు సాయం



చేయడానికి ముందుకు వస్తున్నాయి. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును యువ వ్యాపారవేత్త సాత్విక్ మురారి కలిశారు. 2016 సంవత్సరంలో విదేశీ విద్యా పథకం కింద ఐర్లాండులో చదువుకోవడానికి నాటి టీడీపీ ప్రభుత్వం సహకరించిందని ముఖ్యమంత్రికి సాత్విక్ వివరించారు. ప్రభుత్వం అందించిన సాయంతో బిజినెస్ మేనేజ్మెంట్లో ఐర్లాండులో ఎంఎస్ విద్యను అభ్యసించానని చెప్పారు. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం చేసిన తాను.. ఇప్పుడు ఐర్లాండులో వ్యాపారాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. నాడు ప్రభుత్వం నుంచి సాయం పొందిన తాను.. ఇప్పుడు విదేశాల్లో చదవాలని ఆసక్తి చూపించే పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఉద్దశంతో ఉన్నట్టు సాత్విక్ చెప్పారు. ఈ మేరకు మెరిట్ కలిగిన పేద విద్యార్థులను ఎంపిక చేసి విదేశాల్లో వారికి చేయూతనిచ్చేలా స్కాలర్ షిప్ పేరుతో ఆర్థిక సాయం అందివ్వనున్నట్టు చెప్పారు. ఈ మేరకు తాము నలుగురు పేదలకు విదేశాల్లో చదువుకునేందుకు స్కాలర్ షిప్ అందించేందుకు ముందుకు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సాత్విక్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. తిరిగి సమాజానికి కొంత ఇవ్వాలి అనే ఆలోచన వచ్చిన యువకుడిని ప్రశంసించారు. సీఎంను కలిసిన వారిలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు స్వామిదాస్ ఉన్నారు.

## ప్రకాశం బ్యారేజికుచేరిన వరద నీరు

**తాడేపల్లి,జూలై 22,ప్రభాతవార్త :** ప్రకాశం బ్యారేజికి భారీగా వరద నీరు వస్తుంది.ప్రకాశం బ్యారేజి ఇన్ఫ్లో 20,748క్యూసెక్కులు కాగా,బ్యారేజ్ నుంచి 18,125క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. బ్యారేజ్ 25గేట్లు అడుగు మేర ఎత్తి నీటిని విడుదల చేశారు.బ్యారేజ్ నుండి కాల్వలకు 2,623క్యూసెక్కులు విడుదల చేశారు.




## గ్రామీణ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన పల్నాడు జిల్లా ఎస్పీ

నరసరావుపేట, జూలై 22 ప్రభాతవార్త : నరసరావుపేట గ్రామీణ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. రూరల్ పరిధిలో పెట్రోలింగ్ పెంచాలన్నారు. సమస్యలు ఉండే ప్రాంతాలను గుర్తించి గస్తీ ముమ్మరం



చేయాలన్నారు. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి, నిల్వలు, రవాణాపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు, ఫోక్సో కేసులలో విచారణ వేగంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు వెంట రూరల్ సి.ఐ. పి.రామకృష్ణ, ఎస్.ఐ.ఫాతిమా తదితరులు ఉన్నారు.

## పల్నాడు జిల్లాలో
# ఘోర రోడ్డు ప్రమాదం


**-ఆటోను ఢీకొన్న మినీ లారీ**
**- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం,మరో నలుగురికి గాయాలు**

**గుంటూరు ,జులై 22, ప్రభాతవార్త ప్రతినిధి :**

కనమర్లపూడి గ్రామ సమీపంలో ఘటన పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కనమర్లపూడి గ్రామ సమీపంలో ఆటోను మినీ లారీ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు, మరో నలుగురు గాయపడ్డారు.వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం, శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన




అన్నదమ్ములు బత్తుల శ్రీనివాసరావు, వెంకట్రావు కుటుంబాల మధ్య భూ తగాదా నడుస్తోంది. ఈ క్రమంలో నిన్న సాయంత్రం ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి.బాధితులు శావల్యాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, స్వల్పంగా గాయపడిన వ్యక్తిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో గాయపడిన వ్యక్తిని ఆటోలో ఎక్కించుకుని వారు వినుకొండ బయలుదేరారు. వారి ఆటో కనమర్లపూడి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న మినీ లారీ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తల్లి ముత్యాలమ్మ (68), భార్య నాగమూర్తమ్మ (48), వారి బంధువులు తల్లీకొడుకులు బత్తుల అంజమ్మ (57), బ్రహ్మయ్య (34) మృతి చెందారు. బత్తుల శ్రీనివాసరావు, యశోధర, ఆటో డ్రైవర్ చల్లా రాంబాబు, ముప్పాళ్ల మండలం కందులవారిపాలెంకు చెందిన మినీ లారీ డ్రైవర్ నరసింహరావు గాయపడ్డారు.ప్రమాదానికి కారణమైన మినీ లారీ బొప్పాయి మొక్కల లోడుతో యర్రగొండపాలెం నుంచి సత్తెనపల్లి నియోజకవర్గం కందులవారిపాలెం గ్రామానికి వెళుతున్నట్లు సమాచారం. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కారుమంచి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





# నాగులేరుకు జలకళ

**కారంపూడి, జులై 22 ప్రభాతవార్త:** వరుణుడి కరుణతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, చెరువులు నీటితో నిండాయి. నల్లమల్ల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి గత రెండేళ్లలో రాని వర్షపు నీరు నాగులేరుకు ఉధృతరూపం దాల్చింది. దీంతో నాగులేరు జలకళను సంతరించుకుంది. మండలంలో పెద్దకొదమ గుండ్ల, గాదెవారిపల్లె, ఇనుపరాజుపల్లె గ్రామాల నుంచి వంతెనపై నుంచి నీళ్లు పొంగి పొర్లాయి. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పరవళ్లు తొక్కాయి. నాగులేరు నల్లమల అడవిలో కురుస్తున్న వర్షం తాకిడికి నాగులేరు పరివాహక ప్రాంతంలో సుమారు 22 గ్రామాల పరిధిలో 2200 ఎకరాల భూమి సాగులో ఉంది.



నిన్న కురిసిన వర్షం రైతులకు ఉపయోగకరంగా ఉంది. నిండుకుండలాగా మారిన నాగులేరును పట్టణ ప్రజలు చూసేందుకు భారీగా తరలివచ్చారు. నల్లమల అడవుల్లో కురిసిన వర్షాలకు వచ్చే నీటికి రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు విజ్ఞప్తి చేస్తున్నారు. నాగులేరు పరివాహక ప్రాంతంలో సాగుభూమి ఉన్నా నిరుపయోగంగా మారిందని రైతులు అంటున్నారు. బోర్లతోనే కాలం గడుపుతున్నామే తప్ప నాగులేరుకు నీరు వస్తే పంటల సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని రిజర్వాయర్ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

## డ్రైన్ డైవర్షన్ పనులు వెంటనే ప్రారంభించాలి : నగర మేయర్

**గుంటూరు తూర్పు, జులై 22 (ప్రభాతవార్త) :** నగరంలోని డొంకరోడ్డు 3 వంతెనల వద్ద వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకు పరిష్కారంగా రైల్వేశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి



రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కమీషనర్ ఛాంబర్‌లో రైల్వే ఇంజనీర్లు, జీఎంసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, కమీషనర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ డొంకరోడ్డు వద్ద 3వంతెనల మార్గంలో రైల్వే శాఖ ట్రాక్ ఎక్స్ టెక్షన్ నిర్మాణం కోసం చేపట్టిన పనుల్లో భాగంగా డ్రైన్ పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకపోవడం వలన ప్రజలు వర్షాలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో శంకర్ విలాస్ వంతెన పనులు పూర్తి స్థాయిలో చేపడితే గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల అనుసంధాన మార్గంగా 3 వంతెనల మార్గం ఉంటుందన్నారు. తక్షణం డ్రైన్ డైవర్షన్ పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మృతదేహాలను సందర్శించి చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ, జులై22,ప్రభాతవార్త:** శావల్యాపురం మండలం కనమర్లపూడి వద్ద ఆటోను లారీ ఢీ కొన్న ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ చీఫ్‌విఫ్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పరామర్శించారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాల నందు మృతదేహాలను సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ



సానుభూతి తెలిపారు. జీ.వీ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకమన్నారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు.

## అపరిశుభ్రత,అరాచకాలకు అడ్డాగా
# పురపాలక అసంపూర్తి భవనం
### పట్టించుకోని మునిసిపల్ అధికారులు

**తెనాలి, మున్సిపాలిటీ జులై 22 (ప్రభాతవార్త) :** జిల్లాలో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో హోదా ఉన్న తెనాలి పట్టణం అన్ని రంగాల్లో ముందున్నప్పటికీ, అపరిశుభ్రత రంగంలో కూడా తానేమి తీసి పోలేదు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక కొత్త పండ్ల






మార్కెట్ 35వార్డులోని ఏడో డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఈ పండ్ల మార్కెట్ ఆరంబ సూరత్వానికి మారుపేరుగా, గతంలో కొత్తగా నిర్మాణం ప్రారంభించారు. అది అసంపూర్తిగా నిర్మాణం నిలిచిపోయింది. ఇక్కడ చూపరులను ఒళ్ళు జలధరింపుకు గురి చేసే, అశుభ్ర వ్యర్థాలు తిష్టవేసి ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయానికి పది గజాల దూరం కూడా లేని ఈ పండ్ల మార్కెట్ ప్రాంగణమంతా, దుర్వాసన వెదజల్లుతూ కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ఈ ప్రాంతంలో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టిలో ఇది పడకపోవడం ఆయన బాధ్యత రాహిత్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కమీషనర్ కూడా ఈ వైపు దృష్టి సారించకపోవడం, అలాగే పట్టణమంతా వేకువజామునే పారిశుద్ధ్యం నిర్వహిస్తున్న ఛైర్‌పర్సన్‌కు కూడా ఇది పట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ పండ్ల మార్కెట్ సమీపంలో వైన్‌షాపుల ఎదుట మురుగు కాలువల్లో షిల్ట్ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. ఈ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణాదారులు దుర్గంధం దాటికి ముక్కులు మూసుకుంటున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులకు ఆవాసంగా మారిపోయిందని పౌరులు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తగు చర్యల ద్వారా సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజానీకం కోరుతున్నారు.

## నరసరావుపేట పురపాలక సంఘానికి రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు

**నరసరావుపేట, జూలై 22 ప్రభాతవార్త :** నరసరావుపేట పురపాలక సంఘానికి రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంక్ లభించింది. పురపాలక సంఘ పరిధిలో గార్బేజ్ ఫ్రీ సిటీ విభాగంలో ఇటువంటి ర్యాంక్‌ను సాధించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మంగళవారం తెలియజేశారు. స్టార్ ర్యాంక్‌ను సాధించడం ప్రజలందరి సహకారంతో సాధ్యమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14వ ర్యాంక్‌తో పాటు దేశ వ్యాప్తంగా 265వ ర్యాంక్ లభించిందన్నారు.



స్వచ్ఛ సర్వేక్షణ్ - 2025లో దేశ వ్యాప్తంగా 4477 పట్టణ, స్థానిక సంస్థలు పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. దేశంలోని 72 శాతం పట్టణ జనాభా వీటి పరిధిలో ఉండటం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 123 మున్సిపాల్టిలలో నరసరావుపేటకు 14వ ర్యాంక్ రావడం అధికారులు, సిబ్బంది పనితీరుకు నిదర్శనం అన్నారు. తానే స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, పారిశుద్ధ్య కార్మికులకు ఈ స్ఫూర్తి ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు.

**గురవాయపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం...**

మండలంలోని గురవాయపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో గ్రామానికి జరిగిన మేలును ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద్‌బాబు వివరించారు. అదే విధంగా గ్రామస్తులకు సంబంధించి సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందని, మంచి పాలనకు ప్రజలు మద్దతు ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు.

# పనుల్లో నాణ్యత ఉండాలి

**-గుంటూరులో భారీ ప్రాజెక్టులు చేపట్టాం**
**-వర్షకాలంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**
**-ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు తూర్పు, జులై 22 (ప్రభాతవార్త) :** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట



చర్యలు చేపట్టాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక శాసన సభ్యులు వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షించాలని చెప్పారు. పనులు ఎంత వరకు పూర్తయ్యాయి? ఇంకా ఎంత శాతం పూర్తవ్వాలి? ఎన్ని రోజుల సమయం తీసుకుంటుంది వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నగరంలో సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భారీ ప్రాజెక్టులు చేపట్టామని, గుంటూరు నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వీటి నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు.

## వైయస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై22, ప్రభాతవార్త: కడపలోని డాక్టర్ వైయస్ఆర్.క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల్లో ప్రవేశాలకు సంబంధించి ఎంపికలు మంగళ వారం వర్సిటీలో జరిగాయి. ఈ ఎంపికలను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 136మంది (బాలికలు40,బాలురు 96)ని ప్రాథమికంగా ఎంపికచేయగా వారిలో 122మంది అర్హత పరీక్షలకు హాజరయ్యారు. వీరికి నిబంధనల మేరకు పరుగు, షటిల్‌రన్, 30మీటర్ల ఫ్లయింట్ స్టార్ట్ వంటి పలు అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పిపిఎస్.పాల్‌కుమార్ అర్హత పరీక్షలను పర్యవేక్షించారు.



## బంగారు పతకం సాధించిన ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థిని

నరసరావుపేట, జూలై 22 ప్రభాతవార్త : ఎస్ఎస్ఎన్ కళాశాలకు చెందిన నర్సింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న తులసి తన్మయ్ రాష్ట్రస్థాయిలో 5వ సీనియర్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2025లో ప్రతిభతో బంగారు పతకం సాధించారు. వివరాలను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు తెలియజేశారు. తులసితన్మయ్ సీనియర్స్ మహిళా విభాగంలో బంగారు పతకం సాధించడం కళాశాలకు గర్వకారణం అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభతో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు తగిన ప్రోత్సాహం ఇస్తామన్నారు.



# దొరికింది ఎరలే
# సొర చిక్కితేనే మద్యం కుంభకోణం ఆటకట్టు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై22, ప్రభాతవార్త:** గత పాలకుల విచ్చలవిడి అవినీతి, విశృంఖల దోపిడిలో మద్యం కుంభకోణం చిన్న అవగింజ అయితే, సిట్ విచారణలో ఇప్పటికరకు దొరికింది చిన్నచిన్న ఎరలే,అసలు సొర చిక్కితేనే ఆల్కాహాల్



కుంభకోణం ఆటకట్టినట్లు, కల్తీ మద్యానికి బలైన వారి ఆత్మలకు శాంతి లభించినట్లు అని మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. రోడ్డునపడిన లక్షలాది కుటుంబాలకు న్యాయం జరిగినట్లు అవుతుందన్నారు. పసుపు కుంకుమలు పోగొట్టుకొని, జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్న ఆడబిడ్డలకు న్యాయం జరిగినట్లు అవుతుందన్నారు. ఒక్క ఛాన్స్ అని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ అండ్‌కో వాటాలు, వంతుల వారీగా రాష్ట్రాన్ని లూటీ చేశారని ప్రత్తిపాటి తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో దశలవారీగా మద్యాన్ని నిషేదిస్తానని చెప్పిన జగన్ స్టార్ హోటల్స్‌లో తప్ప, ఎక్కడా మద్యం దొరకకుండా చేస్తానని, ఆడబిడ్డల అన్నగా చెపుతున్నానంటూ జగన్ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. పదవిలోకి రాగానే తన హామీని గాలికి వదిలేసి, గాలికంటే వేగంగా తన అవినీతిని విశ్వవ్యాప్తంగా పరచాడు. గ్రాఫిక్స్‌ను తలదన్నేలా సెల్ కంపెనీలు సృష్టించి లక్షల కోట్లు దేశం దాటించాడని ప్రత్తిపాటి విమర్శించారు.

**శాశ్వత " అధికారం " భ్రమలతో చేసిన పాపాలను శాశ్వతంగా తుడిచిపెట్టవచ్చునని భ్రమించారు**

అంతులేని తన ధనదాహానికి అధికారం దక్కడంతో జగన్‌లోని ధనపిపాసి నిద్రలేచాడని అన్నారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులతో పాటు సహజవనరులను చెరపట్టాడు. గుట్టుగా తన పనులు చక్కపెట్టేవారిని ఏరికోరి ఎంచుకొని మద్యం కుంభకోణానికి పథకరచన చేశాడు. చట్టం కళ్లుకప్పి చాకచక్యంగా ప్రజల సొమ్ము, రాష్ట్ర సంపద కొట్టేశామని, తమని ఎవరూ ఏమీ చేయలేరని జగన్ అండ్‌కో ఐదేళ్లపాటు అమితంగా ఆనందపడ్డారు. రాజ్యాంగ పరిమితులను, న్యాయసూత్రాలను, ప్రజాభిప్రాయాలను, ప్రతిపక్ష పార్టీలతో సహ వ్యవస్దలను ఖాతరు చేయకుండా అధికారంలో ఉన్నానని పెట్రేగి పోయాడు. శాశ్వతంగా అధికారంలో ఉంటానన్న ఆశలలోయ తేలియాడుతూ, చేసిన పాపాలను అంతే శాశ్వతంగా తుడిచి పెట్టవచ్చునని భ్రమపడ్డాడు.

**అరపైసా అవినీతి లేని అంశంలో అన్యాయంగా చంద్రబాబును అరెస్ట్‌చేసి తప్పుడు కేసులతో జైలుకు పంపించాడు**

ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వం రాకతో వైసిపి అవినీతి, దోపిడి పుట్టలు బద్దలయ్యాయని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ పారదర్శక పాలన, నిష్పక్షపాతక విధానాలు,సిట్ సమగ్ర విచారణతో మద్యం మాఫియా గుట్టు రట్టుఅయిందని ప్రత్తిపాటి తెలిపారు. దాంతో బిక్క చచ్చిపోయిన వైసిపి దొంగలముఠా,సాక్షాలు రూపుమాపినా, ఆధారాలు ధ్వంసం చేసినా ఎలా దొరికిపోయామా అన్న వేదనతో ఇప్పుడు గంగవెర్రులెత్తి పోతున్నారు. ఆపుకోలేని ఆక్కసు,అదుపుతప్పిన ఆవేశంతో ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, చేసిన పాపాలనుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. అవినీతి పరులను విడిచిపెట్టని చంద్రబాబు పట్టుదలతో జగన్ అండ్‌కోని కారాగార వాసానికి పంపుతారన్న భయంతో జగన్ అండ్‌కో నిరాధార అరోపణలు ప్రజా ప్రభుత్వంపై చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమ అరెస్ట్‌లు, కక్షసాధింపులను సమర్ధిస్తూ, నోటికి వచ్చినట్లు మాట్లాడినవారే ఇప్పుడు తమ దాక వచ్చేసరికి నీతి వ్యాక్యాలు చెపుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. అరపైసా అవినీతి లేని అంశంలో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి తప్పుడు కేసులు మోపి, అన్యాయంగా జైలులో పెట్టి వేదించి, రాక్షసానందం పొందినవారే ఇప్పుడు లబోదిబోమంటున్నారు. చేసిన తప్పులు, పాపాలు, ప్రజల కన్నీళ్లు, మద్యం మహమ్మారికి రోడ్డునపడిన ఆడబిడ్డల ఆర్తనాదాలు తమను నీడలా వెంటాడుతున్నాయనే కఠిన సత్యాన్ని వైసిపి నేతలు ఇప్పటికైనా గుర్తించాలని ప్రత్తిపాటి హితవు పలికారు. ప్రజలని నమ్మించవచ్చనే దుర్బుద్ధితో పదేపదే రెడ్‌బుక్ రాజ్యాంగమంటూ నిందలు వేయడం మాని చట్టప్రకారం జరిగే పాలనకు, న్యాయబద్దమైన విచారణకు సహకరించి తమ సచ్ఛీలతను నిరూపించుకోవాలన్నారు. నిజంగా నీతిమంతులని రుజువైతే, గతంలో మాదిరి ప్రజలలోకి వెళ్లి మరలా వారి తీర్పు కోరవచ్చునని ప్రత్తిపాటి సూచించారు.

## ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా జయలక్ష్మీ, చైతన్యలు

**చిలకలూరిపేట, జులై22, ప్రభాతవార్త:** చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గం నరసరావుపేట రోడ్‌లోని రోటరి కమ్యూనిటీ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్




అధ్యక్షురాలిగా నార్నె జయలక్ష్మీ, కార్యదర్శిగా చెన్నుపాటి చైతన్యలను ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ శాసనసభ్యురాలు, ఒయాసిస్ సంస్ద అధ్యక్షురాలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నర్‌వీల్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చిలకలూరిపేట ప్రాంతంలో ఎంతో గొప్పగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు క్లబ్ మాజీ అధ్యక్షురాలు గట్టు సరోజని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంలో తాను చేపట్టిన కార్యక్రమాల గురించి గట్టు సరోజిన సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు కారుమంచి సరళాదేవి జ్ఞాపకార్దం రోటరి మాజీ అధ్యక్షుడు సరళాదేవి భర్త కారుమంచి శివరావు ఇంటర్ చదువుతున్న పేద విద్యార్దికి రూ 15వేలు ఆర్దిక సహాయం అందించారు. అదేవిధంగా క్లబ్ మాజీ అధ్యక్షురాలు సాదినేని పద్మావతి, ఇద్దరు పేద విద్యార్దులకు ఒక్కొక్కరికి రూ 5వేల వంతున రూ 10వేలు ఆర్దిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ 2026-27 చైర్మన్ జి జయశ్రీ, ఇన్నర్‌వీల్ జిల్లా నాయకులు కె విజయలక్ష్మీ, చిలకలూరిపేట రోటరిక్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, రోటరి డైరక్టర్లు, ఇన్నర్‌వీల్ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణిలను అభినందించిన క్లబ్ సభ్యులు

**నాదెండ్ల, జులై22, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన ఛాంపియన్‌షిప్ పోటీలలోచిలకలూరిపేట సిఆర్ క్లబ్‌కు చెందిన క్రీడాకారిణిలు పాల్గొని విజయం



సాధించారు. ఉమెన్స్ సింగిల్స్ ఛాంపియన్‌గా చిన్నపాటి లోకేశ్వరి, అండర్ 19 డబుల్స్ రన్నర్స్‌గా చెన్నపాటి లక్ష్మీ, పల్లవి, లోకేశ్వరిలు గెలుచుకున్నారు. అండర్ 17 సింగిల్స్ రన్నర్స్‌గా చెన్నుపాటి లోకేశ్వరి వచ్చారు. అండర్ 17 డబుల్స్ రన్నర్స్‌గా చెన్నుపాటి లోకేశ్వరి, మరియు శ్రీలతలు గెలుచుకున్నారు. కాగా ఈ నెల 27,28 తేదిలలో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్దాయి పోటీలకు వీరు అర్హత సాధించారు. వీరిని మంగళవారం క్లబ్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో క్లబ్ సభ్యులు అభినందించారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు

**చిలకలూరిపేట, జులై22, ప్రభాతవార్త:** చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటి నూతన చైర్మన్‌గా ఎన్నికైన షేక్ కరిముల్లాను మంగళవారం పార్టీ కార్యాలయంలో మోటార్ వర్కర్స్ వెల్ఫేర్ యూనియన్ సభ్యులు కలసి సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ అధ్యక్షులు నల్లమోతు సాంబశివరావు, కార్యదర్శి టి ఎండుకొండలు, ఉపాధ్యక్షులు టింకర్‌బాబు, కోశాధికారి పఠాన్ నబీఖాన్, సంయుక్త కార్యదర్శి షేక్ ఖుద్దూస్, సభ్యులు షేక్ కరిముల్లా, షేక్ మస్తాన్‌వలి, దామర్ల



మనోహర్, వలిమేస్త్రి, శ్రీను మేస్త్రి తదితరులు మాట్లాడుతూ కరిముల్లాను మార్కెట్ యార్డ్ కమిటి చైర్మన్‌గా నియమింపచేసినందుకు మాజీమంత్రి,స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా పట్టణంలోని29వ వార్డుకు చెందిన టిడిపి నాయకులు కరిముల్లాను కలిసి సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి షేక్ కరిముల్లా, వార్డు అధ్యక్షులు షేక్ కరిముల్లా, వార్డు నాయకులు చంద్రశేఖర్, బేరింగ్ మౌలాలి, మౌలాబుడే, జున్నుబుడే, దరియాహుస్సేన్, కాలేషా, జానీ, ఆలీ, పట్టణ టిడిపి అధికార ప్రతినిధి మరకొండ మల్లిబాబు, షేక్ అజారుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిఏ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

**గుంటూరు విద్య, జూలై 22, ప్రభాతవార్త :** ఇటీవల తమ కళాశాల్లో పలు కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 44మంది ఎంబిఏ విద్యార్థులకు రూ. 2.5నుంచి రూ.10లక్షల ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించడం ఆనందదాయకమని ఎంబిఏ విద్యార్థులు దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకబలంగా




నిలుస్తున్నారని ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. వివిధ కంపెనీల ప్రాంగణాల ఎంపికలు సులభతరమై అధిక ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించాయని కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర,డైరెక్టర్ ఫైనాన్స్,అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు,ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీకృష్ణ,సిహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు,ఎంబిఏ విభాగ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జీ ఎన్ వినోద్‌కుమార్,తదితరులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ


**చిలకలూరిపేట, జులై22, ప్రభాతవార్త:** ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్ద ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని శ్రీసాయికృప ప్రశాంతి వృద్దాశ్రమం నందు నివసిస్తున్న వృద్దులకు రూ 12వేలు విలువచేసే చీరెలు, పంచెలు, షర్ట్‌లు, మందులు, నిత్యావసర వస్తువులను సంస్ద అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ పంపిణీ చేశారు. వీటిని ఒయాసిస్



కార్యదర్శి కరణం విజయలక్ష్మీ తండ్రి నాదెండ్ల ఆదినారాయణ చౌదరి జ్ఞాపకార్దం వారి భార్య నాదెండ్ల రంగనాయకమ్మ ఆర్దిక సహాయంతో పంపిణీ చేయడం జరిగిందని డాక్టర్ జయమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె యామిని, ఎస్‌కె అమీనా, సంస్ద సభ్యులు పాల్గొన్నారు.

## జెవివి ఆధ్వర్యంలో ప్రముఖ కవి దాశరధి శత జయంతి ముగింపు సభ

**చిలకలూరిపేటటౌన్, జులై22, ప్రభాతవార్త:** అగ్ని ధార, రుద్రవీణ వంటి ప్రముఖ అభ్యుదయ



కావ్యాలు రచించిన గొప్ప కవి దాశరధి అని ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ పివి సుబ్బారావు అన్నారు. స్దానిక శాఖా గ్రంధాలయంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన దాశరధి శతజయంతి ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓ నిజాం పిశాచమా, మా నిజాం తరతరాల బూజు అని ధైర్యంగా నిజాంను ఎదిరించి, నిరసించి, జైలుకు వెళ్లిన ప్రజా కవి దాశరధి అని కొనియాడారు. నా తెలంగాణా కోటి రత్నాల వీణ అని ప్రాంతీయతన చాటుకున్న దాశరధి ప్రజల హృదయాలలో నిలిచిపోతారని డాక్టర్ పివి తెలిపారు. ఎన్నో జనరంజకమైన సినిమా పాటల వ్రాసి ఆంధ్రుల హృదయాలలో చిరస్మరణీయుడిగా దాశరధి నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జితో పాటు పలువురు పాఠకులు పాల్గొన్నారు.

## అవగాహనలో బివిపట్టాభిరామ్‌కు నివాళి

**గుంటూరు కల్చరల్, జూలై 22, ప్రభాతవార్త :** యువతలో సానుకూల ఆలోచనలను రేకెత్తించటానికి ప్రేరేపించడానికి,జీవిత సవాళ్ళను అధిగమించి ఉన్నతంగా ఎదగటం లాంటి అనేక అంశాలపై తన ప్రసంగాలు,పుస్తకాల ద్వారా స్ఫూర్తినిచ్చిన బి.వి.పట్టాభిరామ్ చిరస్మరణీయుడని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.కార ్యక్రమంలో జనవిజ్ఞానవేదిక ఉపాధ్యక్షుడు సేతు రమేష్ మాట్లాడుతూ పట్టాభిరామ్ ఇంద్రజాలికుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి తన కేరీర్‌లో అంచెలంచెలుగా ఎదిగారన్నారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ పట్ాటభిరామ్ రచయిత,వ్యక్తిత్వ వికాస నిపుణులు,హిప్నాటిస్ట్,మెజీషియన్‌గా నే కాకుండా మంచి నటుడుగా కూడా తెలుగువారికి పరిచయమన్నారు.

## 24న అవగాహనలో హాస్యవల్లరి

**గుంటూరు విద్య, జూలై 22, ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 15సంవత్సరాల నుండి ప్రతినెలా హాస్యప్రియుల కోసం నిర్వహిసు ్న హాస్యవల్లరి-నవ్వూ నవ్వించు కార్యక్రమం జూలై 24 గురువారం సాయంత్రం 6గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించబడుతుందని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. హాస్యప్రియులు జోక్స్,ప్యారడీలు మిమిక్రి, మ్యాజిక్, స్కిట్స్‌లతో హాజరైన వారిని నవ్విస్తారన్నారు.హాస్యప్రియులందరూ నవ్వూ నవ్వించు కార్యక్రమానికి హాజరు కావలసిందిగా అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# అభివృద్ధికి బ్రాండ్ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

**-అంబటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన నాయకులు**
**-అభివృద్ధిని ఓర్వలేక అంబటి నరేంద్రపై వ్యాఖ్యలు**
**-ప్రతిపక్షంలోనూ విధ్వంసాన్ని సృష్టిస్తున్న వైకాపా**
**-టిడిపి మండలాధ్యక్షుడు మైలా వెంకటరామాజు**

**పొన్నూరు, జూలై22, ప్రభాతవార్త:** అభివృద్ధికి బ్రాండ్ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాత్రమేనని టిడిపి చేబ్రోలు మండలాధ్యక్షుడు మైలా వెంకటరామరాజు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి అంటే ధూళిపాళ్ళ, ధూళిపాళ్ళ అంటే అభివృద్ధి అని చెప్పారు. వివాదాలకు కూటమి ప్రభుత్వం దూరంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ వైకాపా విధ్వంసాన్ని సృష్టిస్తుందన్నారు. వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ వ్యాఖ్యలను పూర్తిగా




ఖండిస్తున్నట్లు చెప్పారు. గుండవరం గ్రామానికి చెందిన రామలింగేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌ను సంప్రదించిన తక్షణమే దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడి సీజెఎఫ్ గ్రాంట్ కింద రూ.44లక్షలు మంజూరు చేయించారన్నారు.అదేవిధంగా దాత అయిన గోపిశెట్టి కోటేశ్వరరావు దంపతులు రూ.23.50లక్షలు ఆలయ పున :నిర్మాణానికి అందజేశారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి రామలింగేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి సహకరించాలని కోరారు. గత వైకాపా పాలనలో దేవాలయాలను కూల్చడమే కానీ, ఎక్కడా నిర్మాణం చేసిన దాఖలాలు లేవన్నారు. వైకాపా నాయకులు దేవాలయాలను కూల్చడమే లక్ష్యంగా పనిచేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు రాజకీయనాయకులు హుందాగా వ్యవహరించాలని, వైసీపీ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. జనసేన చేబ్రోలు మండలాధ్యక్షుడు చందు శ్రీరాములు మాట్లాడుతూ వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు నియోజకవర్గం గురించి ఏమి తెలుసని మాట్లాడుతున్నా ్నారు. ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌పై విమర్శలు చేసేటప్పుడు నరే ంద్రకుమార్ అంటే తెలుసుకొని మాట్లాడాలన్నారు. అభివృద్ధికి మారుపేరే ధూళిపాళ్ళ కుటుంబం అన్న విషయాన్ని అంబటి తెలుసుకోకపోవడం విచారకరమన్నారు. అంబటి మురళీకృష్ణ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లే వ్యాఖ్యలను మానుకోవాలన్నారు. వైకాపా చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చేస్తున్నందుకు అంబటి మురళీకృష్ణ ఓర్వలేక పోతున్నారన్నారు. ఇకనైనా అంబటి మురళీకృష్ణ అర్ధంపర్ధం లేని విమర్శలు మానుకోకపోతే ప్రజా క్షేత్రంలో తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి మండల ప్రధానకార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, బిజెపి మండలాధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను మెరుగుపరచాలి : సిడిపిఓ లక్ష్మీదేవి

**కొల్లూరు, జులై 22 (ప్రభాతవార్త) :** అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను మెరుగుపరుచుకునే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని అమృతలూరు ప్రాజెక్టు ఐసిడియస్ అధికారిణి లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అమృతలూరు



ప్రాజెక్టు పరిధిలోని 5 మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం జరిగింది. కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ రజని ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సమయాలలో కార్యకర్త, సహాయసహకారాలు కేంద్రానికి వచ్చి ఫేస్ తంబ్ వేయాలన్నారు. కేంద్రానికి సంబంధించిన వివరాలను యాప్‌లలో నమోదు చేయాలన్నారు. సిబి ఈవెంట్లను ప్రతి నెలా రెండు సార్లు కేంద్రంలో నిర్వహించాలన్నారు. ప్రతినెల పిల్లల బరువులను ఖచ్చితంగా ఉండే విధంగా రికార్డులలో నమోదు చేయాలన్నారు. గర్భవతులకు, బాలింతలకు సకాలంలో పోషకాహార పదార్థాలను అందజేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. గర్భవతులకు, బాలింతలకు వైద్య సహాయం అందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. విధులలో అలసత్వం వహించే కార్యకర్తలు, సహాయకురాళ్ళపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు రజని, ఫజరున్నీసా, అమృతవాణి, సునీత, విజయలక్ష్మీ, నాంచారమ్మ, సంపూర్ణ, పద్మావతి, శకుంతల, 5 మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరిపైరులో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

**-మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు**

**పొన్నూరు, జూలై 22, ప్రభాతవార్త:** ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్నందున వరిపైరు మొలక దశలో ఉందని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని వెల్లలూరు, బ్రాహ్మణకోడూరు గ్రామాల్లో



మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరిపొలంలో నీరు వెంటనే బయటకు పంపి తేలికపాటిగా యూరియా, పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలన్నారు. ఒక్కసారి కార్బెండిజమ్(బావిస్టిన్) ఎకరాకు 250గ్రాములు పిచికారి చేయాలని సూచించారు.పంటల బీమా కింద రైతులు ఎకరాకు రూ.800ల వరిపైరుకు చెల్లించాలన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలన్నారు. ప్రతి రైతు వేసిన పంటను ఈ పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. జీవన ఎరువులు వినియోగిస్తే 10శాతం ఎరువులు ఆదా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణకోడూరు పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. పశుదాణా రాయితీపై ఇచ్చేందుకు సిద్దంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, డి.యామిని, ఎ.భావన, ఎంపీఈఓ ఎస్.సురేష్‌బాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పని సరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

**-మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి**

**కొల్లిపర, జులై 22 (ప్రభాతవార్త) :** ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం




మండల పరిధిలోని చివలూరులో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ పంటలపై రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంటను నమోదు చేయించుకోవడం వలన రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతే పెట్టుబడి రాయితీ, పంటల భీమా, రుణాల వడ్డీ మాఫీ వంటి పధకాలకు అర్హులు అవుతారన్నారు. రైతులు తమ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలు

**పొన్నూరు, జూలై 22, ప్రభాతవార్త:** వచ్చే నెల23, 24తేదీలలో గుంటూరులో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నుంచి తెచ్చిన వలస కార్మికులకు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలని, సామాజిక భద్రత చట్టాలు అమలు చేయాలని కోరారు. సంక్షేమ బోర్డులో వున్న నిధులను



మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు కోరారు. మండల పరిధిలోని మాచవరం గ్రామంలో అందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పనిచేయకపోవడం వల్ల కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని చర్చించి భవిష్యత్ ప్రణాళికలను మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నప్పటికీ స్థానికులకు ఒకరికి కూడా ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం స్థానికులను అవమానపరచడమేనన్నారు.బయట భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన మ్యానిఫెస్టోలో పొందుపరచిన ఏ ఒక్క హామీని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. గుంటూరులోని శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో రెండు రోజులపాటు జరిగే మహాసభలలో భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కె.వాసు, లక్ష్మయ్య, నవీన్, పవన్‌కుమార్, మహబూబ్ సుబాని, రాజు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులకు గ్రామస్తులు సహకరించాలి

**-ఎంపీడీవో విజయలక్ష్మీ**

**కొల్లిపర, జులై 22 (ప్రభాతవార్త) :** పారిశుద్ధ్య పనులకు గ్రామస్తులు కూడా సహకరించాలని ఎంపీడీవో విజయలక్ష్మీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోటలో పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. పంచాయితీ సిబ్బందికి పారిశుద్ధ్య పనులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు




గురించి వివరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాఉడతూ కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా అంటు వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. కాల్వల్లో ఉన్న మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్‌ను చల్లించాలన్నారు. ముఖ్యంగా దోమల మందును కూడా పిచికారీ చేయించాలన్నారు. బహిరంగా మల విసర్జనను నిర్మూలించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి బార్గవ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలుగా మార్చడమే పి4 ఉద్దేశం

**-ముఖ్య ప్రణాళికాధికారి పి.శేషశ్రీ**

**పొన్నూరు, జూలై 22, ప్రభాతవార్త:** ఆదాయం, ఆరోగ్యం, నైపుణ్యం పరంగా వెనుకబడి అవకాశాలు పొందలేక ఆర్ధికంగా వెనుకబడిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చుడమే పి4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ముఖ్య ప్రణాళికాధికారి పి.శేషశ్రీ చెప్పారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన పి4 కార్యక్రమ అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి




మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఊహారాణి అధ్యక్షత వహించారు. శేషశ్రీ మాట్లాడుతూ సమాజంలోని అవకాశాలను పుణికిపుచ్చుకొని అభివృద్ధి చెందిన 10శాతం ధనికులను నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం వారిని మార్గదర్శకులుగా జతచేసి తద్వారా పేదరికం లేని సమాజనిర్మాణం కోసం పి4కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఏడు ప్రధాన అవసరాలు అంశాల ప్రాతిపదికన నీడ్ సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వే ద్వారా గుర్తించిన పేద కుటుంబాలను బంగారు కుటుంబంగా తయారు చేసేందుకు గ్రామంలోని 10శాతం అభివృద్ధి చెందిన ధనిక కుటుంబాల్లోని వ్యక్తులను వీరికి మార్గదర్శకులుగా మ్యాచ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ బంగారు కుటుంబాలలోని సభ్యులకు అర్హతను బట్టి పని అవకాశం ఉద్యోగ అవసరం తీర్చడం, స్వయం ఉపాధికి సహకారం, ప్రభుత్వ ఫీజు కంటే అధికముగా చెల్లించే పై చదువులు, వ్యవసాయసాగు, మార్కెటింగ్, బ్యాంకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులు కలవారికి వైద్య సహాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసశర్మ, ఏఓ ఉమాదేవి, ఎఈ శ్రీనివాసరావు, ఎపిఎం శ్రీలక్ష్మి, ఎస్‌ఓ ధర్మారావు, పంచాయితీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విప్రో డిష్‌వాష్ టివి ప్రకటనలో నటులు సత్యరాజ్, రమ్యకృష్ణ

**విజయవాడ, జూలై 22, ప్రభాతవార్త :** విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్‌కు చెందిన జెల్ బ్రాండ్ జిఫ్సి కోసం దక్షిణాది స్టార్ నటులు సత్యరాజ్, రమ్యకృష్ణన్‌లతో వాణిజ్య ప్రకటనను రూపొందించామని విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సీనియర్ ప్రెసిడెంట్ ఎస్ ప్రసన్నరాయ్ తెలిపారు. ప్రతి వంటింట్లో ఎదురయ్యే వంటనూనె జిడ్డు మరకలపై దాడిచేస్తూ జిఫ్సి ని నమ్మకమైన, శక్తివంతమైన శుభ్రత మిత్రుడిగా పరిచయం చేస్తారన్నారు.

## సీపీఐ ఏరియా మహాసభలను జయప్రదం చేయాలి : మండల కార్యదర్శి సైదా

కారంపూడి, జులై 22 (ప్రభాతవార్త): భారత కమ్యూనిస్టు పార్టీ మాచర్ల నియోజకవర్గ మహాసభలు ఈ



నెల 29న జరగనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా మంగళవారం తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం సీపీఐ పార్టీ కృషి చేస్తుందన్నారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ పేదల కోసం ఇళ్ల స్థలాలు కల్పించి, భూపోరాటాలు చేసిన ఘనత ఉందన్నారు. మాచర్ల నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయడానికి గ్రామగ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూరె హనుమంతరావు, జింకల వెంకట కోటేశ్వరరావు, మేకపోతు చిన్నకోటిరెడ్డి, ఏకె నాగమణి, ఇందూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు ఉచిత మంచినీరు అందించేందుకు చర్యలు



కారంపూడి, జులై 22 ప్రభాతవార్త: మండలంలోని చింతపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు జనసేన మండల ప్రధాన కార్యదర్శి మైల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఒకట తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి మినరల్ వాటర్ సంవత్సర కాలంపాటు అందించేందుకు సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కొండ నాయకుకు వాటర్ ప్లాంట్ నుంచి మంచినీరు వచ్చే విధంగా అనుమతి పత్రాన్ని అందజేసినట్లు జనసేన మండల ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారంపూడి మండల వాలంటీర్స్ విభాగం అధ్యక్షునిగా శివ



కారంపూడి, జులై 22 ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వలంటీర్ విభాగం మండల అధ్యక్షులుగా కారంపూడికి చెందిన గుండెబోయిన శివను నియమించినట్లు పార్టీ నేతలు మంగళవారం తెలిపారు. గుండెబోయిన శివ తొలి నుంచి వైకాపా కార్యకర్తగా పనిచేస్తూ పార్టీలో మంచి గుర్తింపు పొందారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించడంతో అధిష్టానం శివ తల్లికి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కారంపూడి-1 ఎంపీటీసీగా అవకాశం కల్పించారు. గత ఎన్నికల్లో గుండెబోయిన అమ్మలక్ష్మి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా కూడా కొనసాగారు. శివను గుర్తించుకుని వైకాపా సముచిత స్థానం కల్పించింది. తనకు వలంటీర్ల విభాగం అధ్యక్షునిగా నియమించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపల్లిలో తెదేపా నేతల ఇంటింటి ప్రచారం

విజయపురిసౌత్, జులై 22 ప్రభాతవార్త: టీడీపీ యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి




తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూలకంటి చిరంజీవిరెడ్డి, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండెబోయిన శ్రీను, కొండారెడ్డి, నాగేశ్వరరావు, జయరాజు, మూర్తి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో మాచర్ల వెంకటేష్, రాంబాబు, లూర్దు, వెంకట్, ఎమ్మెల్యే కుమారుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి, రామాంజయ్య, గుమ్మా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 4వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ

తాడేపల్లి, జులై 22, ప్రభాతవార్త : స్థానిక 4వ వార్డు బుర్రముక్కు వేంకటరెడ్డి (లూన) స్థలంలో "బాబు ష్యూరిటి మోసం గ్యారంటీ" కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి విచేచ్చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి సంవత్సరకాలం గడిచినా వాటిని అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు, ఎన్నికలకు ముందు అధికారం కోసం దొంగ హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీలు అడిగే వారి మీద ఎలా కక్షపూరిత రాజకీయాలు చేసి కేసులు పెడుతున్నారు. బాబు చెప్పిన సూపర్ సిక్స్ హామీల ద్వారా ప్రజలకు రావలసిన సంక్షేమాలు ఈ సంవత్సరం కాలంలో ఎంత మోసయోయారన్నది వివరించారు. అలాగే పార్టీ బలోపేతం కోసం వార్డు కమీటీలు వేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ అండ్ కెవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మేకా పావని, నియోజకవర్గ రైతు, సోషల్ మీడియా వాలంటరీ విభాగ అధ్యక్షులు బందాపు రుక్మాంగ రెడ్డి, భీమిరెడ్డి శరణ్‌కుమార్ రెడ్డి (బాబి) దార్ల సత్యనాథ్, పట్టణ ఉపాధ్యక్షులు జీలగ పెదగాలయ్య, వేల్పుల ఎలీషా, ప్రధాన కార్యదర్శులు చిన్నపోతుల దుర్గారావు, చిట్టిమల్ల స్నేహ సంధ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## వెనుకబడిన వారిని గుర్తించి వారి అభ్యున్నతికి అభివృద్ధికి కృషిచేయాలి

తాడేపల్లి, జులై 22, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన పి4 (ప్రభుత్వ,



ప్రవేటు, ప్రజల భాగస్వామ్యం) లక్ష్యం మేరకు గ్రామాల్లో బాగా వెనుకబడిన వారిని గుర్తించి వారి అభ్యున్నతికి అభివృద్ధి చెందిన వారి ద్వారా సహకారం అందించి లబ్ది చేకూరే పనులు చేపట్టడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ అన్నారు. తాడేపల్లి 12వ సచివాలయంలో 15,16వార్డులకు సంబంధించి పి4 సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరరావు యాదవ్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో అందరూ పాలుపంచుకోవాలని మెజార్టీ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపడం జరుగుతుందన్నారు. అట్టడుగు కుటుంబాల వివరాలు తీసుకొని ఉన్నతంగా స్థిరపడిన వారి సహకారంతో వారి ఉన్నతికి చేయూత నివ్వడం జరుగుతుందన్నారు. స్వచ్ఛంధ సంస్థలు, స్టేక్ హోల్డర్స్ పి4 సర్వే పై ప్రజల్లో అవగాహన కల్పించి ఎక్కుక మంది సర్వేలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, కళ్ళం బాపిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పి.భాస్కరరావు, వంగర శివశంకర్, ఎం.సంజీవ్ రెడ్డి, 15వ వార్డు అధ్యక్షులు తాడిబోయిన గోపి, కంభం సాయిచంద్, నాగూర్ వలి, తాడి బోయిన కృష్ణ, సింకా శ్రీను, సుబ్బారావు, మహిళా పోలీస్ వెంకట రమణ, వేల్ఫేర్ కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్‌లో లిల్లీ శరణ్యకు ప్రథమ బహుమతి



పొన్నూరు, జులై 22, ప్రభాతవార్త: సెయింట్ థామస్ కేరళ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని పొందుగల లిల్లీ శరణ్య అబాకస్‌లో ప్రథమస్థానాని సాధించినట్లు స్కూల్ యాజమాన్యం మంగళవారం తెలిపారు. గుంటూరులో జరిగిన 9వ ఆంధ్రప్రదేశ్ యుసిఎంఎస్ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో మొదటి బహుమతి సాధించిందన్నారు. లిల్లీ శరణ్య అసాధారణమైన ప్రదర్శనతో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా శరణ్యను ప్రిన్సిపాల్, సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.

## తుమ్మలచెరువు, వీరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పిడుగురాళ్ల, జులై 22 ప్రభాతవార్త : మండలంలోని తుమ్మలచెరువు, వీరాపురం గ్రామాల్లో మంగళవారం ఏవో సంధ్యారాణి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై రైతుల్లో అవగాహన కల్పించారు. రైతులు తమ పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. ఇందు కోసం రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

## చంద్రబాబు పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు : చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, జులై22, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. పట్టనంలోని 18వ వార్డు బోసుబొమ్మసెంటర్ నందు సుపరిపాలన తొలి అడుగు



కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీ.వీ కూటమి నాయకులతో కలసి వార్డులోని ప్రతి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకొని కరపత్రాలు పంపిణీ చేశారు. జీ.వీ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేని చంద్రబాబు మార్క్ పాలన రాష్ట్రంలో కొనసాగుతుదంన్నారు. గత వైకాపా హయాంలో పింఛన్లు మంజూరు చేయాలన్నా పెద్ద మొత్తంలో అవినీతి చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై వైకాపా చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండలో ఘనంగా అహోరాత్ర రుద్ర పారాయణం

వినుకొండ, జులై22, ప్రభాతవార్త: వినుకొండ అర్చకసంఘం పురోహితుల ఆధ్వర్యంలో చేపట్టిన అహోరాత్ర రుద్ర పారాయణం




విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, పురోహితులను అభినందించారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం చంద్రబాబుకు దేవుడి ఆశీస్సులు అన్ని విధాలుగా ఉండాలని కోరుకున్నారు.

## ఎటువంటి అవకతవకలు జరిగిన డీలర్లపై తగిన చర్యలు

### -తహశీల్దార్ సిద్దార్ధ

కొల్లిపర, జులై 22 (ప్రభాతవార్త) : చౌకడిపో డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తహశీల్దార్ సిద్దార్ధ అన్నారు. మంగళవారం స్థానిక



మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నిత్యావసర సరుకుల పంపిణీపై డీలర్లకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్దార్ధ మాట్లాడుతూ డీలర్లు రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగిన సంబంధిత డీలరుపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. రేషన్‌కార్డు దారులు కూడా డీలర్లుకు సహకరించాలన్నారు. బియ్యం, కందిపప్పు, పంచదార, వంటి నిత్యావసర సరుకులను రేషన్ కార్డు దారులు డీలర్ల వద్దనే తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రాకేష్, ఆర్ఐ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అనాధశవానికి అంత్యక్రియలు నిర్వహించిన శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు

తెనాలి, రూరల్ ,జులై 22 (ప్రభాతవార్త) : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో మృతి చెందిన అనాధశవానికి శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు



నిర్వహించారు. పోలీస్ శాఖవారి విజ్ఞప్తి మేరకు మంగళవారం శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులోగల మహాప్రస్థానం నందు సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాప్రస్థానం సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్, మల్లెల వాసు, పోతురాజు, ఎస్.రాంబాబు, పి.నరేంద్ర, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరిత్యాలపై అవగాహన

కాకుమాను జులై 22 (ప్రభాతవార్త) : మండల పరిధిలో కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ డి ఆర్ ఆఫ్ బృందం వారితో ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు చేయవలసిన, చేయకూడని అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని మండల తహశీల్దార్ బి. వెంకటస్వామి మంగళవారం తెలిపారు. తుఫాన్లు, అగ్నిప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, ఆ సమయంలో ఎటువంటి పనులు చేయాలి, ఎటువంటి పనులు చేయకూడదు అను అంశముల పై గ్రామ ప్రజలు, విద్యార్థులకు ఎన్‌డిఆర్‌ఆఫ్ బృందం అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ రెవిన్యూ అధికారీ, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నరసరావుపేటలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు రూ.2కోట్లు మంజూరు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, జులై 22 ప్రభాతవార్త : నరసరావుపేటలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు.



మంగళవారం లింగంగుంట్ల గ్రామ పరిధిలో 42 సెంట్ల స్థలాన్ని డిజిటల్ లైబ్రరీ నిర్మాణం కొరకు ఆర్డీవో మధులత, కమిషనర్ జశ్వంత్‌రావులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ అత్యంత ఆధునిక లైబ్రరీ అందుబాటులోకి రావడం ద్వారా ముఖ్యంగా విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువతకు, పరిశోధకులకు ఎంతో ఉపయోగమన్నారు. నరసరావుపేట అభివృద్ధికి మరో మెట్టు డిజిటల్ లైబ్రరీ అని తెలిపారు. హై స్పీడ్ ఇంటర్‌నెట్, ఈబుక్స్, ఆన్‌లైన్ జర్నల్స్, మల్టీమీడియా లెర్నింగ్ సౌకర్యాలు ఉంటాయన్నారు. అంతర్జాతీయ స్థాయి విద్యావనరులు ఈ ప్రాజెక్ట్ పూర్తైతే నరసరావుపేటకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వివరించారు.

**మొక్కలు నాటిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ...**

పట్టణంలోని ఎన్జీవో కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. స్థానికులతో పాటు విద్యార్థులకు పచ్చదనం - పరిశుభ్రత ప్రాధాన్యతను తెలియజేశారు. మొక్కలు పెంచడం వలన కలిగే ఉపయోగాలను తెలియజేశారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించే బాధ్యత అంతే ముఖ్యమన్నారు. మొక్కలను దత్తత తీసుకొని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలి

పిట్టలవానిపాలెం, జులై22, ప్రభాతవార్త: మహిళలు, విద్యార్థినిలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్ ను వినియోగించుకొని పోలీస్ శాఖ తక్షణ సహాయం పొందాలని చందోలు ఎస్ ఐ ఎం వెంకట శివకుమార్ తెలిపారు. చందోలు జెడ్ పి హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం శక్తి మొబైల్ యాప్ ఆవశ్యకత, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు ఇతర మహిళా సంబంధిత నేరాలపై చందోలు ఎస్ ఐ ఎం వెనకట శివకుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అనుకోని అపద ఎదురైతే ఏ విధంగా ఎదుర్కోవాలి, ఏ విషయాన్ని ఎవరితో పంచుకోవాలి, మొదట ఎవరికీ చెప్పాలి, పోలీసులు సహాయం ఎలా తీసుకోవాలి అనే విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్ గురించి, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినిలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్ ను వినియోగించుకొని పోలీస్ శాఖ తక్షణ సహాయం పొందవచ్చునన్నారు.



అత్యవసర పరిస్థితిలో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే, నిమిషాల వ్యవధిలోనే సంబంధిత పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకొని సహాయం అందిస్తారని తెలిపారు. మహిళలకు, విద్యార్థినిలకు అత్యంత ఉపయుక్తంగా ఉండే శక్తి యాప్ ను ప్రతి ఒక్కరు వారి మొబైల్ ఫోన్ లలో నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు.

## త్వరలో వైకాపా గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలి

### -మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి, రూరల్ జులై 22 (ప్రభాతవార్త) : వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్బికే సెంటర్లు ఆరోగ్య కేంద్రాలకు సొంతభవనాలు ఏర్పాటు చేసి సంక్షేమాన్ని అందించామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇవ్వలేదని, తన హయాంలో తెనాలి నియోజక వర్గంలో 37,000మందికి పెన్షన్లు అందించడం జరిగింద న్నారు. ఆగస్టు 4వ తేది నుండి అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం ప్రకటిం చిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలు ఎంత




పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల గ్రామాల ముఖ్య నాయకులతో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో పని లేకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. కూటమి ప్రభుత్వం వైసిపి వారికి పథకాలను దూరం చేస్తుందని, ఇది మోసం కాదా అన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచిపోయినా ఇప్పటివరకు ఒక కొత్త పెన్షన్ కూడా వరకు మోసపోయారో వివరించాలన్నారు. ఇప్పటికే ఈ పథకాలపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నదని, మోసపోయామని గ్రహిస్తున్నా రని, అందుకు అనుకూలంగా గ్రామ కమిటీలు, ప్రజల్లో అవగాహన తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పిల్లి ఉమాపణతి, మండల పార్టీ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస రావు, చెన్నకేశవులు, అక్కిదాసు కిరణ్‌కుమార్, పెదరావూరు గొరికపూడి రాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ గ్రామాల ప్రతినిధులు, ముఖ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

### -మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

పొన్నూరు, జులై 22, ప్రభాతవార్త: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేసి, కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకొన్నారు. పాఠశాలకు సంబంధించిన అన్నీ రికార్డులను



పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను, హాజరును, ఇతర రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని కూడా స్వయంగా తెలుసుకొన్నారు. విద్యార్థులచే చదివించడం, వ్రాయించడం వంటివి చేయించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ ఉపాధ్యాయులకు సూచిస్తూ ప్రతి విద్యార్థికి తెలుగు, ఇంగ్లీషుల్లో వ్రాయడం, చదవడం తప్పనిసరిగా వచ్చేవిధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడితే తప్పనిసరిగా విద్యార్థులు విజయం సాధించే దిశగా అడుగులు వేస్తారన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్‌లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. దండమూడి, ఆరెమండ, వెల్లలూరు, తదితర పాఠశాలలను పరిశీలించారు. ఆయా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన పలు విషయాలను మండల విద్యాశాఖాధికారి విజయభాస్కర్‌తో చర్చించారు

## ఉప కారాగారంలో ఖైదీలకు అవగాహన, వైద్య పరీక్షలు

నరసరావుపేట క్రైం, జులై 22 ప్రభాతవార్త : నరసరావుపేట ఉప కారాగారంలో వైద్య ఆరోగ్యశాఖలో భాగమైన డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి ల్యాప్రా సొసైటీ సహకారంతో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఖైదీలకు టిబి, హెపటైటిస్, సిఫిలిస్ పరీక్షలు జరిగాయి. జైలు సూపరింటెండెంట్ ఎస్.అంజయ్య, డిప్యూటీ జైలర్ రాములు, కోఆర్డినేటర్ జయప్రద, కౌన్సిలర్ వనజాక్షి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలకు పొగాకు దెబ్బతింటుంది

### వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం డిమాండ్

కాకుమాను జులై 22 (ప్రభాతవార్త) : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు గత ఏడాది ఖరీఫ్ లో పొగాకు సాగు చేసి నిల్వ ఉంచుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని రైతు



సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కాకుమాను మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాలలో పొగాకు మండెల వద్ద రైతులను నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కన్నెగంటి చంద్రరావు, నల్లమోతు రాజేంద్ర, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు లతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని మండల కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటుచేసిన కేంద్రాలలో నెమ్మదిగా కొనుగోలు జరపటం వల్ల రైతుల వద్ద పొగాకు పెద్ద మొత్తంలో నిల్వ ఉందన్నారు. ఎకరాకు లక్షన్నర రూపాయలు పెట్టుబడి పెట్టారని, ప్రస్తుత వారి పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. పెదనందిపాడు మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## పాలపర్రు, రాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది


పెదనందిపాడు జులై 22 (ప్రభాతవార్త): పెదనందిపాడు మండలంలోని పాలపర్రు రాజుపాలెం గ్రామాల్లో మంగళవారం




ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు కంది మరియు అపరాలైన మినుములు వేసుకోవచ్చని రైతులకు సూచించారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్సెస్ ఉన్నట్లయితే 23వ తారీకు కే లాస్ట్ కనుక అందరూ గ్రీవెన్స్ ఉన్నట్లయితే వెంటనే తమ వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించాలన్నరు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మిదేవి. పాలపర్రు సర్పంచ్ సునీత . ఉప సర్పంచ్ జంపని సంజీవ రావు వి ఏ ఏ నరేష్ రైతులు పాల్గున్నారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్‌కు ఘన నివాళి

పెదనందిపాడు జులై 22 (ప్రభాతవార్త): సోమవారం మృతి చెందిన ప్రజల మనిషి, కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ వి ఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపంగా మంగళవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. సీనియర్ సభ్యులు జంపని



రామారావు వారి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ కామ్రేడ్ విఎస్‌గా సుపరిచితులైన అచ్యుతానందన్ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారన్నారు. సాధారణ వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించినా, ప్రజా బలంతో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు అని అన్నారు. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజా నాయకుడు అని కొనియాడారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదలకు భూమి, ఇంటి స్థలాలు అందజేశారని తెలిపారు. శ్రమజీవులు సంక్షేమం కోసం అనేక చట్టపరమైన, పాలనాపరమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే జననేత అన్నారు. వారి ఆశయ సాధనలో ముందుకు సాగడమే మనం వారికి అందించే నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, బాపట్ల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు కన్నెగంటి చందర్రావు, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితునికి జైలుశిక్ష

## పోలీసు అధికారులను, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**బాపట్ల, జులై22,ప్రభాతవార్త:** భార్యని శారీరకంగా మానసికంగా హింసించి ఆమె ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించి, ఆమె మరణానికి కారణమైన ముద్దాయి అద్దంకి గంగాధరరావు కు 4 సంవత్సరాల జైలు శిక్ష, రూ.4,000/ నగదు జరిమానా విధిస్తు మంగళవారం రేపల్లె అసిస్టెంట్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీ ఎస్.పి.డి.వెన్నెల గారు తీర్పు వెలువరించారు. కేసు వివరాలలోకి వెళితే కృష్ణ జిల్లా చల్లపల్లి మండలము మంగళాపురం గ్రామానికి చెందిన జంపాని వెంకటేశ్వర రావు కుమార్తె లక్ష్మీ రేఖను చెరుకుపల్లి మండలం కనగాల గ్రామానికి చెందిన అద్దంకి గంగాధరరావుకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక అమ్మాయి సంతానం గంగాధరరావు అతని తల్లి దండ్రులు కుటుంబ సభ్యులు అధిక కట్నం కోసం లక్ష్మీ రేఖను తరచు శారీరకంగా మానసికంగా వేదిస్తూ, చచ్చిపోమని పదేపదే సూటి పోటి మాటలతో ఆమె ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపిస్తూ ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె 2018 జూన్ 22 న ఉదయం 8 గంటలకు ఉరివేసుకొని మరణించింది. మృతురాలు తండ్రి జంపాని వెంకటేశ్వర రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి చెరుకుపల్లి ఎస్.ఐ రాజేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వేగవంతంగా దర్యాప్తు నిర్వహించి తగిన సాక్ష్యాధారాలతో ముద్దాయిలు నేరం చేసినట్టు నిర్ధారించి అరెస్ట్ చేసినారు. సంబంధిత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. రేపల్లె అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ జడ్జి కోర్టులో కేసు విచారణ ప్రారంభం అయినప్పటి నుండి జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు చెరుకుపల్లి ఎస్.ఐ అనిల్ కుమార్ సాక్షులను సరైన రీతిలో దైర్యంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇవ్వడంతో కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ మధు, నాగమల్లేశ్వర రావు లు వారిని కోర్టులో హాజరుపరచగా కోర్టు పిపి శ్రీనివాసమూర్తి సరైన రీతిలో వాదించి ముద్దాయి పై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించారు.ఈ మేరకు రేపల్లె అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ న్యాయమూర్తి శ్రీ ఎస్.పి.డి.వెన్నెల గారు అద్దంకి గంగాధరరావు కు 4 సంవత్సరాల జైలు శిక్ష, రూ.4000/ నగదు జరిమానా విధిస్తు తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్షపడే విధంగా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, కోర్టు విధులు నిర్వహించే సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజలు మెచ్చిన ప్రభుత్వం తెదేపా : తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, జులై 22 (ప్రభాతవార్త) :** ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వమని, అందుకే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.76,72,179విలువైన చెక్కులను ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. కనీసం సీఎం రిలీఫ్ ఫండ్ కూడా అందించకుండా పేద జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో వైద్య రంగానికి పెద్దపీట వేశారని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు.ఈ ఎమ్మెల్యే నసీర్‌ను సంప్రదించిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడికి, ఎమ్మెల్యే నసీర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, వేమూరి జ్యోతి, గళ్ళ ప్రభాకర్, చల్లా ఆంజనేయప్రసాదు, మహమ్మద్ హఫీజ్, జమీర్, ఉస్మాన్, బ్రహ్మసాని శ్రీనివాసరావు, జబి, రియాజ్, అల్లం బాజీ రబ్బాని, ఖుదూస్, ఎస్ఎస్‌పి జాదా, రాధాశెట్టి జగన్, సలీం, జాద సురేష్, కంటే దిలీప్, సుఫియా, కలాం, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులపై ఎన్డీఆర్ఎఫ్ అవగాహన సదస్సు

**పెదనందిపాడు జులై 22 (ప్రభాతవార్త) :** ప్రకృతి విపత్తుల సమయంలో ఆకస్మిక ప్రమాదాలు ఎదురైతే వాటి నివారణ గురించి ఎన్ డి ఆర్ ఎఫ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దీపక్ కుమార్ ఆధ్వర్యంలో. పెదనందిపాడు లోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా సహకారంతో ఎన్ డి ఆర్ ఎఫ్ విజయవాడ పదో బెటాలియన్ వారు విపత్తుల సమయంలో ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.వరదల్లో చిక్కుకున్న ప్రజలు, రోడ్డు ప్రమాదం. వాతావరణ వ్యతిరేక పరిస్థితుల్లో. ఏదైనా జరిగితే తులత ప్రయత్నంగా ఎవరికి వారుఎలా కాపాడుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఏ చంద్రశేఖర్, వి శ్రీనివాసరావు , ఆర్ఐ అబీద్ ఆలీ.సీనియర్ అసిస్టెంట్ సాహితీ మోహన్, ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బగలాముఖి అమ్మవారిని దర్శించుకున్న

# తెలంగాణ సిద్దిపేట సిటీ పోలీసె కమిషనర్ దంపతులు

**పిట్లవానిపాలెం, జూలై22,ప్రభాతవార్త:** బగళాముఖి అమ్మవారిని తెలంగాణ సిద్దిపేట పూర్ణకుంభంతో వేద స్వస్తితో స్వాగతం పలికి శ్రీ అమ్మవారికి విశేష పూజలు



సిటీ పోలీస్ కమిషనర్ దంపతులు దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపట్ల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పిట్లవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసిన శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానమును తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సిటీ పోలీస్ కమిషనర్ శ్రీమతి అనురాధ శ్రవణ్ కుమార్ రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో జరిపించి, మంగళవారం నాడు జరిగిన హరిద్ర శృంగార్చన హోమ కార్యక్రమములో పాల్గొని పూర్ణాహుతి ద్రవ్యములను సమర్పణ చేశారు. వారికి వేద ఆశీర్వచనం జరిపించి, అమ్మవారి ప్రసాదమును శాలు, చిత్రపటం ఈవో అందజేశారు. ఈ సందర్భంగా సిపి అనురాధ దంపతులు ఆలయ విశేషములు తెలుసుకున్నారు.వీరితోపాటు సిఐడిఎస్ ఎల్ ఈశ్వరరావు, ఆలయ ఈవో ఘంటసాల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విస్తారంగా పడుతున్న వర్షాలు..

# ముమ్మరంగా సాగుతున్న పొలం పనులు

**యడ్లపాడు, జులై 22, ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి అడపాదడపా పడుతున్న వర్షాలు కాస్తా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా పడుతున్నాయి. ఇప్పటికే పూర్తిస్థాయిలో భూములు సిద్ధంచేసుకున్న రైతులు పొలం పనులను ముమ్మరంగా నిర్వహించుతున్నారు. ప్రత్తి విత్తనాలు నాటే కార్యక్రమం చివరిదశకు చేరుకుందని, ముందుగా వేసిన వారు పడిమొక్కలు నాటుతున్నామంటున్నారు. వీరితోపాటు మిరప సాగుచేసే రైతులు విత్తనాల ఎదపెట్టే కార్యక్రమం నిర్వహించుతున్నారు. ఉదయం పూట కొద్దిపాటి తెరపివ్వటం సాయంత్రానికి ఏదోసమయంలో వర్షం పడటంతో వేసిన విత్తనాలు దోకాలేకుండా మొలకెత్తుతున్నాయని, పడివిత్తనాల సంఖ్య గణనీయంగా తగ్గిందని అంటున్నారు. ఏది ఏమైనా ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగానే సాగుతుందని రైతులు తెలుపుతున్నారు. కాకపోతే సమయం దాటిపోతుందని, సకాలంలో వర్షం పడి ఉంటే ఇప్పటికే మొక్కలు ఏపుగా పెరిగి ఉండేవని అంటున్నారు.

# లలితా హాస్పిటల్‌లో వరల్డ్ బ్రెయిన్ డే పై అవగాహన


**గుంటూరు తూర్పు, జులై 22 (ప్రభాతవార్త) :** మెదడు, నరాల జబ్బుల గురించి అవగాహన కల్పించేందుకు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజి వారి ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ బ్రెయిన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ




మెదడు సంబంధిత వ్యాధులు పుట్టిన నాటి నుండి వృద్ధాప్య దశ వరకు ఎవరినైనా ప్రభావితం చేయగలవన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంగవైకల్యం కలిగించే ప్రధాన కారణాలు, మరియు రెండవ అత్యధిక మరణాల కారకాలు అని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 100కోట్లకు పైగా మంది నాడీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. విభిన్న వయస్సులలో మెదడు సంబంధిత వ్యాధులను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇందులో గర్భధారణకు ముందు ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం, పిల్లలకు టీకాలు వేయించడం, యువతకు రోడ్డు ప్రమాదాల నివారణ మరియు చెడువ్యసనాల ట్ల అప్రమత్తత మధ్య వయస్సు మరియు పెద్ద వయస్సు వారిలో హెల్త్ చెకప్‌లు, రిస్క్ ఫ్యాక్టర్లు కంట్రోల్ వృద్ధులు అకస్మాత్తుగా పడిపోవడం నివారించటం మరియు సామాజిక పరస్పర చర్యలు ముఖ్యమైనవి వివరించారు. ఆరోగ్యకరమైన మెదుడు కోసం పాటించవలసిన జీవితశైలి అలవాట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పి.విజయ్, ఎన్.శ్రీనివాసరావు, యు.వీరమ్మ, రేష్మా, ఉషాకిరణ్, అజా, సృజనా, అజయ్, ఎన్.శ్రీనివాసరెడ్డి, రత్నాకర్, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

# శ్రామిక నగర్ సమస్యలు పరిష్కరించండి : అరుణ

**గుంటూరు తూర్పు, జులై 22 (ప్రభాతవార్త) :** పాత గుంటూరు శ్రామికనగర్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు లక్కా అరుణ డిమాండ్ చేశారు. నగరంలో కురిసిన వర్షాలతో నిలిచిన నీటి సమస్యను స్థానికులు సీపీఎం నాయకులు దృష్టికి తీసుకురాగా మంగళవారం శ్రామిక



నగర్లో సీపీఎం నాయకులు సందర్శించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, కలుషిత తాగునీరు కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరారు.

# తాత్కాలిక రెక్టార్, రిజిస్ట్రార్‌లకు

# అభినందనలు తెలిపిన తాత్కాలిక వీసి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై22, ప్రభాతవార్త:** తాత్కాలిక రెక్టార్‌గా ఆచార్య కె.రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సింహాచలంలు బాధ్యతలు చేపట్టి ఏడాదికాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగాధరరావు శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటూ తనకు పూర్తి మద్దతు ఇచ్చి పాలనకు తోడ్పాటునందించినందుకు అభినందించారు. విశ్వవిద్యాలయంకు విస్తృత స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా అందరం కృషి చేయాలని సూచించారు. అనంతరం కేక్‌కట్‌చేసి ఇరువురిని సత్కరించారు. ఈ సందర్భంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య యం.త్రిమూర్తిరావు, సిడిసి తాత్కాలిక డీన్ ఆచార్య రవికుమార్, ఏసిఇ వెంకటేశ్వర్లు, వికాస నాయకులు వై.రాధాకృష్ణ, నేలపాటి నాగేశ్వరరావు, కె.యేషయ్య, లావు రాంబాబు, పి.నాగరాజు, శశిధర్, నూతక్కి వెంకటేశ్వర్లు, శ్రీను, టైంస్కేల్ యూనియన్ అధ్యక్షుడు జేమ్స్, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, దినసరి ఉద్యోగుల సంఘం కార్యదర్శి నీలకంతేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి. రత్తయ్య, రమేష్‌బాబు, శాంతిశ్రీ, వెంకటకృష్ణ, ఒప్పంద ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుధీర్, గౌరవ అధ్యక్షుడు కోడూరు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# నవ చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, జులై 22 (ప్రభాతవార్త):** మాచర్ల పట్టణ సమీపంలోని కొత్తపల్లి జంక్షన్ వద్ద గల ఎంఎస్ఆర్ టౌన్‌షిప్‌లో టౌన్‌షిప్ అధినేత మద్దిగపు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాగతం పలికారు. అనంతరం యాగశాలలో కొలువుదీరిన అమ్మవారికి ఎమ్మెల్యే జూలకంటి, కోళారాణిలు ఘనంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేదపండితులు



శ్రీనవ చండీయాగ మహోత్సవం వేడుకంగా ముగిసింది. ఈ యాగ క్రతువులో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, సతీమణి కోళారాణి సమేతంగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులను టౌన్‌షిప్ యాజమాన్యం పూర్ణకుంభంతో వేదమంత్రోచ్ఛరణ నడుమ పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెదెపా సీనియర్ నాయకులు మద్దిగపు వెంకట్రామి రెడ్డి, పంగులూరి పుల్లయ్య, యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, మాచర్ల పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

**మాచర్ల, జులై 22 (ప్రభాతవార్త):** మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధిపై అధికారులతో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమావేశం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలో నూతనంగా



ఏర్పాటు చేయబోతున్న జోన్స్‌లో తగు మార్పులు, చేర్పులను సూచించారు. తక్షణమే ఫైనల్ మాస్టర్ టౌన్ ప్లానింగ్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# మాచర్లలో తాళం వేసిన ఇంట్లో చోరీ

**మాచర్ల, జులై 22 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీ సుద్దగుంతలలో



తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగిన ఘటన

ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు బచ్చు వేణుగోపాలరావు వివరాల ప్రకారం ఈ నెల 16న ఇంటికి తాళం వేసి గురజాల వెళ్లామన్నారు. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి రూ.30 వేల నగదు, 15 జతల వెండి పట్టీలు దొంగిలించారన్నారు. పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ ప్రభాకరరావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థికసాయం

**మాచర్ల, జులై 22 ప్రభాతవార్త:** ఫోర్త్ స్టేజ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి కంభంపాటి చంటి అండ్ ఫ్రెండ్స్ సర్కిల్‌వారు బాసటగా నిలిచారు. వివరాల్లోకి వెళితే దాచేపల్లికి చెందిన నాళం అమరనాథ్ కుమార్తె నాళం కీర్తి గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతుంది. కడు పేదరికంతో వైద్య ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామరని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సందేశం ద్వారా తెలుసుకుని, చిన్నారి ప్రాణాలు కాపాడేందుకు దాతలు ముందుకు వచ్చారు. రూ.లక్షా 50 వేలు విరాళాలు సేకరించి ఎమ్మెల్యే తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి, యువనాయకుడు అక్కిరెడ్డిల చేతుల మీదుగా నాళం అమరనాథ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా చంటి అండ్ ఫ్రెండ్స్ బృందాన్ని గౌతమ్‌రెడ్డి కొనియాడారు. పాప వైద్యఖర్చుల కోసం తనవంతు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. వైద్యఖర్చుల కోసం దాతలు ముందుకు వచ్చి చిన్నారి ప్రాణాలు కాపడాలని చంటి కోరారు. ఆర్థికసాయం చేయదలచినవారు నాళం అమరనాథ్ ఫోన్ నంబర్లు 8143617323, 9611080311 లో సంప్రదించాలన్నారు.

# కార్యకర్తలకు కొండంత అండగా కాసు

## వైకాపా రాష్ట్ర కార్యదర్శి మురళీధరరెడ్డి

**గురజాల, జూలై 22 ప్రభాతవార్తః** కార్యకర్తలకు అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధరరెడ్డి అన్నారు. టివి 5 డిబెట్లో మహేష్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలకు ఆయన స్పందించి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మహేష్‌రెడ్డి ఓటమి పాలైన తరువాత కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులు, కార్యకర్తలపై, సోషల్ మీడియా నేతలపై అనేక కేసులు బనాయిస్తుంటే మహేష్‌రెడ్డి వారికి అండగా నిలిచారన్నారు. గురజాల నియోజకవర్గంలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తూ పిడుగురాళ్ల - జానపాడు ఓవర్ బ్రిడ్జి పనులను ప్రారంభించిన ఘనత మహేష్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండాలని వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కళాశాల, హాస్పిటల్ మంజూరు చేయించి 80 శాతం పనులు పూర్తి చేయించారన్నారు. మహేష్‌రెడ్డి సెల్ఫీ వీడియో, గురజాల నియోజకవర్గ నేత సెల్ఫీ వీడియోలతో స్పందించిన యరపతినేని శ్రీనివాసరావు మెడికల్ కళాశాల, హాస్పిటల్ సందర్శించి యేడాదిలో పూర్తి చేస్తామని హామీ ఇవ్వలేదా అని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతుంటూ ఈ విషయాలను పట్టించుకోకుండా టీవీ లైవ్‌షో కార్యక్రమంలో మా నేతపై విమర్శలు చేయడం తగదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ప్రజలను పట్టించుకోకుండా మా నేతపై బురద జల్లడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదే ఓపెన్ సీక్రెట్ కార్యక్రమంలో భాగంగా మా నేత మమ్మల్ని ఏదో ప్రలోభాలు పెట్టి అబద్ధాలు చెబుతున్నాడని ఇంకా పునర్విభజన, కులగణన మొదలే కాలేదని, మమ్మల్ని వాడుకొని టిక్కెట్లు ఇప్పిస్తామని డిబెట్లో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మురళీధరరెడ్డి అన్నారు.

# ఇంజనీరింగ్‌లో ముగిసిన ఇంటర్వ్యూలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై22, ప్రభాతవార్త:** వర్సిటీలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి సంబందించి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సిఎస్ఇ, ఏఐ అండ్ యంఎల్, డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో పోస్టుల భర్తీ చేయనున్నారు. ఈ ఇంటర్వ్యూలకు 8మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూలకు వచ్చిన వారి సర్టిఫికెట్‌ల పరిశీలన చేశారు.

**రెండు ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్**

వర్సిటీలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో రెండు ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక ఏడాది కాలానికి, నిర్ణయించిన వేతనాలకు పనిచేయాల్సి ఉంటుంది. ఈనెల 31వ తేదీలోగా రూ.2000 చెల్లించి దరకాస్తు చేసుకోవాలని వర్సిటీ నోటిఫికేషన్‌లో పేర్కొంది. కాగా ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఆచార్య సిద్దయ్యలు రాజీనామాతో ఈ రెండు పోస్టుల భర్తీ అనివార్యమైనట్లు సమాచారం.

# పశ్చిమ ఎమ్మెల్యే మాధవి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

**గుంటూరు క్రైమ్,జూలై 22,ప్రభాతవార్త :** రాష్ట్రయువత భవిష్యత్తు కోసం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషి చేస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.స్థానిక బ్రాడీపేట మాస్టర్‌మైండ్స్ క్యాంపస్‌లోని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో




ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహించారు.సాయంత్రం వరకు జరిగిన ఇంటర్వ్యూల్లో 378మంది ఎంపికయ్యారు.వారందరికీ ఎమ్మెల్యే ఆఫర్ లెటర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి,స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజయ్,మేయర్ కోవెలమూడి రవీంద్ర,మాస్టర్‌మైండ్స్ మోహన్ క కృష్ణ సహకారంతో మెగా జాబ్ మేళాను ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు.వచ్చిన యువతకు వారి అర్హతను బట్టి రూ.10,000 నుంచి రూ.40,000ల వరకు జీతాలు చెల్లించడానికి వచ్చిన కంపెనీలు సిద్దంగా ఉన్నాయన్నారు.ఈ జాబ్ మేళాలో ఎంపికవ్వని అభ్యర్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నైపుణ్యాలు పెంచి వారిని ఒక ఉద్యోగిగా లేక వ్యాపారస్తుడిగా మార్చాలని సీఎం చంద్రబాబు నాయుడు కృత నిశ్చియంతో పనిచేస్తున్నారన్నారు.మొత్తంగా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలనే సంకల్పంతో పనిచేసు ్తన్నామని ఈ మెగా జాబ్ మేళా విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు చంద్రముని, విజయ్‌లక్ష్మి, దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

# అప్రజాస్వామిక విధానాలు తగదు

**గుంటూరు విద్య,జూలై 22,ప్రభాతవార్త :** గత ఆదివారం దేశీయ విశ్వబ్రాహ్మణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభతో పాటు కొంతమంది వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి కార్యవర్గాన్ని ప్రకటించుకోవడం చట్ట వ్యతిరేకమని అప్రజాస్వామిక మని శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షులు కందుకూరి లక్ష్మీనారాయణ విమర్శించారు. స్థానిక అరండల్‌పేట సమాజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షత వహించిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమను వ్యతిరేకించేవారు మహాజన సభ పెట్టుకోవాలంటే కనీసం నెలరోజుల ముందు నోటిసు ఇవ్వాలన్న ఆలోచన రాకపోవడం న్యాయ సమ్మతం కాదన్నారు. 1964నుంచి మహాజన సభ ద్వారా కేవలం గుంటూరు,మరియు పరిసర ప్రాంత సంఘీయులతోనే కార్యవర్గం ఏర్పడాలన్నది చట్టం చెబుతుందన్నారు. 2001లో 13వ మహాజన తీర్మానాల అనుసరించి 206మంది స్థానికులతోనే ఓటుహక్కు వినియోగించు కొని కార్యవర్గం ఏర్పడిందని గుర్తు చేశారు.2014 సవరణ బైలా, మినిట్స్ అప్పటి ఉపాధ్యక్షులు జంపని రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన కూడా గుంటూరు నగర స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల సంఘీయులతోనే కార్యవర్గం ఏర్పడాలని తీర్మానించారని చెప్పారు. .సమావేశంలో ఉపాధ్యక్షులు పూసపాటి శేషగిరిరావు, సహాయ కార్యదర్శి వంగపురపు వీరబ్రహ్మాచారి, సభ్యులు మచ్చ శివాజీ,వేల్పూరి శివరామకృష్ణ, సున్నం మల్లికార్జునరావు,సున్నం శ్రీనివాస్,నల్లపాటి బ్రహ్మం,దాసు రామకృష్ణ ్ణచారి,వంగల వీరబ్రహ్మ చారి ,నిమ్మగడ్డ సుబ్బారావు,సిద్ధు సాంబశివరావు, కూరపాటి కామాక్షి శర్మ,సిద్దు శ్రీకాంత్,కోట మురళీ,పొన్నపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు చంద్రబాబు మోసాన్ని గ్రహించారు : డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, జూలై 22 ప్రభాతవార్త : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆశపడి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసినందుకు బాధపడుతున్నారని, ఏ పథకం రాక ఎవరో ఒకరిద్దరికి వచ్చినా అరకొరగా ఉండటంతో చంద్రబాబు మోసాన్ని గుర్తించారని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. అందుకే మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన రెడ్డి ఎక్కడికి వెళ్ళినా లక్షలాది మంది వస్తున్నారని తెలిపారు. మంగళవారం మండలంలోని కోటప్పకొండలో బాబు షూ్యరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలతో పాటు రాజధాని రైతులను చంద్రబాబు నిలువున ముంచారన్నారు. 34 వేల ఎకరాలను తీసుకొని రైతులకు ప్లాట్లు ఇవ్వలేదన్నారు. ఒక్క రోడ్డు, ఒక్క లైటు లేదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వేల ఎకరాలు చెరువులను తలపిస్తున్నాయన్నారు. మరో మోసానికి తెర తీస్తూ 44 వేల ఎకరాలు బలవంతంగా తీసుకునే కుట్ర జరుగుతుందన్నారు. ఏడాదికే ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను స్వయంగా టిడిపి వారే



బహిరంగంగా చెప్తున్నారని తెలిపారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నియోజకవర్గంలోని కేసానుపల్లి, రావిపాడు, పమిడిమర్రు వంటి గ్రామాలలో అమలు చేస్తూ ఇళ్ళపై దాడులు చేశారని, ఊళ్ళల్లో లేకుండా వైకాపా వారిని తరిమికొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బదులు తీర్చుకుంటామన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులను లేకుండా చేశారని విమర్శించారు. కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం చేసే మోసాలను, కుట్రలను ప్రజల వద్దకు వెళ్ళి వివరించాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ సహకారంతో 30 మంది మహిళలకు

# ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

**మంగళగిరి, జులై 22, ప్రభాతవార్త :** మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు మంగళవారం



ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 70వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. మంత్రి నారా లోకేష్‌కు లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి సాధించడం ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలబడతాయన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ స్త్రీ శక్తిని నెలకొల్పి ఉచితంగా మహిళకు కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, నియోజకవర్గం తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపుడి వైష్ణవి, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, మంగళగిరి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు లావణ్య, మంగళగిరి మార్కెట్ కమిటీ సభ్యులు భైరబోయిన పద్మ, నైనాల లావణ్య, నక్కా రాజేశ్వరి, అంగన్వాడి కమిటీ కార్యదర్శి గడ్డిపాటి తులసి, విజయలక్ష్మి, ట్రైనర్ లక్ష్మి పాల్గొన్నారు.

# బాబూ మోసాలను వాడవాడలా చాటి చెప్పాలి : వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, జూలై 22,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయలేదని, బాబూ మోసాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని మాచవరం, ములుకుదురు గ్రామాల్లో, పట్టణంలోని 22,23వార్డుల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ గ్రామంలోనూ, వార్డులోనూ ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు సంబంధించి వివరించారు. చంద్రబాబు పాలన అంతా అవినీతి మయమన్నారు. చంద్రబాబునాయుడు మొదటి నుంచి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఈ ప్రభుత్వానికి ఇక పాలించే అర్హత లేదన్నారు. ప్రజలు కూడా బాబు మోసాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో....గుర్తుకు తేవడమేనన్నారు. జగన్ అంటేనే సంక్షేమం, అభివృద్ధి, నమ్మకమని చెప్పారు. జగన్ కంటే ఎక్కువగా ఇచ్చిన హామీలను అమలు చేస్తారని నమ్మిన ప్రజానీకానికి సంవత్సర కాలంలోనే బాబు మారలేదనిపించుకున్నారన్నారు. చంద్రబాబు మోసాలకు బలియైన ప్రతి ఒక్కరూ రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి భవనం పద్మలీల, ఆకుల వెంకటేశ్వరరావు, ఎండేటి వెంకట సుబ్బయ్య, షేక్ నాజర్, షేక్ మాము, నల్లమోతు రవీంద్రబాబు, మరియరాణి, చింతలపూడి మురళీకృష్ణ, లంకపోతు పిచ్చిరెడ్డి, అంబటి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

23-7Pg5.qxd:23-7Pg5.qxd 01/01/01 8:39 AM Page 1




# ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు

## గందరగోళంతో సభ నేటికి వాయిదా!

## ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్ ఓటర్ల జాబితాల సవరణపై చర్చకు పట్టుపట్టిన విపక్షాలు

### విపక్షాల వాయిదా నోటీసులను తిరస్కరించిన హరివంశ్



**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేయడంతో మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనలు చేయడంతో, దిగువ సభ కార్యకలాపాలను తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయితే తిరిగి సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో, స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష పార్టీల ఆందోళనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడ్డాయి. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి ఆకస్మిక రాజీనామా చేయడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన మధ్య ఎగువ సభ ఉదయం కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తరువాత కూడా నిరసనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ అంశాలపై చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను హరివంశ్ తిరస్కరించారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. అయితేఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. తొలిరోజున ప్రతిపక్షాలు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేయడంతో ఉభయసభలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తొలిరోజు నిరసనల మధ్యనే రాజ్యసభ షిప్పింగ్ డాక్యుమెంటేషన్ చట్టాలను ఆధునీకరించే లాడింగ్ బిల్లును విజయవంతంగా ఆమోదించింది. ఈ బిల్లు లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందింది. సమావేశాల మొదటి రోజున హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌సిన్హాపై మోపిన అభిశంసనపై రాజ్యసభలో ప్రసంగించిన అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. జులై 21న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఆగస్టు 12 నుండి ఆగస్టు 17 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విరామం ఉంటుంది. ఆగస్టు 18న తిరిగి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

ఇదిలా ఉండగా తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై మోపిన అభిశంసన తీర్మానంపై ఐయుఎంఎల్ ఎంపిఇటి మహ్మద్ బషీర్ మాట్లాడుతూ, ఈ అభిశంసన చాలా ముఖ్యమైనది. ఆ న్యాయమూర్తి వ్యవహారాల కారణంగా భారత న్యాయ వ్యవస్థ స్థితి మరింత దిగజారింది. అందుకే తాము దీనిపై మెమోరాండంను స్పీకర్‌కు సమర్పించామన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందిస్తుందని ఆశిస్తున్నామని బషీర్ పేర్కొన్నారు.



# గాజాలో యుద్ధం ఆగాల్సిందే

## 25 దేశాల సంయుక్త ప్రకటన

### 59 వేలు దాటిన పాలస్తీనియన్ల మరణాలు

**లండన్, జూలై 22 :** గాజాలో యుద్ధం ఆగితీరాలని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ గౌరవించాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్‌లతో సహా మొత్తం 25 దేశాలు సోమవారం ఒక సంయుక్త ప్రకటన వెలువరించాయి. కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. చాలీచాలని సాయం అందించడమే కాక, కనీస అవసరాలైన ఆహారం, నీళ్ల కోసం వేచి వున్న అమాయక ప్రజలను, మహిళలు, పిల్లలను విచక్షణారహితంగా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 'ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుసరిస్తున్న సహాయ పంపిణీ విధానం అత్యంత ప్రమాదకరం. ఇది అస్థిరతను పెంపొందించడంతోపాటు గాజా వాసుల కనీస మానవ గౌరవాన్ని హరిస్తోంది' అని సంయుక్త ప్రకటన తెలియజేసింది. గాజాలోని అన్నార్తుల పట్ల ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వైఖరిని ఐరాస తీవ్రంగా ఖండించింది. ఆహార కేంద్రాల వద్ద వచ్చే వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కాల్పులు జరుపుతోందంటూ మండిపడింది.

ఆదివారం ఒక్కరోజే 80 మంది ఉసురు తీయడాన్ని ప్రస్తావించిన ఐరాస ఆహార విభాగం (డబ్ల్యుఎఫ్‌పి).. పాలస్తీనియన్ల పాలిట భయంకరమైన రోజుల్లో ఒకటని అభివర్ణించింది.

సెంట్రల్ గాజాలోని నెట్‌జరిమ్ కారిడార్ వద్ద గుంపుగాచేరిన పాలస్తీనియన్లపైజరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. హమాస్‌శ్రేణులు లక్ష్యంగా 21 నెలలుగా యథేచ్ఛగా ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల్లో మరణాలు 59 వేలు దాటాయని గాజా ఆరోగ్య విభాగం సోమవారం తెలిపింది. 2023 అక్టోబరు 7 నుంచి సాగిస్తున్న దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 1,42,135కు చేరుకుందని వివరించింది.



## భారత్-పాక్ సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ 'డ్రోన్ స్క్వాడ్రన్'

**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పిఒకెతోపాటు పాక్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అటునుంచి దాయాది దేశం కూడా మనపై డ్రోన్లతో దాడులకు యత్నించింది. దీంతో భారత బలగాలు అప్రమత్తమయ్యాయి. భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా భారత్-పాక్ సరిహద్దులో గస్తీ పెంచడంతోపాటు 'డ్రోన్ స్క్వాడ్రన్'లను ముమ్మరంగా మోహరించే పనిలో నిమగ్నమయ్యాయి. సరిహద్దులో నిర్దిష్ట ఔట్ పోస్టుల్లో ఉండే డ్రోన్ దళాల్లో నిఘాకు సంబంధించి అనేక వ్యవస్థలు ఉంటాయి. ఈ స్క్వాడ్రన్‌లో నిఘాతోపాటు మానవరహిత విమానాలు లేదా డ్రోన్లు ఉంటాయి. ఈ పరికరాలను ఆపరేట్ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తిస్తారు. చండీగఢ్‌లోని బిఎస్ఎఫ్ వెస్టర్న్ కమాండ్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఈ బృందాలకు దిశానిర్దేశం చేస్తుంది. రక్షణ పరిశోధన, నిఘా సంస్థలతో ఈబృందాలు కీలకవివరాలను పంచుకుంటాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితులు తలెత్తి నప్పుడు శత్రు డ్రోన్లపై దీటుగా విరుచుకు పడతాయి.

# గడ్చిరోలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



**గడ్చిరౌలి, జూలై 22:** విదేశీ నిధులతో గడ్చిరౌలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేస్తున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. లాయిడ్స్ అండ్ ఎనర్జీ లిమిడెట్ సంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్చిరౌలి జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. గడ్చిరౌలిలో నక్సలిజం తగ్గుతోందని, ప్రస్తుతం కొంతమంది నక్సలైట్లు మాత్రమే ఉన్నారని, వాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు అని, ఇక్కడి అడువుల్లో వాళ్లు ఉన్నారని ఆయన అన్నారు. హింసను వీడాలని నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తెలిపారు. ప్రధాన జీవనస్రవంతిలో కలవాలని కోరుతున్నట్లు తెలిపారు. అయితే తుపాకీ పట్టుకుని తిరిగే నక్సలైట్లు తగ్గుతున్న దశలో.. అర్బన్ నక్సల్స్ సంఖ్య పెరుగుతోందని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అర్బన్ నక్సల్స్ పట్ల అలర్ట్‌గా ఉండాలని, వాళ్ల తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారని, గడ్చిరౌలిలో స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేయగా, మరుసటి రోజే సోషల్ మీడియాలో దుష్ప్రచారం మొదలుపెట్టారని, గిరిజనులను చంపుతున్నారని ప్రచారం చేస్తున్నట్లు సిఎం ఆరోపించారు. భారీ స్థాయిలో అడవుల్ని నరికివేస్తున్నట్లు ప్రచారంచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తుంటే.. ఎలా వ్యతిరేక ప్రచారం చేపడుతున్నారని ఆయన అడిగారు. మహారాష్ట్రకు సంబంధం లేని వ్యక్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, ఇద్దరు కోల్‌కతాలో ఉన్నారని, మరో ఇద్దరు బెంగళూరులో ఉన్నారని, వాళ్లు విదేశీ నిధులతో.. సోషల్ మీడియా పోస్టులతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అబద్ధాలు చెబుతూ అర్బన్ నక్సల్స్ గడ్చిరౌలిని అభివృద్ధికి దూరం చేస్తున్నారని ఆయన తెలిపారు.

# ఎట్టకేలకు కేరళను వీడిన బ్రిటన్ ఫైటర్ జెట్

**తిరువనంతపురం, జూలై 22:** సాంకేతిక సమస్యల కారణంగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో నెల రోజులుగా నిలిచిపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్-35 బి స్టెల్త్ యుద్ధ విమానం ఎట్టకేలకు టేకాఫ్ అయ్యింది. మంగళవారం ఉదయం కేరళను వీడింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బి 40 రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇండో-యుకె నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బి విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో దించేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరత కారణంగా విమానాన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆ ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య తలెత్తినట్లు ఆ తర్వాతే యుకె అధికారులు వెల్లడించారు.

ఈ ఫైటర్ జెట్‌కు ఇక్కడ మరమ్మతులు చేయడానికి వీలుకాకపోవడంతో బ్రిటన్ నుంచి నిపుణులను రప్పించారు. 24 మంది స్పెషల్ ఎక్స్‌పర్ట్స్ బృందం వచ్చి విమానానికి మరమ్మతులు చేపట్టింది. విమానంలోని లోపాలను సరిచేసింది. దీంతో విమానం ఎట్టకేలకు గాల్లోకి ఎగిరింది. దాదాపు ఐదు వారాల తర్వాత మంగళవారం ఉదయం కేరళ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయి బ్రిటన్‌కు బయల్దేరి వెళ్లింది.

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 9.74 లక్షల టన్నుల డిఎపి దిగుమతి

## ఎరువుల లభ్యతపై రాజ్యసభలో కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ ప్రకటన



**న్యూఢిల్లీ, జూలై 22:** దేశీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 9.74 లక్షల టన్నుల డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి)ని దిగుమతి చేసుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరానికి డిఎపి దిగుమతికి గణాంకాలను కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియపటేల్ రాజ్యసభలో వెల్లడించారు. దేశం ఏప్రిల్‌లో 2.89 లక్షల టన్నులు, మేలో 2.36 లక్షల టన్నులు, జూన్‌లో 4.49 టన్నులు దిగుమతి చేసుకుందని చెప్పారు.

2024-25 ఆర్థికసంవత్సరంలో 45.69 లక్షల టన్నులు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 55.67 లక్షల టన్నులు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 65.83 లక్షల టన్నులు, 2021-22 ఆర్థిక సంవత్సంలో 54.62 లక్షల టన్నులు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 48.82 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని వివరించారు. యూరియాను 2024-25లో 56.47 లక్షల టన్నులు, 2023-24లో 70.42 లక్షల టన్నులు, 2022-23లో 75.80 లక్షల టన్నులు, 2021-22లో 91.36 లక్షల టన్నులు, 2020-21లో 98.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్లు వివరించింది. ఖరీఫ్ నేపథ్యంలో రైతుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన ఎరువులు ఉన్నాయని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల అవసరం గతేడాది కంటే ఎక్కువగా ఉందన్నారు. రుతుపవనాలతోపాటు సాగు విస్తీర్ణం పెరిగింది. ఏప్రిల్ 2010 నుంచి కేంద్రం ఫాస్ఫేటిక్, ఫొటాసిక్ (పిఅండ్‌కె) ఎరువుల కోసం పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) విధానాన్ని అమలుచేసింది.

ఎరువుల డిమాండ్, ఉత్పత్తి మధ్య అంతరాన్ని దిగుమతుల ద్వారా తీరుస్తామని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ చెప్పారు. భౌగోళిక రాజకీయ కారణంగా సరఫరా గొలుసులో ఎదురైన అంతరాయాల ప్రభావాన్ని తగ్గించేందుకు.. ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాను చేసేలా డిఎపి ఉత్పత్తి చేసే దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన మహిళ

### ఇంట్లో గొయ్యితీసి పూడ్చేసి పరార్

**ముంబై, జూలై 22:** ప్రియుడి సాయంతో భర్తను చంపి, ఇంట్లోనే పూడ్చిపెట్టిన ఓ మహిళ .. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ప్రియుడితో పారిపోయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దారుణ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధనివ్‌బాగ్ ప్రాంతానికి చెందిన విజయ్ చౌహాన్ (34), చమన్ అలియాస్ గుడియాదేవి (32) పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే గుడియాదేవి తమ పొరుగునే ఉన్న మోనువిశ్వకర్మ (33)తో వివాహేతర సంబంధాన్ని ఏర్పరుచుకుంది. దీంతో వారిద్దరూ తమకు అడ్డుగా ఉన్న విజయ్ చౌహాన్‌ను చంపడానికి ప్రణాళిక వేసుకున్నారు. దాదాపు 15 రోజుల క్రితం వీరిద్దరూ విజయ్‌ను హత్యచేసి, అతని ఇంట్లోనే గొయ్యి తీసి పాతిపెట్టారు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా ఉండడానికి అక్కడ కొత్త టైల్స్‌తో కప్పి ఏమీ తెలియనట్లుగా ఉన్నారు.

అయితే ఈ కేసు ఎలా వెలుగులోని వచ్చిందంటే.. విజయ్ తోబుట్టువులు ఓ ఇల్లు కొనాలని అనుకుని డబ్బులకోసం వారు విజయ్‌కు ఫోన్ చేయగా, ఎన్నిసార్లు ఫోన్ చేసినా విజయ్ స్పందించలేదు. దీంతో వారు తమ సోదరుడి ఇంటికి వెళ్లి ఆరా తీయగా, తన భర్త పని కోసం కుర్లాకు వెళ్లాడని గుడియా చెప్పింది. దీనితో వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత విజయ్ తిరిగి ఇంటికి వచ్చాడో, లేదో తెలుసుకోవడానికి ఈ నెల 19న మళ్లీ గుడియాకు ఫోన్ చేశారు. కానీ ఆమె ఫోన్‌ను స్విచ్ ఆఫ్‌చేసి ఉంది. దీంతో విజయ్ సోదరులకు అనుమానం వచ్చి ఇంటికి వెళ్లిచూశారు. ఆమె కనిపించకపోవడంతో పెల్హార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విజయ్ ఇంటిని పరిశీలించగా, అక్కడ కొత్తగా వేసిన టైల్స్ కనిపించాయి. వాటిని తొలగించి చూడగా, దుర్వాసనవచ్చింది. దీనితో అక్కడ తవ్విచూడగా కుళ్లిపోయిన స్థితిలో విజయ్ మృతదేహం కనిపించింది. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముంబయిలోని జెజె ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

# ధన్‌ఖడ్ రాజ్యాంగ విలువలను కాపాడారు

## ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మీ పదవీ కాలంలో ఉప రాష్ట్రపతి పదవి గౌరవాన్ని అచంచలమైన నిబద్ధతతో నిలబెట్టారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ దయ, నిష్పాక్షికత, సమగ్రతతో భాధ్యతలు నిర్వహించారు. రాజకీయ ఒత్తిడి లేకుండా నిర్భయంగా మీ అభిప్రాయాలను వ్యక్తీకరించారు. గౌరవనీయమైన పాత్ర నుంచి వైదొలగుతున్న మీకు మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవనం ఉండాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ గత రాత్రి రాజీనామా చేశారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జెడియూ నేత హరివంశ్ నడిపించనున్నారు. 2022 ఆగస్టు 11న ఉపరాష్ట్రపతిగా భాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ళ 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. ధన్‌ఖడ్ ఆదర్శనీయ రాజకీయ వేత్తని పవన్ అన్నారు.

## హాకీ క్రీడాకారిణిపై సామూహిక అత్యాచారంకేసులో

# నలుగురు కోచ్‌ల అరెస్టు

### ఒడిశా 'సాయ్' సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ప్లేయర్

**భువనేశ్వర్, జూలై 22:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో 15 ఏళ్ల టీనేజ్ హాకీ క్రీడాకారిణిపై కోచ్‌లే సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన నివ్వెరపరుస్తోంది. ఈ కేసులో నలుగురు హాకీ కోచ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణం రూర్కెలాలోని సాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సెంటర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు గత రెండేళ్లుగా ఈ కేంద్రంలో శిక్షణ పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న సాయంత్రం స్థానిక స్టేడియంలో కోచింగ్ సెషన్ ముగిసిన తర్వాత నలుగురు కోచ్‌లు .. ఆ క్రీడాకారిణిని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ వారు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. భువనేశ్వర్ డిసిపి ప్రతీక్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకుని నలుగురు శిక్షకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ సెక్షన్లతోపాటు సామూహిక అత్యాచారం, పోక్సో చట్టం సెక్షన్ 6 కింద కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# సంక్షిప్తంగా..

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదరింపు




**గాంధీనగర్, జూలై 22:** దేశంలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా అహ్మదాబాద్ విమానాశ్రయానికి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు సోదాలు చేపట్టారు. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్‌కు మంగళవారం ఉదయం బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్ట్‌లో సోదాలు చేపట్టారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికిచేరుకుని బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అయితే ఇప్పటివరకు జరిపిన సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శరద్ సింఘాల్ తెలిపారు.

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం, ఐదుగురు మృతి

**జైపూర్, జూలై 22:** రాజస్థాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. బికనీర్ జిల్లాలోని సిఖ్వాల్ ప్రాంతంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అయిదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారి 11పై ఈ ఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు రెండు కార్లలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఖతుష్యం ఆలయ సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో కార్లు రెండూ నుజ్జునుజ్జు అయ్యాయి. కార్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు విద్యుత్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. కార్లలో ఉన్న మృతదేహాలను బయటకు తీసేందుకు దాదాపు గంట సమయం పట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు.

## భారత్‌కు అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు



**న్యూఢిల్లీ, జూలై 22:** భారత ఆర్మీ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు చేరుకున్నాయి. హిండన్ ఎయిర్‌బేస్‌లో తొలి విడితగా మూడు హెలికాప్టర్లు అమెరికా మిలిటరీ ట్రాన్స్‌పోర్టు ప్లేన్‌లో హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటిని పూర్తిస్థాయిలో అసెంబుల్ చేసి తనిఖీలు నిర్వహించాక సైన్యానికి చెందిన ఏవియేషన్ కోర్ విభాగానికి అందించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వీటిని జోధ్‌పూర్‌కు తరలిస్తారు. అపాచీ హెలికాప్టర్‌లు భారత్‌కు చేరుకోవడంపై సైన్యం హర్షం వ్యక్తంచేసింది. ఇదో ముఖ్యమైలు రాయి అని వ్యాఖ్యానించింది. భారత అమ్ములపొదిలో అత్యాధునిక హెలికాప్టర్ల చేరికతో కార్యనిర్వాహకసామర్థ్యాలు మరింతపెరిగాయని పేర్కొంది. అపాచీ హెలికాప్టర్‌లతోకూడిన ప్రత్యేక స్క్వాడ్రన్‌ను గతేడాది మార్చిలోనే జోధ్‌పూర్‌లో ఏర్పాటు చేశారు. అపాచీ ఎహెచ్-64ఇ అటాక్ హెలికాప్టర్ల కోసం 2020లో అమెరికాతో భారత ఆర్మీ 600 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది.

## బీహార్ ఓటర్ లిస్టు నుంచి 51 లక్షల పేర్లు తొలగింపు

**పాట్నా, జూలై 22:** బీహార్ ఎన్నికల జాబితా నుంచి 51 లక్షల పేర్లు తొలగించినట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ఓటర్లు మరణించడం, వలస వెళ్లడం ఇందుకు కారణాలుగా తెలిపింది. ముసాయితా ఎన్నికల జాబితాలో అర్హులైన ఓటర్లను చేరుస్తామని హామీ ఇచ్చింది. ఆగస్టు 1న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. 'బీహార్ ఎస్ఐఆర్ ఇంతవరకూ వెల్లడైన నిజాలు' అనే పేరుతో ఎన్నికల కమిషన్ ఇక నోట్ విడుదల చేసింది. ఇంతవరకూ నిర్వహించిన బీహార్ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో 18 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్లు తమ దృష్టికి రాగా, 26 లక్షల మంది వివిధ నియోజకవర్గాలకు మారిపోయారని, రెండుచోట్ల పేరు నమోదు చేసుకున్న వారు 7 లక్షల మంది ఉన్నారని వివరించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ బాధ్యతగా ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్నామని ఇసి తెలిపింది.

23-7Pg6exHMNWJQE.qxd:23-7Pg6exHMNWJQE.qxd 01/01/01 9:21 AM Page 1



# బోయకొండ గంగమ్మ ఆలయంలో పట్టుబడ్డ ఇంటి దొంగలు

## - పెద్దభోగం టిక్కెట్లలో చేతివాటం - ఆరుమందిపై వేటు

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 22 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలో వెలసిన శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఇంటి దొంగలు పట్టుబడ్డారు...నెలల తరబడి గుట్టుచప్పుడు కాకుండా టిక్కెట్ల విక్రయాల్లో చేతివాటం ప్రదర్శిస్తూ వేలాది రూపాయలు కొట్టేస్తున్న వైనాన్ని పసిగట్టి పట్టుకొన్నారు...ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై వేటు వేసారు...ఉన్నతాధికారులు కథనం మేరకు...శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదాయం పెంచే క్రమంలో కొన్ని సంస్కరణలు తీసుకొచ్చారు. కొండపై భక్తులు అమ్మవారికి సమర్పించే పెద్ధభోగం, చిన్నభోగం విషయంలో అమ్మవారికి చెందేలా రూ. 200ల టిక్కెట్టును ఏర్పాటు చేసారు. పెద్దభోగం, చిన్నభోగం చెల్లించే భక్తులు టిక్కెట్టును తీసుకోవాల్సి వుంది. అక్కడ ఆలయానికి చెందిన కొందరు టిక్కెట్టు పుస్తకాలను వారికి తగ్గట్టుగా మలచుకొన్నారు. ఆలయ అధికారులు ఏప్రిల్ నుంచి వందటిక్కెట్లుగల పుస్తకాన్ని అందించి సాయంత్రం సంబంధిత కలెక్షన్‌ను చెల్లించేవారు. ఈక్రమంలో టిక్కెట్టు పుస్తకంలోని ఓ భాగాన్ని భక్తులకందించి తర్వాత మిగిలిన సగంలో ఎవరైతే డ్యూటీలో వుంటారో వారి సంతకంతో కూడినదిగా వుంటుంది. ఇక్కడే ఇంటి దొంగలు తమ చేతికి పనిపెట్టారు. భక్తులకు ఇచ్చే టిక్కెట్టుతో పాటు పుస్తకంలో ఎవరూ గుర్తించరాదని అక్కడక్కడా తక్కిన టిక్కెట్టును ఇచ్చేసి భక్తులనుంచి ప్రతి టిక్కెట్టుకూ రూ. 200లు జేబులోకి వేసుకొన్నారు. ఏప్రిల్ నుంచి దాదాపు 55పుస్తకాలను విక్రయించారు. ఒక్కో పుస్తకానికి 100టిక్కెట్లుంటాయి. ఇప్పటి వరకు ఆయా టిక్కెట్ల నుంచి అక్కడక్కడా రూ. 47,200ల వరకు స్వాహా అయినట్లుగా అధికారులు గుర్తించారు. టిక్కెట్ల వ్యవహారంలో ఉన్నవారందరిపై ఎండోమెంట్ కమీషనర్ ఆదేశాల మేరకు వేటు వేసినట్లు ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. వారిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. టిక్కెట్ల వ్యవహారంలో ఎక్కడ ఎలా జరిగిందనే విషయంపై ఆరా తీస్తున్నట్లు వివరించారు. విక్రయాల్లో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగముని, సోమశేఖర్‌రాజు, మునిశేఖర్, గంగరాజు, హరిప్రసాద్, విజయ్‌కుమార్‌రెడ్డిలపై వేటు వేసి విచారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్

### - రైలునెంబర్లు, వేళల్లో మార్పులు
### - సెప్టెంబరు 29నుంచి వర్తింపు

**గుంతకల్లు రైల్వే, జూలై 22,ప్రభాతవార్త** సీమాంధ్ర మీదుగా సికింద్రాబాద్-తిరువనంతపుర-సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే శబరీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను సెప్టెంబరు 29నుంచి సూపర్‌ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రైలు నెంబర్లను సైతం మార్పులు చేసి నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తిరువనంతపురం- సికింద్రాబాద్-తిరువనంతపురం మధ్య తిరిగే నెంబర్ 17229/17230శబరీ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 29నుంచి 20630/20629గా నెంబర్లను కేటాయించారు. తిరువనంతపురం నుంచి సికి ంద్రాబాద్ వెళ్లే నెంబర్ 20630శబరీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 29నుంచి ప్రతిరోజు ఉదయం 6.45గంటలకు తిరువనంతపురం నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురం వెళ్లే నెంబర్ 20629శబరీ సూపర్ ఫాస్ట్ సెప్టెంబరు 29నుంచి మధ్యాహ్నం 2.25గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 6.20గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది. ఈ రైళ్ల మార్గమధ్యలో తెలుగు రాష్ట్రాల్లో చిత్తూరు, తిరుపతి,రేణిగుంట, గూడూరు, నెల్లూరు,సింగరాయకొండ, ఒంగోలు, చీరాల,బాపట్ల, నిడుబ్రోలు, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి,పిడుగురాళ్ల, నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ,చర్లపల్లి స్టేషన్లలో నిలుస్తాయి.

# ఆదాయపు పన్ను ఫైలింగ్‌పై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఎపి ట్రాన్స్‌కో

**విజయవాడ, జులై 22,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ టాక్స్) ఫైలింగ్ పై అవగాహన కల్పించడం ద్వారా సంస్థకు సమగ్ర ప్రయోజనం కలగడం తో పాటు , ఉద్యోగుల వ్యక్తిగత ఆర్థిక బాధ్యతల్లో స్పష్టత పెరుగుతుందని ఏపీ ట్రాన్స్కో డైరెక్టర్ (ఫైనాన్స్) ఎన్.వి. రమణ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో నిర్వహించిన ఈ అవగాహనా కార్యక్రమంలో ఉద్యోగులకు టాక్స్ ఫైలింగ్ ప్రాసెస్, కీలక సమాచారం, లాభాలు, తప్పక పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై జాయింట్ కమీషనర్ ఇన్కమ్ టాక్స్ అభినయ, ఇన్‌కమ్ టాక్స్ డిప్యూటీ కమిషనర్లు డాక్టర్ టీ. సవీష్ వర్మ ప్రేమ్ కుమార్, ఐఆర్ఎస్ సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్కో ఎఫ్ఏ సిసిఏ వీ.డి. సర్వేశ్వర రావు, ఎఫ్ఏ సిసిఏ కె.వి.ఎస్.ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు ఉద్యోగుల ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో సహాయపడతాయని, ముందుగానే పన్నుల ఫైలింగ్ పూర్తి చేయడం ద్వారా లెక్కల లోపాలు నివారించగలమని డైరెక్టర్ ఫైనాన్స్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డా. సవీష్ వర్మ ఏ పీ ట్రాన్స్కో కు సంబంధించి సెక్షన్ 192, 194ఏ, 194I, 194H, 194 వంటి ముఖ్యమైన టిడిఎస్ నిబంధనలు, 2025 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చిన తాజా మార్పులపై వివరించారు. టిడిఎస్ చెల్లింపు, రిటర్న్ ఫైలింగ్ మరియు సర్టిఫికెట్ల జారీ వాయిదా వేయడం వల్ల ఎదురయ్యే వడ్డీ, జరిమానా, శిక్షలపై ఉద్యోగులను అప్రమత్తం చేశారు. సాధారణంగా జరిగే తప్పిదాలు (సెక్షన్ కోడ్లు, చలాన్ వివరాల పొరపాట్లు) నివారించేందుకు చాలన్ చెక్‌లిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ టూల్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రేమ కుమార్ 2024-25కి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్ ఫైలింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఫైలింగ్ కేవలం చట్టబద్ధ విధినే కాకుండా, రిఫండ్‌లు పొందడం, ఆర్థిక పారదర్శకత కోసం అవసరమని చెప్పారు. ఆచా ఫారాల అనుసంధానం, పాత మరియు కొత్త పన్ను విధానాల మధ్య తేడాలు, సెక్షన్ 87 కింద రూ 75,000/ వరకు రీఫండ్, మరియు తప్పిద దావాలపై శాఖ చర్యలు వంటి అంశాలపై కూడా వివరంగా చర్చ జరిగింది. ఏపీ ట్రాన్స్కో డిప్యూటీ సిసిఏ బీ. నాగరాజు, డిప్యూటీ సిసిఏ పీ.బీ.కె. శర్మ, విద్యుత్ సౌధలో పనిచేస్తున్న సిబ్బంది తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం మద్యం అమ్మకాలలో డిజిటల్ పేమెంట్ ఎందుకు చేయలేదు : మంత్రి అనగాని సత్యప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి

**రేణిగుంట జూలై 22 ప్రభాతవార్త** గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లు ఎందుకు చేయలేదని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఘాటుగా స్పందించారు. రేణిగుంట పట్టణంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ గత వైసిపి ప్రభుత్వం మద్యం అమ్మకాలపై ఘాటుగా విమర్శించారు. చిన్న బత్తాయి జ్యూస్ అమ్ముకునే బండ్లలో డిజిటల్ పేమెంట్లు పెట్టినప్పుడు లక్షల కోట్లు రూపాయల వ్యాపారం జరిగే మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్ విధానాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మద్యం షాపులకు వచ్చిన నగదు ఏమైంది అంటూ ప్రశ్నించారు. నాసిరకమైన మందు తయారు చేసి ఎంతోమందిని చావుకు కారకులయ్యారన్నారు.చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు ఎప్పటికీ పాల్పడదని అన్నారు. 30 సంవత్సరాలు వెనక్కు వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత సంవత్సర కాలంలో ఎన్నికల మేనిఫెస్టోలని అంశాలను అమలుపరుస్తూ వస్తున్నారు. సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, పింఛన్ల పెంపుదల, విద్యార్థులకు చదువుల కోసం తల్లికి వందనం పథకాలను అమలుపరుస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

# విద్యుత్ కార్మికులకు అన్యాయం చేస్తారా!

### సిపిఐ రామకృష్ణ

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ రంగ సమస్యలపై యాజమాన్యం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎంఎల్ఏ కె రామకృష్ణ ఆరోపించారు.ఈ రంగాన్ని అదానీకి కట్టబెట్టి కార్మికుల పొట్టగొండతారా అని ప్రశ్నించారు. విద్యుత్ ఉద్యోగులు,కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ ఉద్యోగులు కార్మికులు ఆందోళన చేస్తున్నారు. వారి సీపీఐ సంఘీభావం ప్రకటించింది.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని చెప్పారు. ఏపీ ఎలక్ట్రికల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామలింగారెడ్డి మాట్లాడుతూ...జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు సర్వీస్ సిబంధనల్లో వివక్ష తొలగించి, అందరికీ సమానమైన ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలు చేయాలని ఏఎల్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య,గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషణ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మల్లిఖార్జునరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడారు.


# పౌరసరఫరాలశాఖ గోదాములో మంత్రి మనోహర్ ఆకస్మిక తనిఖీ

**గన్నవరం(కృష్ణా), జులై 22, ప్రభాతవార్త :** పౌరసరఫరాలశాఖ గోదాములో పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గన్నవరం మార్కెట్ యార్డులోని పౌరసరఫరాలశాఖ స్టాక్‌పాయింట్‌లో మంగళవారం మధ్యాహ్నం మ ంత్రి మనోహర్ తనిఖీలు చేసారు. ఈసందర్భంగా గోదామును మొత్తం పరిశీలించారు. గోదాములో బియ్యం సంచులకు చిల్లులు పడి కారిపోయిన బియ్యాన్ని వేరే సంచుల్లోకి నింపిన సంగతిని గుర్తించిన ఆయన అధికారులను మందలించారు. గత మూడు నెలలుగా గోదాముకు వచ్చిన స్టాక్ డీలర్లకు పంపిణీ చేసిన స్టాకు వివరాలను తనకు పంపించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ బియ్యాన్ని బడి బియ్యాన్ని వేరే వ్వేరుగా నిల్వచేయాలని సూచించారు. గత కొంతకాలంగా రేషన్ సంచుల్లో బియ్యం తగ్గుతున్నాయన్న డీలర్ల ఫిర్యాదు మేరకు బియ్యం బస్తాలను తూకం వేసి బరువులు పరిశీలించారు. పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని అక్రమాలర్కుపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా మంత్రి హెచ్చరించారు.

# బంగారు కుటుంబాల గుర్తింపునకై ప్రత్యేక సర్వే

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పీ4 జీరో పావర్టీ కార్యక్రమంపై ప్రత్యేక సర్వే చేయిస్తోంది. 12 ప్రశ్నలతో సర్వే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా యాప్ ద్వారా సర్వే చేస్తోంది. గ్రామ, వార్డ్ సచివాలయాల పరిధిలో ఈ సర్వే కొనసాగుతోంది. కుటుంబంలో ఎంతమంది ఉన్నారు.. ఇతర ప్రాంతాల్లో ఎవరున్నారు అనే అంశంపై సర్వే చేయిస్తోంది. ఆస్తులు ఎన్ని.. ప్రభుత్వం ఇస్తున్న పథకాల వివరాలపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. కార్, టూ వీలర్, భూమి ఉన్నాయా అని ప్రశ్నలు అడుగుతున్నారు. టీవీ ఫ్రిజ్..ఉన్నాయా...అని ప్రశ్నిస్తూ అధికారులు సర్వే చేస్తున్నారు. భవిష్యత్‌లో ఉద్యోగం కావాలా?.. బ్యాంక్ లోన్ కావాలా?..లేదా బిజినెస్ పెట్టుకుంటారా?. ఇలా పలు ప్రశ్నలని అడుగుతూ అధికారులు సర్వే చేస్తున్నారు. వ్యవసాయ రుణాలు, ఆదాయం వృద్ధి కోసం ఏమి కావాలనే అంశంపై ప్రశ్నలు అడుగుతున్నారు. వచ్చే నెల (ఆగస్టు) 5వ తేదీ వరకు ప్రభుత్వం సర్వే చేయనుంది. ఈ సర్వే అనంతరం ఆగస్టు 15వ తేదీన ఏపీ ప్రభుత్వం బంగారు కుటుంబాల ప్రకటన విడుదల చేయనుంది.

# నలుగురిని చదివించేందుకు ముందుకు వచ్చిన విదేశీ విద్య పథకం లబ్ధిదారుడు సాత్విక్


స్కాలర్ షిప్ పేరుతో ఆర్థిక సాయం అందిస్తానంటూ సీఎం చంద్రబాబుకు ధృవీకరణ పత్రం అందిస్తున్న సాత్విక్

**విజయవాడ జులై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఉపయోగపడాలి. అప్పుడే ఆ పథకాలకు సార్థకత చేకూరుతుంది. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఇప్పుడు ఆ పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నాడు ఆర్థిక సాయం పొందిన చేతులు.. ఇప్పుడు పేదలకు సాయం చేయడానికి ముందుకు వస్తున్నాయి. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును యువ వ్యాపారవేత్త సాత్విక్ మురారి కలిశారు. 2016 సంవత్సరంలో విదేశీ విద్యా పథకం కింద ఐర్లాండులో చదువుకోవడానికి నాటి టీడీపీ ప్రభుత్వం సహకరించిందని ముఖ్యమంత్రికి సాత్విక్ వివరించారు. ప్రభుత్వం అందించిన సాయంతో బిజినెస్ మేనేజ్మెంట్లో ఐర్లాండులో ఎంఎస్ విద్యను అభ్యసించానని చెప్పారు. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం చేసిన తాను.. ఇప్పుడు ఐర్లాండులో వ్యాపారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నాడు ప్రభుత్వం నుంచి సాయం పొందిన తాను.. ఇప్పుడు విదేశాల్లో చదవాలని ఆసక్తి చూపించే పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఉద్దశంతో ఉన్నట్టు సాత్విక్ చెప్పారు.

# ఎన్ఎంసి ప్రమాణాలు లేని బలీజ్, కొలంబస్, వాషింగ్టన్, చిర్జిక్ విదేశీ వైద్య విశ్వవిద్యాలయాలో చేరకండి

### - వైద్య విద్యకోసం విదేశాలకు వెళ్లే వారికి ఎన్ఎంసి హెచ్చరిక

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు కొన్ని అంశాలు గుర్తించాలనిజాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) హెచ్చరించింది.అది గుర్తించకపోతే నష్టపోతారని స్పష్టం చేసింది. ఆయా దేశాల్లోని వైద్య కళాశాలలు ఎన్ఎంసీ ప్రమాణాలకనుగుణంగా ఉన్నాయో లేదో సరిచూసుకోకపోతే నష్టపోతారని తెలిపింది ఆ మేరకు ఎన్ఎంసీ విడుదల చేసిన 'అలర్ట్ నోటీస్'లో హెచ్చరించింది. ముఖ్యంగా బలీజ్ దేశం లోని సెంట్రల్ అమెరికన్ హెల్త్ అండ్ సైన్సెస్ యూనివర్సిటీ, పాటు...ఉజ్బెకిస్థాన్ లోని చిర్చిక్ బ్రాంచ్ ఆఫ్ చేరవద్దని సూచించింది.



మెగా జాబ్ మేళాలో ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

# యువతకు ఉద్యోగాలు వారి కుటుంబాలకు గేమ్ ఛేంజర్

### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, జూలై 22 ప్రభాతవార్త** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం వారి కుటుంబాలకు గేమ్ ఛేంజర్ లాంటిదని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం కడ కార్యాలయంలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) అధ్వర్యంలో వన్ఎంటువన్‌బి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 35కు పైగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 600మందికి పైబడి యువతీయువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. యువగళ ం పాదయాత్ర సందర్భంగా ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలను రానున్న నాలుగేళ్లలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పించేందుకు సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కడ ద్వారా కుప్పానికి వివిధ సంస్థల ద్వారా జాబ్ మేళాల నిర్వహణకు ఆదేశించారన్నారు. యువత తమకు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అతిత్వరలోనే స్థానికంగానే యువతకు ఉపాధి కల్పనకు వివిధ రకాల పరిశ్రమలు వస్తున్నాయన్నారు. యువత ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్‌లు మాట్లాడుతూ కుప్పంలో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. యువతీయువకులు కష్టపడి చదివించిన దానికి ఫలితాలు ఇవ్వాలని సూచించారు. కుప్పంలో ఇది రెండో మెగా జాబ్ మేళా అని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో కడ సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, రామచంద్ర, సుగుణమ్మ, సతీష్, వెంకటేష్, రఘు, వన్ఎంటువన్‌బి సంస్థ ప్రతినిధులు స్నేహ, దీపిక వెంకటేష్,మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జగన్మాతకు వేడుకగా పారిశుద్ధ్య విభాగం ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జూలై 22, ప్రభాతవార్త** దుర్గమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి అక్కడినుండి ప్రత్యేకమార్గం ద్వారా శ్రీ అమ్మవారి దర్శనానికి సులభంగా వచ్చేలా నూతన ప్రణాళిక గురించి ఇఒ వికె శీనా నాయక్ మంగళవారం చర్చించారు. లిఫ్టుమార్గ ంలో భక్తుల రద్దీ తగ్గించడానికి ఈఓ ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. ద ు ర్గ మ్మ వా రి కి ఆలయంలో అన్నదాన


ఆషాడం సారె ను తీసుకొచ్చిన పారిశుద్ధ్య విభాగంవారు



విభాగంలో సేవలందిస్తున్న ఉద్యో గులు మంగళవారం ఆషాడం సారెను అందించారు. ముందూ అర్జున వీధిలోని శ్రీ శృంగేరీ జగద్గురు మఠం నందు శ్రీ అమ్మవారికి ఇఒ వికె శీనా నాయక్ కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను తీసుకుని శ్రీ అమ్మవారి ఆలయానికి రాగా అక్కడ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో మంత్రపఠనాల నడుమ స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవారికి నివేదించారు. వన్‌టౌన్ పోలీస్, ట్రాఫిక్ విభాగం వారితో కలిసి ఈ మేరకు భక్తులు దుర్గమ్మ దర్శనానికి వచ్చే మార్గాన్ని పరిశీలించారు. ముందుగా కేశఖండన శాల వద్ద నుండి భక్తులు నేరుగా దుర్గాఘాట్ వద్దకు చేరుకుని అక్కడ స్నానాలాచరించి, అక్కడ వారి సెల్‌ఫోన్లు, బ్యాగులు పెట్టుకోడానికి కౌంటర్ల వద్ద పెట్టుకుని అక్కడినుండి నేరుగా దుర్గమ్మ దర్శనానికి నడక మార్గం ద్వారా కాని, లేదా రిటైనింగ్ వాల్ వద్ద నుండి ఏర్పాటు చేసిన బస్సు ద్వారా రావడానికి ఏర్పాట్లు చేయడానికి ఈవో పరిశీలన చేశారు. దీనిద్వారా కనకదుర్గానగర్, జగద్గురు మఠం నందు శ్రీ అమ్మవారికి ఇఒ వికె శీనా నాయక్ కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను తీసుకుని శ్రీ అమ్మవారి ఆలయానికి రాగా అక్కడ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో మంత్రపఠనాల నడుమ స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవారికి నివేదించారు. దుర్గమ్మవారికి ఆలయంలో పారిశుద్ధ్య విభాగంలో సేవలందిస్తున్న ఉద్యోగులు మంగళవారం ఆషాడం సారెను అందించారు. ముందూ జమ్మిదొడ్డిలో ప్రారంభ కార్యక్రమం నందు శ్రీ అమ్మవారికి ఇఒ వికె శీనా నాయక్ కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను తీసుకుని శ్రీ అమ్మవారి ఆలయానికి రాగా అక్కడ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో మంత్రపఠనాల నడుమ స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవారికి నివేదించారు. జగన్మాత దుర్గమ్మ వారికి మంగళవారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమరి ్పంచారు.

మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు.

ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు.

# యేడాదిలో 9.50 లక్షల కోట్ల పెట్టుబడులు

### - రూ.1.50 కోట్లతో నిర్మించిన రహదారి ప్రారంభోత్సవం - సమస్యలపై పోరాడే నాయకులు ఉండటం మీ అదృష్టం - పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్



**కోవూరు (నెల్లూరు), జూలై 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం పదిలంగా ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు ఏడాది కాలంలో చేసిన మంచిని వివరించేందుకు ప్రజల మధ్యకు వచ్చినట్లు ఆయన వివరించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంకు వచ్చిన రాష్ట్ర మంత్రి టిజి భరత్ కి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా పోతిరెడ్డిపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం.. రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పోతిరెడ్డిపాలెం బ్రాంచ్ రోడ్డు, పోతిరెడ్డిపాలెం నుంచి గిరిజన తిప్ప వెళ్లే రోడ్లను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తో కలిసి మంత్రి భరత్ ప్రారంభించారు. అనంతరం పోతిరెడ్డి పాలెం గ్రామంలో 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రోడ్లకు ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. పోతిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీవాణి కాలనీలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, మంత్రి భరత్‌కు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ.. ఆప్యాయంగా పలకరించారు. సుపరిపాలన కరపత్రాలు అందించి ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న వారి కళ్లలో సంతోషం చూశారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో సంతోషంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని నేతలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ సమస్యలే పరిష్కారంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పనిచేస్తున్నారని, ఆ విషయాన్ని తాము ప్రత్యక్షయంగా చూస్తున్నామన్నారు. ఎప్పుడు ఎక్కడ పలకరించినా.. ప్రజా సమస్యలనే ప్రస్తావిస్తుంటారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనితీరును ఆయన కొనియాడారు. గత పాలనలో అధ్వానంగా మారిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి బుద్ది చెప్పినా వారి తీరు మారడం లేదని, ఇటీవల ప్రశాంతమ్మను అసభ్య పదజాలంలో మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు. సీఎం చంద్రబాబు ఒక విజన్‌తో పాలన సాగిస్తున్నారని, ఆయన విజన్‌కు నేటి హైదరాబాద్ నిదర్శనమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సుస్థిర ప్రభుత్వాలు అత్యవసరమని ఆయన వ్యాఖ్యానించారు.

భవిష్యత్తులో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వమే రావాలన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాదిలో 9.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇది చంద్రబాబు నాయుడు బ్రాండ్ అని చెప్పారు. ఇది పనిచేసే ప్రభుత్వమని, ఎంజాయ్ చేసే ప్రభుత్వం కాదన్నారు.

# లోకాయుక్త జోక్యంతో.. పోలవరం నిర్వాసితులకు న్యాయం

**కర్నూలు, జూలై 22, ప్రభాతవార్త :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులలో కొందరికి అన్యాయం జరగడంపై లోకాయుక్త స్పందించి విచారణ చేపట్టింది. ఆ మేరకు బాధితుల ఫిర్యాదును సమర్థిస్తూ వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంది. పోలవరం ప్రాజెక్టు పునఃనిర్మాణం మరియు పునః నిర్మాణ ప్యాకేజీ కింది నిర్వాసితులకు సరైన పరిహారం అందజేయడం ద్వారా పౌరుల హక్కులను వరిరక్షించడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త మరియు ఉపలోకాయుక్త సంస్థ మరోసారి కీలక పాత్ర వహించింది. పోలవరం ప్రాజెక్టు క్రింద ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ప్రయోజనాల నుండి తమను మినహాయించటంపై నల్లాల వెంకట రమణమ్మ మరియు నల్లాల శేషగిరి లోకాయుక్త లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదిదారుల నివాసాలు ప్రభావిత ముంపు ప్రాంతంలో ఉన్నప్పటికీ... వారిని లబ్దిదారుల జాబితాలో చేర్చకపోవటంపై లోకాయుక్త సంస్థ విచారణ చేపట్టింది. వారి ఫిర్యాదులో న్యాయం ఉందని తేల్చడంతో పాటు.. బాధితులకు లబ్ధి చేకూర్చాలని ఆదేశించింది. ఆ మేరకు ధవలేశ్వరం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్వాహకుడు జిల్లా జాయింట్ కలెక్టర్ లోకాయుక్త కు నివేదిక సమర్పించారు. అందులో ఫిర్యాదిదారులను సప్లమెంటరీ డ్రాఫ్ట్ ఆర్ అండ్ ఆర్ పథకంలో చేర్చరని, మరియు ఫిర్యాదిదారులకు ఇంటిస్థలం కేటాయింపుతో పాటు రూ.6,36,000 మరియు రూ.25,000 ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి క్రింద చెల్లించబడిందని నిర్ధారించారు.

# జులై నెల పెన్షన్ల పంపిణీ కోసం రూ.617.54 కోట్ల నిధులు కేటాయింపు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా జులై నెల పెన్షన్ల పంపిణీ కోసం రూ.617.54 కోట్లను బలహీన వర్గాల సంక్షేమశాఖకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కె సునీత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు కార్పొరేషన్ల సిఇఒ, పర్సన్ ఇన్‌ఛార్జుల పీడీ ఖాతాలకు ఈ మొత్తాన్ని జమ చేశారు. ఎపి స్టేట్ ఐబిసి కార్పొరేషన్‌కు రూ.28.73 కోట్లు, ఎపి కాపు కార్పొరేషన్‌కు రూ.292.37 కోట్లు, ఎపి రెడ్డి కార్పొరేషన్‌కు రూ.120.84 కోట్లు, ఎపి కమ్మ కార్పొరేషన్‌కు రూ.104.73 కోట్లు, ఎపి క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.16.95 కోట్లు, ఎపి బ్రాహ్మణ్ కార్పొరేషన్‌కు రూ.18.48 కోట్లు, ఎపి వైశ్య కార్పొరేషన్‌కు రూ.35.41 కోట్లు మంజూరు చేశారు.

# అల్లూరులో బైకులు అడ్డు తగలడంతో వ్యక్తి మృతి

**అల్లూరు (నెల్లూరు), జూలై 22, ప్రభాతవార్త :** అల్లూరులోని గోడౌన్స్ లు వద్ద బైకులు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు వివరాలు మేరకు అల్లూరు మండల పరిధిలోని పురిణి పంచాయితీ మందిర ప్రాంతంలోని హరిజనవాడకు చెందిన పొంగులూరి శ్రీహరి 28 మృతి చెందాడు మృతుడు శ్రీహరి అల్లూరు వైపు బైక్ మీద వస్తుండగా గోడౌన్స్ లోపల నుండి రోడ్డుపైకి వచ్చిన బైకును రాసుకుంటూ ఎదురుగా వస్తున్న మరో బైక్ కు మృతుడు చొక్కా తగులుకొని రోడ్డు మీద పడటంతో తలకు బలమైన దెబ్బ తగిలి రక్తపు మడుగులో అక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## రేపు ఎన్‌జి.రంగా వ్యవసాయవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

**గన్నవరం(కృష్ణా), జులై 22, ప్రభాతవార్త :** ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం స్నాతకోత్సవాన్ని ఈనెల 24వతేదీ నిర్వహించనున్నట్లు యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి తెలిపారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆవరణలో గురువారం జరుగుతుందన్నారు.

23-7P□g7exHMNWJQE.qxd:23-7P□g7exHMNWJQE.qxd 01/01/01 9:22 AM Page 1



# బ్యాంకుల రుణమాఫీలో రూ.లక్ష కోట్ల అవినీతి

## మాజీ ఎంపి చింతా మోహన్..

**కడప కార్పొరేషన్ జూలై 22 ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 11 సంవత్స రాలలో రూ.14.50 లక్షల కోట్ల లు నాన్ పెర్ఫార్మింగ్ అసెట్ (ఎన్ పి ఏ) బ్యాంకుల ద్వారా రుణమాఫీ చేసిందని, అందులో పది శాతం కమిషన్ తీసుకుని లక్ష కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. సోమవారం కడప వైయస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో, ఎవరెవరికి ఎంత రుణమాఫీ చేశారో వివరాలతో కూడిన జాబితాను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. లక్ష కోట్ల రూపాయల అవినీతిపై సిబిఐ, ఈడి ద్వారా విచారణ జరిపించాలన్నారు. అమరావతిలో నీటిపై చంద్రబాబు నాయుడు రాజధాని నిర్మిస్తున్నారని ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. అమరావతిలో ఎక్కడ తనకు దేవతలు కనిపించడం లేదని, కర్ర తుమ్మ చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం లేదన్నారు. రాజధాని విషయంలో రాష్ట్రంలోని 20 జిల్లాల ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. రాజధాని విషయంలో పునరాలోచించుకోవాలన్నారు. రాయలసీమలో రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తే 25 లక్షల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేశాక గోదావరి నీళ్లు, బనకచర్ల గురించి ఆలోచిస్తే బాగుంటుందన్నారు.

## నేడు గాంధీభవన్‌లో ముఖాముఖికి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడానికి బుధ వారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,దివ్యాంగులు సం క్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గాంధీ భవన్‌కు రానున్నారు.టిపిసిసి చీఫ్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే విన్నపాలు మంత్రికి ఇవ్వడానికే ఈ కార్యక్రమం దోహదపడు తోంది. అడ్లూరి లక్ష్మన్ మంత్రిగా ఇటీవలే పదవి బాధ్యతలు తీసుకొని తొలిసారి విన్నపాలు స్వీకరణకు మంత్రులతో ముఖాముఖి కార్యక్ర మానికి వస్తున్నారు.



తాటి, ఈత వనంలో కార్మికులతో తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ తదితరులు

# కల్తీ పేరిట కల్లు నిషేధానికి కుట్రలు

### గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయొద్దు

### కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** కల్తీ పేరిట ఔషధ గుణాలు కలిగిన కల్లును నిషేధించేందుకు కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ అన్నారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయ్యవద్దన్నారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కామారెడ్డి హన్మాండ్లు గౌడ్‌తో పాటు యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగాల గోవర్ధన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పులి లక్ష్మీపతిగౌడ్,కార్యాలయం కార్యదర్శి టి.భిక్షపతి గౌడ్‌లు మాట్లాడారు. తొలుత హన్మాండ్లు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కల్తీ కల్లు నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీకి పాల్పడిన దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. కొందరు చేసిన తప్పుకు నగరంలోని కల్లు దుకా ణాలన్ని మూసివేసి ఔటర్‌రింగ్ రోడ్డుకు తరలి స్తారని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నగరంలో కల్లు సొసైటీలోని దుకా ణాలను యధావిధిగా కొనసాగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

దుకాణాలను ఔటర్ కు తరలిస్తే వేలాది మంది కల్లుగీత కార్మికులు, సొసైటీల్లోని కల్లు డిపో వర్కర్లు, పారిశ్రామికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రమాదవశాత్తు ఈత, తాటి చెట్ల పైనుండి పడి మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయంలో చాలా జాప్యం జరుగుతున్నదన్నారు. దీనిని నివారించి తక్షణమే ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన నీరాకేఫ్ ప్రాంగణం లోకి తెలంగాణ ట్యాడి ట్యాపర్ కార్యాలయాన్ని తరలించాలని ఆయన ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కల్లు గీత కార్పొరే షన్‌కు వెంటనే పాలక కమిటీని నియమించాలన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఐక్యత చాటుతున్న బిసి నేతలు

## రాంచంద్రరావు వ్యాఖ్యలపై మండిపడ్డ బిసి నేతలు

### తమిళనాడులో సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు

### సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లి ప్రధానిపై ఒత్తిడి చేయాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 22 ప్రభాతవార్త:** బిసిల 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు న్యాయప రమైన అంశాలపై అవగాహన లేదని, పూర్తి అజ్ఞానంతో వ్యాఖ్యలు చేశారని జాతాయ బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య ఆరోపించారు. తమిళనాడులో 4 సార్లు అఖిల పక్ష సమావేశం నిర్వహించి 3 సార్లు తీర్మానం చేసి రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం చేసి బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చడం జరిగిందని ఆయన వివరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ లను 9వ షెడ్యూల్డ్‌లో పెట్టె విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేయాలని, ప్రభుత్వం చేసిన కులగణను బహిర్గతం చేయకపోవ డమంటే సమాజాన్ని తప్పుదారి పట్టించడమేనని ఆరోపించారు.బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ రాంచంద్రరావు ఢిల్లీలో బిసిల రిజర్వేషన్‌లపై చేసిన ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిసి బిల్లుకు అమోదం తెలిపిన బిజెపి, కేంద్రంలో ఎందుకు వ్యతిరేకిస్తున్నదని ప్రశ్నిం చారు. ఇక నుంచి తమ పోరాటాలు ఢిల్లీ నుంచి కొనసాగిస్తామని, తమిళనాడు రిజర్వేషన్‌లు సాధ్యమైనప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కావని ప్రశ్నించారు. 4శాతం ఉన్న ఒసిలకు 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లను కేంద్రం కల్పించిం దని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళి ప్రధాని నరేంద్ర మోదీపై వత్తిడి చేసి బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు బాలగోని బాలరాజుగౌడ్, అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, కె.వి.గౌడ్, చామకూర రాజుగౌడ్, అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై డిజిపి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో మహిళల భద్రతకు సంబంధించి డిజిపి జితేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. మహిళా భద్రతా విభాగం నేతృత్వంలో జరిగిన ఈ సమావేశం డిజిపి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సిఐడి చీఫ్ చారు సిన్హాతో పాటు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి, రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబు, మహిళా భద్రతా విభాగం డిఐజి రెమా రాజేశ్వరితో పాటు ట్రై కమిషన రేట్ల భద్రతా మండలి అధికారులు కూడా హా జరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి జితేం దర్ మాట్లాడుతూ ట్రై కమిషనరేట్లలో మహిళల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో సైబరాబాద్ కమిషనరేట్ ముందంజలో వుందని ఆయన తెలిపారు. మహిళల భద్రతకు సంబంధించి ట్రై కమిషనరేట్ల అధికారులు పరస్పర సహ కారంతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి వున్న భరోసా కేంద్రాలు, షీ బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగంతో కలిసి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ విషయంలో ట్రై కమిషనరేట్ల సెక్యూరిటీ కౌన్సిల్స్ సభ్యుల సహకారం తీసుకోవాలని ఆయన కోరారు.

# సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై దృష్టి: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ప్రభుత్వాస్పత్రుల్లో సహజ ప్రసవాలు విస్తృతం మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేయాలన్నారు. ఈ దిశగా సుశిక్షితులైన మిడ్‌వైవ్స్ (ప్రసూతి సహా యకులు) ద్వారా సహజ ప్రసవాల్ని ప్రోత్సహించే పథకానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ప్రసవ సమయాల్లో ప్రభుత్వాసుపత్రుల్లోని స్టాఫ్ నర్సులే ప్రసూతి సేవల్ని అందిస్తున్నారు. వీరికి వివిధ అంశాలపై తగిన పరిజ్ఞానం, శిక్షణ కొరవడడంతో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈలోటును తీర్చేందుకు ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 18 నెలల పాటు ప్రసవానికి ముందు, ప్రసవ సమయం, ప్రసవానంతర సేవలకు సంబంధించిన అంశాలపై సమగ్ర శిక్షణ అందించి మహిళలు సహజ ప్రసవాల పట్ల మొగ్గు చూపేలా ఈ ప్రత్యేక పథకాన్ని రూపొందించారు.తొలి విడతలో సంవత్సరానికి 600 నుంచి 6000 పైగా ప్రసవాలు జరుగుతున్న 86 ప్రభుత్వాసుపత్రుల్లో సుశిక్షితులైన 1264 మంది ప్రసూతి సహా యకుల్ని(మిడ్‌వైవ్స్) నియమిస్తారు. వీరు వివిధ సమయాల్లో అందించాల్సిన సేవలు, విధులపై సమగ్ర జాబ్ చార్టును రూపొందించి ప్రసూతి సేవల నాణ్యతను ఈ పథకం కింద పెంచుతారు. ఔట్ పేషెంట్(ఓపీ) సర్వీసుల్లో భాగంగా గర్భవతుల పూర్వ ఆరోగ్య వివరాలు, ప్రస్తుత స్థితి, ప్రసవ విషయ పరిజ్ఞానం, సరైన పోషణ, వ్యాయామ అవసరాలు, సహజ ప్రసవాల వల్ల కలిగే లాభాలను శిక్షణ పొందిన మిడ్‌వైవ్స్ అందిస్తారు. లేబర్ రూముల్లో ప్రసవ నొప్పులకు సంబంధించిన విషయ పరిజ్ఞానం మరియు వాటిని భరించే విధానం, సహజ ప్రసవానికి అవసరమైన సలహాలు, ఏవైనా క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే అవకాశాల గుర్తింపు మరియు చేపట్టాల్సిన చర్యలపై వీరు తగు సలహాలిస్తూ అప్రమత్తంగా ఉంటారు. ప్రసవానంతరం తల్లి మరియు బిడ్డ ఆరోగ్య పరిస్థితి అంచనా, తల్లిపాల విశిష్టతను వివరించడంతో పాటు తల్లీబిడ్డల మధ్య మానసిక అనుబంధాన్ని పెంచడం, ప్రసవానంతరం ఎదురయ్యే సమస్యలపై దృష్టి పెడతారు. ప్రస్తుత స్టాఫ్ నర్సుల విషయ పరిజ్ఞానం, శిక్షణా రాహిత్యాల వలన ప్రసవ సమయాల్లో డాక్టర్ల పాత్ర ఎక్కువగా ఉండడంతో...సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఒక అంచనా. కేంద్ర ప్రభుత్వ సాయంతో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ హెచ్ ఎం) కింద అమలయ్యే ఈ పథకానికి సంబంధించిన పలు అంశాల్ని లోతుగా చర్చించి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ పథకం విస్తృతిని పెంచాలని, గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాలు నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి కేంద్రంలోనూ ఒక సుశిక్షిత ప్రసూతి సహా యకురాలు(మిడ్‌వైఫ్) ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఈ పథకం కింద ఎంపిక చేసిన ప్రతి స్టాఫ్ నర్సుకు 18 నెలల పాటు సమగ్రమైన శిక్షణ అందించడానికి స్టైపెండ్‌తో కలిపి రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా.2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం ప్రసవాల్లో 56.12 శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగినట్లు సమాచారం.

ఇందులో ప్రభుత్వాసుపత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 41.40 శాతం సిజేరియన్లు కాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 67.71 శాతం మేరకు సిజేరియన్ ప్రసవాలు జరిగాయి.

# ప్రాంతాల మధ్య వైరుధ్యాల సృష్టికి పన్నాగం

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** ప్రాంతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోలని బిఆర్‌ఎస్ నేతల పన్నాగం పన్ను తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపిం చారు. గాంధీ భవన్‌లో మంగళవారం అందు బాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో ఎమ్మె ల్సీ అద్దంకి దయాకర్ పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలను చేస్తున్న బిఆర్‌ఎస్‌పార్టీని రద్దు చేస్తే తప్పేంటి అని ప్రశ్నిం చారు. బనకచర్ల అనే లేని ప్రతిపాదనను వివాదం చేస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నా రని అద్దంకి దయాకర్ ఆరోపించారు. ఫాం హౌస్ కి పరిమితమైన కెసిఆర్‌కి ప్రతిపక్ష హోదా ఎం దుకు అని నిలదీశారు. కెసిఆర్ కుటుంబంలోని నలుగురిలో రాబోయే రోజుల్లో ముగ్గురు కలిసి ఉండే అవకాశం ఉందా? ఇంతకు కవిత ఏపార్టీలో ఉన్నట్లు అని అనుమానం వ్యక్తంచేశారు. ప్రాం తీయ విద్వేషాలు రెచ్చగొడుతు మీరు ఎంపిలు, ఎమ్మెల్యేలుగా ఎలా ఉన్నారని అద్దంకి ప్రశ్నిం చారు. బిఆర్‌ఎస్ ఆంధ్ర మీడియా అంటూ దా డులు చేసే పరిస్థితికి దిగజారిందని విమర్శిం చారు. బిఆర్‌ఎస్ పార్టీలో రెండో నెంబర్ వ్యక్తి ఆ పార్టీలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆ పార్టీలో అదే తంతు కొనసాగుతుందన్నారు. అరెస్టులు,కేసులంటే బిఆర్‌ఎస్ నేతలకు భయం పట్టుకుంది మీ హయాంలో స్పీకర్ పర్మిషన్ లేకుండా రేవంత్ రెడ్డి, కోదండరాం,కృష్ణయ్యను అరెస్టు చేశారని గుర్తుచేశారు.మేం ప్రశ్నిస్తే అరెస్టు చేశారు.మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేయకూడదని అన్నారు. వంటేరు ప్రతాప్ రెడ్డిని బెదిరించి మీ పార్టీలో చేర్చుకున్నారు.ఆయనను పోలీసులు కొట్టిన తీరు చూసి బాధ కలిగిందని గతాన్ని గుర్తు చేసుకున్నారు. బిఆర్‌ఎస్ ఇచ్చింది రేషన్ కార్డులు కాదు రేషన్ సీట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. మేము వచ్చాక కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. గ్రూప్-1 మీద కేసులు వేయడానికి బిఆర్‌ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నేతలను చూసి శకుని కూడా సిగ్గుపడే పరిస్థితి ఉందని అన్నారు. నిజ మైన ఉద్యమకారులు ఎవరో కాంగ్రెస్ ప్రభు త్వానికి తెలుసని బిఆర్‌ఎస్ చేసే విషప్రచార మాటలను నమ్మకండని అద్దంకి అన్నారు.అంతకు ముందు గాంధీభవన్‌లో ప్రతి రోజూ నిర్వహించే అందుబాటులో ప్రజా ప్రతినిధుల సమావేశంలో అద్దంకి పాల్గొని ఉద్యోగులు, స్థానికులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వాటి పరిశీలించి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన ఆర్జీలను ఎక్కువగా వచ్చాయని ఆయన తెలిపారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి వ్యతిరేకి

### తెలంగాణ బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి: రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి,వారు రాజీనామా చేస్తే ఎందుకు అమలు చేయరో చూద్దాం అంటూ రాష్ట్రరవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాందీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ బిజెపి అధ్యక్షుడు మరోసారి బిసి రిజరేషన్ వ్యతిరేకతతో తన అసలు నిజ స్వరూపాన్ని బయటపెట్టాడని బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ 9 వ షెడ్యూల్ లో చేర్చడం అసాధ్యం అంటున్నారని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమే,గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో జరిగిందని ఆయన ఉదహరిం చారు. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు,ఎమ్మెల్యేలు రాజీనామా చేసి జాతీయపార్టీపై ఒత్తిడి పెంచండి ఎందుకు రిజర్వే షన్లు అమలు కావో చూస్తాం, దీనిని సాధించిపెట్టండని ఆయన కోరారు. సుప్రీంకోర్టు లో ఇందిరా సహనీ కేసులో బిసి రిజర్వేషన్ పెంపు విషయంపై స్పష్టంగా చెప్పారు. రాష్ట్రాల దగ్గర ప్రామాణికమైన సమాచారం ఉంటే ఎంపెరికల్ డేటా ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారని ఆయన వివరించారు.అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్ ఆమోదం శాసన సభ ఆమోదం, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీలో ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకో వాల్సిన అంశంతప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని పొన్నం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నడుపుతున్న బిజెపి 9వ షెడ్యూల్ లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు తప్పకుండా చేర్చాల్సిందే అని డిమాండ్ చేశారు. గతంలో జనహిత అభియాన్ కేసులో ఇడబ్ల్యుఎస్ సందర్భంగా స్పష్టంగా చెప్పిందిని ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ ఇచ్చినప్పుడు 50 శాతం రిజర్వేషన్లు శ్లాబ్ ఎత్తివేశారని గుర్తు చేశారు. ప్రామాణిక నివేదిక ప్రకారం సమా చారం సుప్రీంకోర్టులో ఉందని మభ్యపెడుతుంది మీరు అని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి బిసి అని మభ్యపెట్టేమీరు కనీసం ఎల్పి లీడర్, పార్టీ అధ్యక్షపదవి కూడా బిసిలకు ఇవ్వకుండా బిజెపి కుల వివక్ష పాటిస్తోందని ఆయన దుయ్య బట్టారు.

# బిజెపి బిసి నేతలు రిజర్వేషన్ కోసం నోరు విప్పాలి

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్



**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** తెలంగాణలో విద్య,ఉద్యోగం,రాజకీయ అవకాశాలు పెంపొందిం చడానికి బిసిలకు 42శాతం రిజర్వేషన్ పెంపు కోసం బిజెపి హైకమాండ్‌పై ఒత్తిడి తీసుకొచ్చి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చ డానికి ఆ పార్టీ బిసి నేతలు నోరు విప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు వైఖరీలో బిసి రిజర్వేషన్ వ్యతిరేకంగా కనిపిస్తున్నదని అన్నారు. రాంచంద్రరావు బిసి రిజర్వేషన్లను ఆహ్వానిస్తున్నామని రాష్ట్రంలో చెపుతూ ఢిల్లీ వెళ్లగానే మాట మారుస్తున్నాడని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ లపైన మా రేవంత్ రెడ్డి చిత్తశుద్దిని పశ్నించే నైతిక హక్కు బిజెపి కి లేదని ఆయన అన్నారు. బిసి రిజర్వేషన్ల పైన మా చిత్తశుద్దిని మేం నిరూపించుకు న్నామని, 42 శాతం రిజర్వేషన్ల కోసం పకడ్బందీగా కులగణన చేశామని మంత్రి వర్గంలో ఆమోదించామని అసెంబ్లీలో చట్టం చేశాం గవ ర్నర్ దగ్గర నివేదించామని ఆది శ్రీనివాస్ వివరిం చారు. 9వ షెడ్యూల్ లో చేర్చాల్సింది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. 9వషెడ్యూల్ లో చేర్చాలని మేం జంతర్ మంతర్ దగ్గర ఇప్పటికే ధర్నా చేశామని కూడా గుర్తుచేశారు.పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించామని ఇప్పుడు బిసి రిజర్వేషన్ల కు వ్యతిరేకంగా పనిచేస్తే మేం సహించం అని ఆది హెచ్చరించారు. రామచంద్రరావు కూడా ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు నడ్డాను రిజర్వే షన్లపై నిలదీయాలని ఆదిశ్రీనివాస్ హితవు చెప్పారు.సొంత పార్టీని ఒప్పించుకోవడం చేతకాక మా పైన విమర్శలు చేస్తే సరిపోదని అన్నారు. తెలంగాణలోని వెనుకబడిన తరగతుల ప్రజలు బిజెపి దొంగ నాటకాన్ని గమనించాలని కోరారు. ఈటెల రాజేందర్,ధర్మపురి అర్వింద్ తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చడానికి నోరువిప్పాలని ఎందుకు బిజెపి బిసి నేతలు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు.

# దాశరథి కృష్ణమాచార్యకు సముచిత గౌరవం ఇవ్వని ప్రభుత్వం

### తెలంగాణ జాగృతి స్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




సభలో ప్రసంగిస్తున్న కల్వకుంట్ల కవిత, కె.శ్రీనివాస్, నాళేశ్వరం, అమ్మంగి తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 22 ప్రభాతవార్త :** నిజాం రాచరిక దుష్టపాలన నుండి తెలంగాణ విముక్తి కోసం కలమనే ఆయుధాన్ని పట్టి తెలంగాణ రాష్ట్ర సాకారానికి ప్రముఖభూమికను పోషించిన ఉద్యమ చరిత్ర కలిగిన మహోన్నతకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించడంలో నేటి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమై సముచిత గౌరవం ఇవ్వలేదని తెలంగాణ జాగృతి స్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచారం వ్యక్తపరి చారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో తెలంగాణ జాగృతి నిర్వహణలో జరిగిన దాశరథి శతజ యంతి ఉత్సవాలకు కె.కవిత ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రముఖకవి డా. నాళేశ్వరం శంకరం, సాహితీవేత్త డా. అమ్మంగి వేణుగోపాల్, సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, దాశరథి కుమారుడు లక్ష్మణ్ తదితరులతో కలిసి దాశరథి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించి ప్రసం గించారు.

మారుమూల గ్రామం చిన్నగూడూరు లోని పేద కుటుంబంలో జన్మించిన ఆయన గిరిజనులు, పేదప్రజల దీనస్థితిపై చైతన్యం కలిగించే ఎన్నో రచనలు చేశారని వివరించారు. సామాజిక వివక్షను తుడిచి పెట్టాలంటే కవిత్వమే ఆయుధమని ఉద్యమ కవితలు రాసారన్నారు. నిజామాబాద్‌లో దాశరథిని నిర్బందించిన జైలు వద్ద ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి పెద్దయెత్తున అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అగ్నిశిఖ పుస్తకాన్ని కవిత ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు.

అనంతరం కె.శ్రీనివాస్, నాళేశ్వరం శంకరం తదితరులు ప్రసంగించారు. సభా కార్యక్రమం అనంతరం అగ్నిశిఖ పేరిట జరిగిన కవిసమ్మే ళనంలో పలువురు కవులు తమ తమ కవితా గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.

## ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ కింద ఎపి నుంచి తక్కువ మంది నమోదు

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో 60 ఏళ్ళు నిండిన అసంఘటిత రంగ కార్మికులకు వారు కట్టే చందా ఆధారంగా నెలకు రూ.3 వేల పింఛను అందించే ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పథకం క్రింద ఏపీ నుండి తక్కువ మంది నమోదైనట్లు మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. మచిలీపట్నం జనసేన వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆమో ఈ మేరకు సమాధానమిచ్చారు. గత నాలుగేళ్ళలో దేశ వ్యాప్తంగటా ఈ పథకం కింద 5,94,074 మంది నమోదు కాగా ఆ ంధ్రప్రదేశ్‌లో ఆ సంఖ్య 20,275(3.41%) పరిమితమైనట్లు తెలిపారు. ఇందులో 88% మంది కేవలం 2022-23లో నమోదయ్యాయని,మిగిలిన సంవత్సరాల్లో రిజిస్ట్రేషన్లు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. పదేళ్ళలో 78.9% పెరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఇది 2014-15లో రూ.79,174 మేర ఒడగా,2024-25 నాటికి రూ.1,41,609కి చేరి 78.9% వృద్ధిని నమోదు చేసిందన్నారు.

## బిసి ద్రోహిగా మిగిలిపోనున్న బిజెపి

### 42శాతం ఆర్డినెన్స్ అడ్డుకోవడానికి బిజెపి బిఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ జూలై 22,ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైఖరితో బిసి ద్రోహిగా మిగిలిపోతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు అమలు కావొద్దన్నదే రామచంద్రరావు వైఖరీగా ఉందని ఆవేదన చెందారు. బిసిలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపి స్తారనే రామచంద్రరావు మొసలికన్నీరు కారుస్తు న్నారని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిపించినా రాష్ట్రానికి నిధులు తీసుకురాలేకపోతున్నారని కనీసం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఆమెదించిన బిల్లు కేంద్రానికి పంపితే ఆర్థికేతర అంశమైనా దానిని పట్టిం చుకోవడం లేదని ఆరోపించారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందుపరిచేందుకు కేంద్రంతో పోరాటం చేయలేని చేతగాని దద్దమ్మలు బిజెపి ఎంపిలని ఆయన విమర్శించారు.బండి సంజయ్, ఈటెల రాజేందర్, ధర్మపురి అర్వింద్ లాంటి వాళ్ల కేంద్రాన్ని ఎందుకు ఒప్పించలేకపోతున్నారు? అని ఆయన ప్రశ్నించారు.స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం మా రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ తీసుకువస్తు న్నారని ఆయన తెలిపారు.బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు రిజర్వేషన్ల పైనచేసిన వ్యాఖ్య లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లోపాయికారీ ఒప్పందం తో ఆర్డినెన్స్‌ను అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తున్నా యని ఆయన ఆవేదన చెందారు.

## సంతోష్‌నగర్ పోలీసు స్టేషన్‌లో యువకుడి అక్రమ నిర్బంధంపై హెచ్‌ఆర్‌సి సీరియస్

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** సంతోష్ నగర్ పోలీసు స్టేషన్‌లో ప్రశాంత్ కుమార్ అనే యువకుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధిం చడంతో పాటు చేయనితప్పును ఒప్పుకోమని బలవంతం చేయడంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. దీని పై బాధి తుడు కోర్టులో పోరాడుతుండగా దీనిని వెనక్కు తీసుకోవాలని సదరు యువకుడిని పోలీసులు మళ్లీ వేధిస్తుండడం సరైంది కాదని, ఈ విష యంలో వెంటనే పోలీసులపై చర్యలు తీసుకో వాలని డిజిపి జితేందర్‌కు హెచ్‌ఆర్‌సి సిఫార్సు చేసింది. ఫిర్యాదుదారుల భద్రతను పోలీసులు కాలరాయడం సరికాదని హెచ్ఆ ర్‌సి పేర్కొంది. ఫిర్యాదిదారుడిని పోలీసులు పదేపదే బెదిరిం చడం సరైంది కాదని హెచ్‌ఆర్‌సి పేర్కొంది.

## గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఎప్పుడిస్తారు?

### సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రమాదాలకు గురై మరణించిన కల్లుగీత కార్మి కులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం తెలం గాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికులు వృత్తిలో భాగంగా అనేక విధాలా ప్రమాదాలకు గురౌతున్నారని.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు ప్రభు త్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకుంటున్నా హామీ లే ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేద న్నారు. ప్రమాదాలకు గురైన వారికి తక్షణమే రాష్ట్రప్రభుత్వం బాధితులకు ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ కాలంలో దాదాపు 710 మంది వృత్తిదారులు ప్రమాదాలకు గురైతే వారిలో 130మంది మరణించగా 120 మంది శాశ్వత వికలాంగులయ్యారని సుమారు 460 మంది వికలాంగులయ్యారని గుర్తు చేశారు. ప్రమాదాలకు గురైన వారికి రూ.12.96 కోట్ల నిధులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు.

23-7pg10.qxd:23-7pg10.qxd 01/01/01 8:37 AM Page 1



# వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ తొలి రౌండ్‌లో మహిళా ప్లేయర్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025 ప్రారంభ రోజున భారతీయులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆరుగురు భారత మహిళా క్రీడాకారిణులలో ఐదుగురు తమ తొలి రౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. ఈజిప్టులోని కైరోలో జరిగిన వ్యక్తిగత స్క్వాష్‌లో భారత స్క్వాష్ క్రీడాకారులు విజయాలతో ఆరంభించారు. అండర్ 19 ఆసియా బాలికల స్క్వాష్ ఛాంపియన్ అనాహత్ సింగ్ మొదటి రౌండ్‌లో బై పొందగా, అండర్ 17 ఆసియా జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అనికా దుబే పోలాండ్‌కు చెందిన తోలా ఓట్రాసెక్‌ను 3-1 (9-11, 11-7, 11-9, 11-3) తేడాతో ఓడించింది. రుద్ర సింగ్, నవ్య సుందరరాజన్, మరియు ఆరాధ్య పోర్వాల్ తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలు సాధించారు. రుద్ర దక్షిణాఫ్రికాకు చెందిన చాంటే లెప్పన్‌ను 3-0 (11-6, 11-3, 11-3) తేడాతో ఓడించగా, నవ్య దక్షిణాఫ్రికాకు చెందిన డెనే వాన్ జైల్‌ను 3-0 (11-5, 11-8, 11-3) తేడాతో ఓడించింది. ఆరాధ్య పోర్వాల్ దక్షిణాఫ్రికాకు చెందిన మకైలా నాయుడును 3-0 (11-3, 11-3, 11-4) తేడాతో ఓడించింది. మరో వైపు ఉన్నతి త్రిపాఠి ఏకైక భారతీయురాలు, పోలాండ్‌కు చెందిన నటాలియా మియర్జె జ్యూస్కా చేతిలో 0-3 (11-13, 8-11, 9-11) తేడాతో ఓడిపోయింది. కాగా పురుషులలో అరిహంత్ కెఎస్, శివన్ అగర్వాల్ వారివారి మొదటిరౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. అరిహంత్ జర్మనీకిచెందిన రూఫస్ గెబార్ట్‌ను 3-0 (11-2, 11-4, 11-5) తేడాతో ఓడించగా, శివన్ ఐర్లాండ్‌కు చెందిన ఫ్రాంక్ ఓ ఫ్లిన్‌ను 3-0 (11-3, 11-3, 11-8) తేడాతో ఓడించాడు. అయితే, కరణ్ యాదవ్ ఈజిప్ట్‌కు చెందిన ఇయాద్ దౌద్ చేతిలో 3-0 (3-11, 4-11, 5-11) తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.






# వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో.. నిరాశతో ముగిసిన భారత్ ప్రచారం

## పరుగులో గురిందర్‌వీర్, మణికంఠ ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్-2025లో స్ప్రింటర్లు మణికంఠ, గురిందర్వీర్ ఆకట్టుకోలేకపోయారు. పురుషుల 100 మీటర్ల పరుగులో మణికంఠ హోబ్లిధర్ మరియు గురిందర్‌వీర్ సింగ్ సెమీస్‌కు చేరుకోలేకపోయారు. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో పురుషుల 100 మీటర్ల ఈవెంట్‌లో భారతదేశం యొక్క ప్రచారం నిరాశతో ముగిసింది, దేశంలోని ప్రముఖ స్ప్రింటర్లలో ఇద్దరు గురిందర్‌వీర్ సింగ్, మణికంఠ హోబ్లిదార్ ఇద్దరూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. హీట్ 7లో, గురిందర్‌వీర్ సింగ్ నిరాశపరిచే 11.00 సెకన్లు పూర్తి చేసి, నాల్గవ స్థానంలో నిలిచాడు మరియు ఆటోమేటిక్ అర్హత స్థానాలకు వెలుపల ఉన్నాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 10.20 సెకన్లు పూర్తి చేసి వార్తల్లో నిలిచిన ఈ పంజాబ్ స్ప్రింటర్, ప్రారంభం నుంచే లయ తప్పి ఎప్పుడూ తన గరిష్ట వేగాన్ని అందుకోలేకపోయాడు. ఇటీవలి సంవత్సరాలలో భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్లలో స్థిరంగా స్థానం సంపాదించిన 100 మీటర్ల స్పెషలిస్ట్ ఫామ్‌లో ఇది ఆశ్చర్యకరమైన క్షీణత. అతను రౌండ్ 1 లో పాల్గొన్న వారిలో మొత్తం 40వ స్థానంలో నిలిచాడు. ఇంతలో, 10.23 సెకన్ల మార్కుతో మాజీ జాతీయ రికార్డు హోల్డర్ అయిన మణికంఠ హోబ్లిదార్, హీట్ 8లో మరింత పోటీతత్వంతో కూడినా కాని నిరాశపరిచే పరుగును అందించాడు, 10.74 సెకన్ల సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతి హీట్‌లో మొదటి ఇద్దరు ఫినిషర్లు, మొత్తం మీద అత్యంత వేగంగా చేరే తదుపరి ఎనిమిది మందితో పాటు, సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. అయితే మణికంఠ సమయం వేగంగా కటాఫ్‌ను చేరుకోలేక పోవడంతో పోటీ నుండి నిష్క్రమించాడు. అతను ఫీల్డ్‌లో మొత్తం 26వ స్థానంలో నిలిచాడు.





# వాషింగ్టన్ డబుల్స్ ఓపెనర్‌లో.. వీనస్ విలియమ్స్ విజయం

**న్యూఢిల్లీ:** ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ వీనస్ విలియమ్స్ 16 నెలల్లో తన తొలి ప్రొఫెషనల్ టెన్నిస్ మ్యాచ్‌లో విజయం సాధించింది. హైలీ బాప్టిస్ట్‌తో కలిసి డీసీ ఓపెన్ మొదటి రౌండ్‌లో తోటి డబుల్స్ వైల్డ్ కార్డ్‌లు యూజీని బౌచర్డ్ మరియు క్లెర్వీ న్గౌనౌలను ఓడించింది. 3-1 తేడాతో వెనుకబడి, బ్రేక్ పాయింట్‌ను ఎదుర్కొన్న వీనస్ మరియు బాప్టిస్ట్ గత 12 ఆటలలో 11 ఆటలను గెలుచుకుని పుంజుకున్నారు. 2022లో మొదటి రౌండ్‌లో ఓటమి తర్వాత, వీనస్ డీసీ ఈవెంట్‌లో ఇది రెండవసారి. టోర్నమెంట్ కోసం వైల్డ్‌కార్డ్‌ను అంగీకరించిన 45 ఏళ్ల మాజీ ప్రపంచ నంబర్ వన్, మార్చి 2024లో మయామి ఓపెన్ తర్వాత పోటీ పడలేదు. చివరిగా ఆగస్టు 2023లో సిన్సినాటి ఓపెన్‌లో గెలిచింది. కాగా విలియమ్స్ సోదరీమణులు చాలా సంవత్సరాలుగా క్రీడలో ఆధిపత్యం చెలాయించడంతో, ర్యాంకింగ్ లేని వీనస్, మహిళల డబుల్స్‌లో సెరెనాతో కలిసి 14 ప్రధాన టైటిళ్లను గెలుచుకుంది. కాగా సింగిల్స్ పోటీలోని మొదటి రౌండ్‌లో ఆమె మరో అమెరికన్ పేటన్ స్టెర్న్స్‌తో తలపడనుంది. ఇక వాషింగ్టన్‌లో జరుగుతున్న పురుషుల సింగిల్స్‌లో బ్రిటన్‌కు చెందిన డాన్ ఎవాన్స్ మరియు కామెరాన్ నోరీ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. 2023లో వాషింగ్టన్ టైటిల్ గెలుచుకున్న ఎవాన్స్, జిజౌ బెర్గ్స్‌పై 36, 64, 63 తేడాతో కఠినమైన విజయాన్ని సాధించాడు. 35 ఏళ్ల వైల్డ్ కార్డ్ తదుపరి 13వ సీడ్ అమెరికన్ అలెక్స్ మైఖేల్‌సెన్‌తో తలపడనుంది. అలాగే నోరీ బ్రిటిష్ క్వాలిఫైయర్ బిల్లీ హారిస్‌ను 63 76 (74) తేడాతో ఓడించాడు మరియు రెండవ రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ సెమీ ఫైనలిస్ట్ మరియు ఇటలీకి చెందిన రెండవ సీడ్ లోరెంజో ముసెట్టిని ఎదుర్కొంటాడు.

# నేడు బిగ్ ఫైట్

## భారత్‌కు డూ ఆర్ డై మ్యాచ్.. సిరీస్ కైవసం కోసం ఇంగ్లండ్





**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి భారత్ ప్రస్తుతం 1-2 తేడాతో వెనుకబడి ఉంది. ఈ నెల 23 నుంచి మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్ కానుంది. ఇందులో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భారత్ భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేదా డ్రా చేసుకున్నా, సిరీస్‌ను గెలిచే అవకాశం భారత్‌కు ఉండదు. ఈ నాలుగో కీలక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఒక్క మార్పుతో బరిలోకి దిగుతోంది. టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టు తమ ప్లేయింగ్ 11ను ప్రకటించింది. గాయంతో సిరీస్ నుంచి తప్పుకున్న ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ లియమ్ డాసన్‌కు అవకాశం లభించింది. ఇంగ్లాండ్‌కు ఇది కీలకమైన టెస్టు కావడంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు అవకాశం ఇచ్చారు. దీంతో దాదాపు 8 ఏళ్ల తర్వాత డాసన్ టెస్టు జట్టులోకి వచ్చాడు. షోయబ్ బషీర్ గాయంతో దూరం కావడంతో డాసన్‌కు ఇంగ్లాండ్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. లార్డ్స్ టెస్టు మూడో రోజు షోయబ్ బషీర్‌కు గాయం అయింది. రవీంద్ర జడేజా కొట్టిన హిట్టింగ్ డ్రైవ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించిన సమయంలో అతని ఎడమ చేయి చిటికన వేలికి గాయం అయింది. భారత జట్టు విషయానికి వస్తే పేస్ బౌలింగ్ విభాగంలో గాయాల వల్ల సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆకాష్ దీప్ ఇంకా గాయాల నుంచి కోలుకోలేదు. అర్ష్‌దీప్ సింగ్ చేతి గాయంతో టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతను చివరి మ్యాచ్ కు కూడా అందుబాటులో ఉండే అవకాశం లేదని సమాచారం. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్ మాత్రమే ప్రస్తుతం భారత పేస్ బౌలింగ్ విభాగంలో ఫిట్ గా ఉన్నారు. 24 ఏళ్ల అన్షుల్ కంబోజ్‌ను రిజర్వ్‌గా జట్టులోకి తీసుకున్నారు. అతని లైన్‌లెంగ్త్ బౌలింగ్, క్రమశిక్షణ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ సహా కోచింగ్ సిబ్బందిని మెప్పించడంతో జట్టులోకి వచ్చాడు. ఇక భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ కు గత మ్యాచ్ లో చేతికి గాయం అయింది. భారత ఇన్నింగ్స్ సమయంలో పంత్ బ్యాటింగ్ చేయడానికి వచ్చారు. ప్రస్తుతం గాయం తగ్గడంతో తిరిగి కీపింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో స్వల్పంగా అసౌకర్యంగా ఉన్నా, అతను కీపింగ్ చేస్తూ కనిపించాడు. ఇది భారత జట్టుకు పెద్ద బలంగా మారనుంది. అయితే ఆకాష్ దీప్ గాయం మరోసారి తీవ్రతరం కావడంతో అతను ఆడటం కష్టమేనని సమాచారం.

# చైనా ఓపెన్‌లో వటనాబేను ఓడించిన ప్రణయ్



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2025, ఓపెనర్‌లో వటనాబేను హెచ్‌ఎస్ ప్రణయ్ ఓడించాడు. ప్రపంచ 18వ ర్యాంక్‌లో ఉన్న ఆటగాడిని ఓడించడానికి 5 మ్యాచ్ పాయింట్లను ప్రణయ్ ఆదా చేశాడు. మంగళవారం జరిగిన చైనా ఓపెన్ తొలి రౌండ్‌లో భారత అనుభవజ్ఞుడు ప్రణయ్ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్, ఆ సంవత్సరం జరిగిన చివరి సూపర్ 1000 టోర్నమెంట్‌లో 57 నిమిషాల థ్రిల్లర్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వటనాబేను 8-21, 21-16, 23-21 తేడాతో ఓడించాడు. ఈ సారి ప్రణయ్ తన ప్రచారాన్ని అస్థిరంగా ప్రారంభించాడు, దీంతో మొదటి గేమ్‌ను 8-21 తేడాతో కోల్పోయాడు. అయితే, అతను తిరిగి పుంజుకుని రెండవ గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకున్నాడు. చివరి సెట్ అత్యంత నాటకీయంగా మారింది. ఒక దశలో 2-11 తేడాతో వెనుకబడిన ప్రణయ్, 5 మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని గేమ్‌ను కైవసం చేసుకుని 23-21 ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించాడు. కాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్ దగ్గర పడుతున్న తరుణంలో, ప్రణయ్ తన కాంస్య పతక విజేత ప్రదర్శన కోసం ఎదురు చూస్తున్నాడు. డెన్మార్క్‌లో జరిగిన మునుపటి ఎడిషన్‌లో ప్రపంచ నంబర్ 1 విక్టర్ అక్సెల్సెన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఇక భారత్ మరో ప్లేయర్ లక్ష్యయ్ సేన్ మరోసారి మొదటి రౌండ్ నుండి నిష్క్రమించాడు, ఐదవ సీడ్ లీ షిఫెంగ్ చేతిలో 21-14, 22-24, 11-21 తేడాతో గంటలో ఓడిపోయాడు.

# వాణిజ్యం

# అనిల్ అంబానీని 'ఫ్రాడ్'గా వర్గీకరణ

**న్యూఢిల్లీ, జూలై 22:** భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్ కామ్), దాని ప్రమోటర్ డైరెక్టర్ అనిల్ డి. అంబానీలను అధికారికంగా 'ఫ్రాడ్'గా వర్గీకరించినట్టు పార్లమెంట్ తెలిపింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు ఫిర్యాదు చేసే ప్రక్రియలో బ్యాంక్ ఉన్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు రాత పూర్వక సమాధానంలో తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిర్దేశించిన మోసం రిస్క్ మేనేజ్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్స్, ఎస్‌బీఐ బోర్డు ఆమోదించిన పాలసీకి అనుగుణంగా జూన్ 13 న ఈ వర్గీకరణ జరిగినట్టు మంత్రి చౌదరి వివరించారు. ఈ వర్గీకరణను బ్యాంక్ జూన్ 24న ఆర్బీఐకి నివేదించింది. ఎస్‌బీఐకి ఆర్‌కామ్ పెద్ద మొత్తంలో బకాయి పడింది. ఇందులో రూ.2,227.64 కోట్ల ఫండ్ బేస్డ్ ప్రిన్సిపల్ బకాయి (ఆగస్టు 26, 2016 నుంచి వడ్డీ, ఇతర ఖర్చులు సహా), రూ.786.52 కోట్ల నాన్ ఫండ్ బేస్డ్ బ్యాంక్ గ్యారెంటీ ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఆర్‌కామ్ మొత్తం రుణం మార్చి 2025 నాటికి రూ. 40,400 కోట్లుగా ఉన్నట్టు నివేదించింది. చట్టపరమైన చిక్కులు ఆర్‌కామ్ ప్రస్తుతం 2016 నాటి ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియలో ఉంది. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ రిజల్యూషన్ ప్లాన్‌ను ఆమోదించి, మార్చి 6, 2020న ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద దాఖలు చేసినప్పటికీ, దాని ఆమోదం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ పరిణామాలకు తోడు ఎస్‌బీఐ అనిల్ డి. అంబానీపై వ్యక్తిగత ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఇది ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ ముంబై వద్ద విచారణలో ఉంది. గతంలో కూడా ఈ మోసం వర్గీకరణకు సంబంధించిన వివాదం తలెత్తింది. నవంబర్ 10, 2020న ఎస్‌బీఐ ఈ ఖాతాను, అనిల్ డి. అంబానీని మోసంగా వర్గీకరించి, జనవరి 5, 2021న సీబీఐకి ఫిర్యాదు చేసింది. అయితే, జనవరి 6, 2021న ఢిల్లీ హైకోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అనంతరం, సుప్రీం కోర్టు మార్చి 27, 2023న ఇచ్చిన తీర్పు (స్టేట్ బ్యాంక్ఆఫ్ ఇండియా.. ఇతరులువర్సెస్ రాజేష్ అగర్వాల్.. ఇతరులు కేసు) ప్రకారం, రుణగ్రహీతలకు మోసం వర్గీకరణకు ముందు తమ సమర్థనను వినిపించుకునే అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో, సెప్టెంబర్ 2, 2023న బ్యాంక్ గత మోసం వర్గీకరణను రద్దు చేసింది. అయితే, జులై 15, 2024న ఆర్బీఐ జారీ చేసిన కొత్త సర్క్యులర్ ప్రకారం తిరిగి ప్రక్రియ నిర్వహించి, ఖాతాను మళ్లీ మోసంగా వర్గీకరించింది.




# ఆల్‌టైమ్ గరిష్టానికి ఎటెర్నల్ షేర్లు

**ముంబై, జూలై 22:** జొమాటో, బ్లింకిట్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ షేర్లు కొత్త మైలురాయిని అందుకున్నాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మంగళవారం కంపెనీ షేర్లు రూ.311 వద్ద ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు దాటింది. నిఫ్టీ 50లో ప్రముఖ కంపెనీలైన విప్రో, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా వంటి కంపెనీలను అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్‌ఎస్‌ఇలో ఎటెర్నల్ షేర్లు 10 శాతం లాభంతో రూ.299.75 వద్ద ముగిశాయి. త్రైమాసిక ఫలితాల్లో ఎటెర్నల్ లాభాల్లో 90 శాతం క్షీణత నమోదైంది. కేవలం రూ.25 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. అదే సమయంలో ఆదాయంలో మాత్రం 70 శాతం వృద్ధి నమోదు చేసింది. గతేడాది రూ.4,206 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.7,167 కోట్లకు పెరిగింది. దీనికితోడు క్విక్ కామర్స్ విభాగమైన బ్లింకిట్ రాణించడంతో ఎటెర్నల్‌కు కలిసొచ్చింది. జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూను (ఎన్‌వీజు) తొలిసారి బ్లింకిట్ దాటేసింది. గతేడాదితో పోలిస్తే గ్రాస్‌ఆర్డర్ వాల్యూలో 140 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఇన్వెస్టర్లను మెప్పించింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు బ్రోకరేజీ సంస్థలు కూడా ఎటెర్నల్‌కు బై రేటింగ్ ఇచ్చాయి. నోమురా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.280 నుంచి రూ.300కు పెంచగా, నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన టార్గెట్ ప్రైస్‌ను రూ.290 నుంచి రూ.320కి సవరించింది. జెఫ్రీస్ అయితే ఏకంగా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.250 నుంచి రూ.400కు పెంచడం గమనార్హం. ఈ కారణంగా ఎటెర్నల్ షేర్లు దూసుకెళ్లాయి. గత 12 నెలల్లో ఎటెర్నల్ షేర్లు 33 శాతం రాణించగా, 2025 లో 7 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ విభాగంలో ఉన్న స్విగ్గీ షేర్లు కూడా రాణించాయి. ఎటెర్నల్ ఎఫెక్ట్‌తో 5 శాతానికి పైగా లాభంతో రూ.418 వద్ద ముగిశాయి.



# పేటీఎం నికర లాభం రూ.122.5 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలను మంగళవారం పేటీఎం పేరెంట్ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ విడుదల చేసింది. 2025-06 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నికర లాభం రూ.122.5 కోట్లుగా ప్రకటించింది. ఈ యేడాది ఈ సంస్థ భారీగా లాభాల్లోకి దూసుకెళ్లింది. గత త్రైమాసికంలో నివేదించబడిన రూ.540కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఈ యేడాది భారీగా పెరిగింది. కార్య కలాపాల ద్వారా కంపెనీ ఆదాయం రూ.1,918 కోట్లుగా ఉంది.




# ఎంఅండ్‌ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం 3.2% వృద్ధి

**ముంబై, జూలై 22:** మహీంద్రా అండ్‌మహీంద్రా (ఎంఅండ్ఎం) ఫైనాన్షియల్ సర్వీసెస్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. స్టాండ్ ఎలోన్ నికర లాభం రూ.3.2శాతం పెరిగి రూ.530 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.513 కోట్లుగా ఉంది. ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రామీణ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) మొత్తం ఆదాయం 18శాతం పెరిగి రూ.4,438 కోట్లకు చేరుకుంది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో రూ.3,760 కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 1000 కంటే ఎక్కువ కార్యాలయాలతో భారతదేశంలోని అగ్ర ట్రాక్టర్ ఫైనాన్సర్లలో ఇది ఒకటి.

# ఆరంభంలో లాభాలు..చివరికి ఫ్లాట్‌గా సూచీలు

**ముంబై, జూలై 22:** తొలి త్రైమాసిక ఫలితాల జోష్‌తో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. అయితే, అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడం, ట్రంప్ నిర్దేశించిన గడువు ఆగస్టు 1 దగ్గర పడుతుం డడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,527.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,200.34) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,110.63 82,538.17 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్ల నష్టంతో 25,060 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టైటాన్, బీఈఎల్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.49 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,396 డాలర్ల వద్ద కొనసాగింది.




# గూగుల్ 11వేల యూట్యూబ్ ఛానళ్లపై వేటు

**ముంబై, జూలై 22:** వివిధ దేశాలకు సంబం ధించి అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నా యని ఆరోపిస్తూ గూగుల్ దాదాపు 11వేల యూట్యూబ్ ఛానళ్లను తొలగించింది. వీటిలో చైనా, రష్యాకు చెందిన ఛానళ్లు టాప్ లిస్టులో ఉన్నట్లు వెల్లడించింది. తొలగించిన వాటిలో కేవలం చైనాకు సంబంధించినవే 7,700 యూట్యూబ్ ఛానళ్లు ఉన్నట్లు తెలిపింది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ పలు కంటెంట్‌లను పోస్టు చేస్తున్నాయని ఆరోపించింది. రష్యాకు చెందిన 2,000లకు పైగా యూట్యూబ్ ఛానళ్లు, ఇతర వెబ్‌సైట్లను తొలగించి నట్లు గూగుల్ వెల్లడించింది. ఈ ఖాతాల్లో ఉక్రెయిన్, నాటోలను విమర్శిస్తూ.. రష్యాకు మద్దతిచ్చేలా సందేశాలను వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. రష్యాలోని పలు సంస్థలకు కూడా ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. ఇటీవల గూగుల్ 20 యూట్యూబ్ ఛానెల్‌లు, నాలుగు ఖాతాలు, రష్యా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా సంస్థకు సంబంధించిన ఓ బ్లాగును తొలగించినట్లు వివరించింది. చైనా, రష్యాలతో పాటు ఇరాన్, తుర్కియే, ఇజ్రాయెల్, రొమేనియా, అజర్‌బైజాన్, ఘనాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు గూగుల్ తెలిపింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా అసత్య వార్తలు ప్రసారం చేస్తున్నందువల్ల వాటిని నిలువరించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. 2025 మొదటి త్రైమాసికంలో గూగుల్ 23,000లకు పైగా ఖాతాలను తొలగించింది. మెటా సైతం ఇటీవల దాదాపు 10 మిలియన్ల నకిలీ ప్రొఫైల్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.




# కాల్గేట్-పామోలివ్ లాభం రూ.363.98 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కాల్గేట్-పామోలివ్ లిమిటెడ్ నికర లాభం రూ.363.98 కోట్లకుచేరుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం కూడా 4.4శాతం తగ్గి రూ.1,420.64 కోట్లకు చేరుకుంది. వేగంగా కదిలే వినియోగ వస్తువుల మేజర్ యొక్క కార్యాచరణ లాభం రిపోర్టింగ్ త్రైమాసికంలో రూ.431.95 కోట్లు, ఇది గత సంవత్సరం రూ.489.25 కోట్ల కంటే తక్కువ. 'పట్టణ డిమాండ్ తగ్గడం, పెరిగిన పోటీ తీవ్రత కారణంగా కఠినమైన ఆపరేటింగ్ పరిస్థితుల నుంచి నిరంతర ఎదురుదెబ్బలను మా తొలి త్రైమాసిక ఫలితాలను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత త్రైమాసిక పనితీరు మునుపటి సంవత్సరం కంటే అధిక బేస్ సైకిల్ ద్వారా కూడా ప్రభావితమవుతుంది' అని మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రభా నరసింహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సవాళ్లను అధిగమించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ భాగంలో క్రమంగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14